S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

**7036644111, 9490140565**

సంపుటి: 19 | సంచిక: 189 | ఎడిటర్ : విక్రం కుమార్ | ఆదివారం 17 మే 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |



**బాలిక వాంగ్మూలం నమోదు**

.. వివరాలు 2లో





బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు పోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్ ఉత్కంఠకు తెరపడింది. హైకోర్టు మధ్యంతర బెయిల్ నిరాకరించిన మర్నాడే పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అర్ధరాత్రి వేళ విచారణ, వైద్య పరీక్షల అనంతరం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో భగీరథ్ ను పకడ్బందీ భద్రత నడుమ చర్లపల్లి జైలుకు తరలించారు.

# చర్లపల్లికి భగీరథ్!

**కేంద్ర మంత్రి సంజయ్ కుమారుడికి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ**

**పోక్సో కేసులో మే 29 వరకు రిమాండ్ విధించిన మేడ్చల్ మేజిస్ట్రేట్**

**అర్ధరాత్రి కోర్టు తలుపులు.. బందోబస్తుతో చర్లపల్లికి**

**అప్పా జంక్షన్ వద్ద పట్టుకున్న ఎస్ఓటీ డీసీపీ బృందం**

**లాయర్లతో కలిసి తానే లొంగిపోయాడన్న సంజయ్**

- ఠాణాలో రెండున్నర గంటల పాటు నిందితుడి సుదీర్ఘ విచారణ
- బాధితురాలి వాంగ్మూలంతో కేసులో నమోదైన పోక్సో 5(ఐ) కఠిన సెక్షన్లు
- బంజారాహిల్స్, కరీంనగర్‌లోని బంధువుల ఇళ్లలో పోలీసుల సోదాలు
- నిందితుడి కోసం 8 రోజుల పాటు 20 ప్రత్యేక బృందాలతో గాలింపు
- బండి సంజయ్ ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ప్రధానికి లేఖ

**మేడ్చల్, మే 16(సమయం న్యూస్):** ఎనిమిది రోజులుగా పరారీలో ఉన్న బండి భగీరథ్ కోసం పోలీసులు దేశం విడిచి పారిపోకుండా లుక్ అవుట్ నోటీసులు జారీ చేసి, 20 ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో నార్సింగి అప్పా జంక్షన్‌లోని పోలీసు అకాడమీ వద్ద శనివారం రాత్రి 8:15 గంటలకు సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీం(ఎస్ఓటీ) డీసీపీ శోభన్‌కుమార్, అతని బృందం భగీరథ్‌ను అరెస్టు చేసినట్లు సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం.రమేష్ తెలిపారు. అయితే భగీరథ్ ను పోలీసులు అరెస్టు చేయలేదని, తానే స్వయంగా ఇద్దరు లాయర్లతో కలిసి పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి పోలీసుల ఎదుట లొంగిపోయారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎక్స్ వేదికగా పోస్టు చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

మిగతా 2 లో



# ప్రజలపై పెట్రో ధరల పిడుగు

**ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలి**

**కేంద్ర నిర్ణయంతో అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావం**

**పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కేంద్రంపై తీవ్ర విమర్శలు**

**అనాలోచిత నిర్ణయంతో ఇబ్బందుల్లో అన్ని రంగాలు**

**ధరలు తగ్గించాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్**

**హైదరాబాద్, మే 16(సమయం న్యూస్):** దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సామాన్య ప్రజల పాలిట పిడుగుపాటు లాంటిదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన ధరల పెంపు వల్ల రవాణా ఖర్చులు పెరిగి, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతాయని

మిగతా 2 లో

# ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటు

**నమ్మకమైన బ్యాంక్‌గా స్త్రీనిధి ఎదగాలి**

**ఉద్యోగులు విధులు గుర్తుంచుకోవాలి : మంత్రి సీతక్క**




3



# సెమీకండక్టర్లు, డిజిటల్ రంగంలో భారత్ దూకుడు

- 4 యూనికార్న్ సంస్థల నుంచి 100 సంస్థలు
- భారతీయ సంస్కృతి చిరస్మరణీయం
- ప్రధాన మంత్రి మోదీ
- నెదర్లాండ్స్‌లో మోదీకి బ్రహ్మరథం
- 'ది హేగ్' నగరంలో ప్రవాసీయుల స్వాగతం

4

# ఉగ్రవాదులను ఉసికొల్పితే అంతే సంగతులు



4

- ప్రపంచ పటంలో పాక్ ఉండదు
- పాక్‌కు ఆర్మీ చీఫ్ ద్వివేదీ హెచ్చరిక

# పేదరికం లేని సమాజమే నా లక్ష్యం

**స్వచ్ఛత మన జీవితాల్లో భాగం కావాలి**

**ఎక్కువమంది పిల్లలే మనకు సంపద**




5



5

# ఏపీ ఐసెట్ ఫలితాలు విడుదల

- మంత్రి లోకేశ్ ఫలితాల వెల్లడి
- తొంభై ఒకటి శాతం ఉత్తీర్ణత



# నాకూ ఓ మంత్రి పదవి ఇవ్వండి

- రాహుల్‌ను కోరిన పరిగి ఎమ్మెల్యే

2



# ఫామ్‌హౌజ్‌లో ఇద్దరు వృద్ధ మహిళల హత్య

**డబ్బుల వ్యవహారమే కారణమా..?**

2



# నాకూ ఓ మంత్రి పదవి ఇవ్వండి

## రాహుల్‌ను కోరిని పరిగి ఎమ్మెల్యే

**న్యూఢిల్లీ, మే 16:** లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని కలిసినట్లు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ కేబినెట్‌లో తనకు అవకాశం కల్పించాలని కోరినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ మేరకు రాహుల్ గాంధీకి వినతిపత్రం అందించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ కేబినెట్‌లో మూడు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయని.. రంగారెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం లేదని రామ్మోహన్ రెడ్డి చెప్పారు. గతంలో రంగారెడ్డి జిల్లాకు ముగ్గురు నుంచి ఆరుగురు మంత్రులు ఉండేవారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. డీలిమిటేషన్‌లో భాగంగా జిల్లాలో 44 అసెంబ్లీ నియోజకవర్గాలు, 8 పార్లమెంట్ స్థానాలకు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ కారణంగానే తాను మంత్రి పదవి ఆశిస్తున్నట్లు చెప్పారు. తమ కుటుంబం మూడు తరాలుగా కాంగ్రెస్ పార్టీలోనే పని చేస్తోందని.. బూత్ స్థాయి నుంచి తాను పని చేసినట్లు గుర్తు చేశారు. నాలుగు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశానని.. పార్టీ అధికారంలోకి రావాలనే ఏకైక లక్ష్యంతో కృషి చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మంత్రి పదవి కోసం రాహుల్ గాంధీకి వినతి సమర్పించగా సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తనకు మంత్రి పదవి వచ్చేలా రాహుల్ గాంధీతో మాట్లాడి అవకాశం కల్పిస్తారని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రేమోన్మాది ఘాతుకం

## నడిరోడ్డుపై యువతి గొంతుకోసి దారుణ హత్య!

## మరో రెండు నెలల్లో యువతి వివాహం

## నిందితుడిని చితకబాదిన స్థానికులు..

**మహబూబ్‌నగర్, మే 16:** ప్రేమించడం లేదన్న కక్షతో ఓ ప్రేమోన్మాది నడిరోడ్డుపై ఘాతుకానికి ఒడిగట్టాడు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో శనివారం పట్టపగలు ఓ యువతిని కత్తితో విచక్షణారహితంగా నరికి, గొంతుకోసి దారుణంగా హత్య చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ దాడిలో తీవ్ర రక్తస్రావమై యువతి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. నిందితుడిని స్థానికులు పట్టుకుని కాళ్లు, చేతులు కట్టేసి దేహశుద్ధి చేశారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాదేపల్లి పట్టణంలోని ఎర్రసత్యం కాలనీకి చెందిన రాంచంద్రయ్య పెద్ద కుమార్తె వైష్ణవి (23) పోలేపల్లి సెజ్‌లోని ఎస్‌వీకేఎం స్కూల్‌లో రిసెప్షనిస్ట్‌గా పని చేస్తోంది. శనివారం సాయంత్రం 5.30 గంటల సమయంలో ఆమె విధులు ముగించుకొని, కాలనీలో నడుచుకుంటూ ఇంటికి వెళ్తోంది. మరో వంద అడుగులు వేస్తే ఇల్లు చేరుకుంటుందనగా, సుమారు 30 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని యువకుడు ఆమెను వెంటాడాడు. తన వెంట తెచ్చుకున్న కూరగాయలు కోసే కత్తితో ఒక్కసారిగా వైష్ణవిపై విరుచుకుపడ్డాడు. ఆమె తల, మెడపై విచక్షణారహితంగా పొడవడమే కాకుండా గొంతు కోశాడు. దీంతో తీవ్ర గాయాలైన వైష్ణవి రక్తపు మడుగులో కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందింది. హత్య అనంతరం పారిపోతున్న నిందితుడిని గమనించిన స్థానికులు వెంటనే వెంటాడి పట్టుకున్నారు. ఆగ్రహంతో ఊగిపోయిన ప్రజలు అతడి కాళ్లు, చేతులను తాళ్లతో కట్టేసి విచక్షణారహితంగా చితకబాదారు. రాళ్లతో తలపై దాడి చేయడంతో సదరు యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వైష్ణవిని జడ్చర్ల ఏరియా ఆస్పత్రికి తరలించగా, ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, తీవ్రంగా గాయపడిన నిందితుడిని రక్షించేందుకు పోలీసులు ప్రయత్నించగా, స్థానికులు వారిని దరిచేరకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, ప్రజలకు మధ్య తీవ్ర తోపులాట, వాగ్వివాదం చోటుచేసుకుంది. చివరకు పోలీసులు తీవ్ర గాయాలతో అపస్మారక స్థితికి చేరుకున్న నిందితుడిని పోలీస్ వాహనంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్ర జనరల్ ఆస్పత్రికి తరలించారు. నిందితుడి పరిస్థితి విషమంగా ఉండటంతో అతని వివరాలు సేకరించడం పోలీసులకు సాధ్యం కాలేదు. అయితే అతడు హైదరాబాద్‌కు చెందిన వ్యక్తిగా పోలీసులు అనుమానిస్తున్నారు.

### మరో రెండు నెలల్లో పెళ్లి.. ఇంట్లో కన్నీరు:

మృతురాలు వైష్ణవి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. రాంచంద్రయ్య, శ్రీలత దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండగా.. అందరిలోకీ వైష్ణవి పెద్ద కుమార్తె. ఈమెకు ఇటీవలనే పెళ్లి నిశ్చయమైంది. వచ్చే నెలలో నిశ్చితార్థం, మరో రెండు నెలల్లో వివాహం జరిపించాలని కుటుంబ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇంతలోనే ఈ దారుణం జరగడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దాడి చేసిన యువకుడు ఎవరో తమకు తెలియదని, అతడిని తామెప్పుడూ చూడలేదని వారు పేర్కొన్నారు.

### డబ్బులు తీసుకుని మోసం చేసిందన్న నిందితుడు:

ఇదిలా ఉండగా, హత్య చేసిన అనంతరం పారిపోతుండగా నిందితుడిని పట్టుకున్న స్థానికులు అతడిని ప్రశ్నించారు. ఈ క్రమంలో సదరు యువకుడు స్పందిస్తూ.. వైష్ణవి రెండేళ్లుగా ప్రేమ పేరుతో తనను మోసం చేసిందని, తన వద్ద నుంచి డబ్బులు తీసుకుందని ఆరోపించాడు. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఘోర ఘటనపై జడ్చర్ల సీఐ కమలాకర్ స్పందిస్తూ.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడి వివరాలు పూర్తిగా తెలిస్తేనే హత్యకు గల అసలు కారణాలు వెల్లడవుతాయని ఆయన పేర్కొన్నారు.





# పెట్రో ధరల పెంపు.. ప్రజల నెత్తిన పిడుగు

మొదటి పేజీ తరువాయి

ఆయన పేర్కొన్నారు. నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నిర్ణయం ఏ మాత్రం సమర్థనీయం కాదని సోషల్ మీడియా 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా సీఎం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం దేశంలోని అనేక రంగాలపై తీవ్ర వ్యతిరేక ప్రభావం చూపుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వ అసమర్థ పాలన, అనాలోచిత ఆర్థిక విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుదేలైందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. కేంద్రం చెబుతున్న 'ఆత్మనిర్భర్ భారత్' కేవలం ఓట్లు రాల్చే నినాదమే తప్ప, క్షేత్రస్థాయిలో ఎలాంటి ఫలితాలు సాధించని పాలసీ అని ఇప్పుడిప్పుడే తేలిపోయిందని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాల వల్ల దేశంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిన్నాయని, దేశీయ యువత ఉపాధికి గ్యారెంటీ లేని దారుణ పరిస్థితి దాపురించిందని వ్యాఖ్యానించారు. అన్నదాతల ఆదాయాలు రెట్టింపు చేస్తామంటూ గతంలో ఇచ్చిన హామీ ఒట్టి మాటగానే మిగిలిపోయిందని మండిపడ్డారు. గత పదేళ్లుగా అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువ నిరంతరం పతనమవుతూ వస్తోందని, ఇప్పుడు ఆ పతనం పరాకాష్ఠకు చేరిందని ఆరోపించారు. దేశంలో ఇలాంటి గడ్డు పరిస్థితులు ఉన్న తరుణంలో, అంతర్జాతీయంగా ఇరాన్ – ఇజ్రాయిల్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని సాకుగా చూపిస్తూ దేశీయంగా పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచడం సామాన్యుల నడ్డి విరచడమేనని రేవంత్ రెడ్డి విరుచుకుపడ్డారు. ప్రపంచంలోనే భారతదేశాన్ని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపామని ఘనంగా ప్రకటించుకుంటున్న మోదీ ప్రభుత్వం, ప్రజలపై ఈ విధంగా భారం మోపే నిర్ణయాన్ని ఎలా సమర్థించుకుంటుందని ఆయన ప్రశ్నించారు. ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంత ఎన్నికలకు ముందు మోదీ ప్రభుత్వం 'పెట్రోలియం ఉత్పత్తుల ధరలను పెంచబోము' అని పదే పదే ప్రకటనలు చేసిందని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఎన్నికల ఫలితాలు వచ్చి పది రోజులు కూడా గడవకముందే లీటరుకు రూ. 3 చొప్పున ధరలు పెంచడం ప్రజల నమ్మకాన్ని వంచించడమేనని ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ఓట్ల కోసమే, ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనం పొందేందుకే ప్రధాని మోదీ అబద్ధాలు చెబుతారని ప్రజలు భావిస్తున్నారని, ఇది ముమ్మాటికీ విశ్వాస ఘాతుకమే అవుతుందని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. సామాన్య, మధ్యతరగతి ప్రజల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలను తక్షణమే పూర్తిగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్‌లో సుదీర్ఘమైన పోస్ట్ చేశారు.

# చర్లపల్లికి భగీరథ్!



- కేంద్ర మంత్రి సంజయ్ కుమారుడికి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ
- పోక్సో కేసులో మే 29 వరకు రిమాండ్ విధించిన మేడ్చల్ మేజిస్ట్రేట్
- అర్ధరాత్రి కోర్టు తలుపులు.. భారీ బందోబస్తు నడుమ చర్లపల్లికి తరలింపు
- అప్పా జంక్షన్ వద్ద పట్టుకున్న సైబరాబాద్ ఎస్ఓటీ డీసీపీ బృందం
- లాయర్లతో కలిసి తానే పోలీసుల ఎదుట లొంగిపోయాడన్న సంజయ్
- ఠాణాలో రెండున్నర గంటల పాటు నిందితుడి సుదీర్ఘ విచారణ
- బాధితురాలి వాంగ్మూలంతో కేసులో నమోదైన పోక్సో 5(ఐ) కఠిన సెక్షన్లు
- బంజారాహిల్స్, కరీంనగర్‌లోని బంధువుల ఇళ్లలో పోలీసుల సోదాలు
- నిందితుడి కోసం 8 రోజుల పాటు 20 ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు
- బండి సంజయ్ ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ప్రధానికి లేఖ

**మేడ్చల్, మే 16:** ఎనిమిది రోజులుగా పరారీలో ఉన్న బండి భగీరథ్ కోసం పోలీసులు దేశం విడిచి పారిపోకుండా లుక్ అవుట్ నోటీసులు జారీ చేసి, 20 ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో నార్సింగి అప్పా జంక్షన్ లోని పోలీసు అకాడమీ వద్ద శనివారం రాత్రి 8:15 గంటలకు సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీం(ఎస్ఓటీ) డీసీపీ పి.శోభన్‌కుమార్, అతని బృందం భగీరథ్ ను అరెస్టు చేసినట్లు సైబరాబాద్ పోలీసు కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ తెలిపారు. అయితే భగీరథ్ ను పోలీసులు అరెస్టు చేయలేదని, తానే స్వయంగా ఇద్దరు లాయర్లతో కలిసి పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి పోలీసుల ఎదుట లొంగిపోయారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎక్స్ వేదికగా పోస్టు చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

### అర్ధరాత్రి విచారణ.. జైలుకు తరలింపు..

పోలీసుల అదుపులోకి వచ్చిన తర్వాత భగీరథ్ ను భారీ బందోబస్తు నడుమ రాత్రి 9:05 గంటలకు పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్ కు తరలించారు. అక్కడ సిట్ పర్యవేక్షణాధికారి, కూకట్ పల్లి డీ సీ పీ రితిరాజ్ సుమారు రెండున్నర గంటల పాటు భగీరథ్ ను సుదీర్ఘంగా విచారించారు. అనంతరం రాత్రి 11:35 గంటలకు మేడ్చల్ ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి.. నేరుగా మేడ్చల్ లోని మేజిస్ట్రేట్ నివాసంలో హాజరుపరిచారు. ఆయన సమక్షంలోనే భగీరథ్ వాంగ్మూలాన్ని, బాధితురాలి వాంగ్మూలాన్ని, ఆమె తల్లి వాంగ్మూలాన్ని పోలీసులు మరోసారి నమోదు చేశారు. విచారణ అనంతరం మేజిస్ట్రేట్ నిందితుడికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. ఈ నెల 29 వరకు రిమాండ్ లో ఉండాలని ఆదేశించడంతో, అర్ధరాత్రి భగీరథ్ ను పోలీసులు చర్లపల్లి జైలుకు తరలించారు. భగీరథ్ రాక నేపథ్యంలో చర్లపల్లి జైలు, పేట్ బషీరాబాద్ ఠాణా వద్ద ఎవరూ లోపలికి రాకుండా బారికేడ్లు పెట్టి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

### ఆ కఠిన సెక్షన్ల నమోదు

కుత్బుల్లాపూర్ లోని సుచిత్ర ప్రాంతంలో నివసించే మైనర్ బాలికతో పరిచయం పెంచుకున్న భగీరథ్.. గతేడాది డిసెంబర్ 31 న మొయినాబాద్ లోని తన ఫామ్ హౌస్ కు తీసుకెళ్లాడు. బలవంతంగా మద్యం తాగించి, ఆమె అపస్మారక స్థితిలో ఉండగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాలిక తల్లి ఈ నెల 8న పోలీసులకు ఫిర్యాదు చేసింది. మొదట పేట్ బషీరాబాద్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్ హెచ్ ఓ) పోక్సోలోని సెక్షన్ 11 రెడ్ విత్ 12, భారతీయ న్యాయ సంహిత (బీ ఎన్ ఎస్) లోని సెక్షన్ 74, 75 కింద కేసులు నమోదు చేశారు. మంగళవారం బాధితురాలిని మరోసారి విచారించిన డీసీపీ రితిరాజ్.. ఆమె ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ముందుగా ప్లాన్ చేసిన లైంగిక చర్యలకు సంబంధించిన సెక్షన్లను సూచించే పోక్సో 2012 చట్టంలోని సెక్షన్ 5(ఐ)ను అదనంగా జోడించారు.

### ఏకకాలంలో ఇళ్లలో సోదాలు

నిందితుడి ఆచూకీ కోసం పోలీసులు ఢిల్లీ, హైదరాబాద్, కరీంనగర్ లో తీవ్రంగా గాలించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం పేట్ బషీరాబాద్ పోలీసులు బంజారాహిల్స్ రోడ్ నం.3 లోని ఆరోరా కాలనీలో ఉన్న బండి సంజయ్ నివాసంలో తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో కరీంనగర్ లోని కార్తికేయ ఆసుపత్రిలో భగీరథ్ మేనమామ డాక్టర్ సీ హెచ్ వంశీకృష్ణ ఇంట్లోనూ ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. రెండు గంటల పాటు దాడులు చేసి సీ సీ టీ వీ ఫుటేజ్ లతో పాటు పలు కీలక సమాచారాన్ని సేకరించారు.

### మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి..

కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను పదవి నుంచి తొలగించాలని కోరుతూ ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ములకు లేఖ అందింది. సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో బాధితురాలి తరుపు న్యాయవాది పప్పు నాగేశ్వర రావు ఈ లేఖ రాశారు. బండి సంజయ్ మంత్రి పదవిలో కొనసాగితే అధికార బలంతో కేసును పక్కదారి పట్టించే అవకాశం ఉందని అందులో ఆరోపించారు. బాధితులకు బహిరంగంగా బెదిరింపులు వస్తున్నాయని, తక్షణమే ఆయనపై చర్యలు తీసుకోవాలని లేఖలో డిమాండ్ చేశారు.

### చట్టం ముందు అంతా సమానమే..

తన కుమారుడి అంశంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. చట్టం ముందు తన బిడ్డెనా, సామాన్యుడైనా సమానమేనని, అందరం చట్టానికి లోబడి ఉండాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. వాస్తవానికి ఫిర్యాదు రాగానే భగీరథ్ ను స్టేషన్‌లో అప్పగిద్దామనుకున్నామని, లాయర్లను సంప్రదించగా ఆధారాలు చూసి కేసు కొట్టేస్తారని, బెయిల్ తప్పకుండా వస్తుందని చెప్పడంతో జాప్యం జరిగిందన్నారు. కోర్టు ఉత్తర్వులు వచ్చే వరకు ఆలస్యం చేయడం సరికాదనే ఉద్దేశంతోనే తన అబ్బాయిని లాయర్ల ద్వారా పోలీసుల విచారణ కోసం అప్పగించానని, న్యాయ వ్యవస్థపై తనకు సంపూర్ణ నమ్మకం ఉందని బండి సంజయ్ వివరించారు.

## బాలిక వాంగ్మూలం నమోదు

హైదరాబాద్, మే 16: బాలికపై లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్‌పై పోక్సో కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బాధితురాలి వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేశారు. మేడ్చల్ మెజిస్ట్రేట్ ఎదుట బాధితురాలు, ఆమె తల్లి వాంగ్మూలాలను 40 నిమిషాల పాటు రికార్డు చేశారు. ఇప్పటికే బాధితురాలి వాంగ్మూలాలను రెండుసార్లు పోలీసులు నమోదు చేశారు. మరోవైపు, భగీరథ్ దేశం దాటిపోకుండా పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. అతడి కోసం 5 బృందాలు గాలిస్తున్నాయి. భగీరథ్‌పై పోక్సో కేసు నమోదవ్వడంతో అతడితో టచ్‌లో ఉన్నవారిపై, స్నేహితులు, బంధువుల ఇళ్లపై పోలీసులు నిఘా ఉంచినట్లు సమాచారం. బంజారాహిల్స్‌లోని బండి సంజయ్ ఇంట్లో ఒక బృందం తనిఖీలు చేపట్టింది.

# ఫామ్‌హౌజ్‌లో ఇద్దరు వృద్ధ మహిళల దారుణ హత్య

## డబ్బుల వ్యవహారమే కారణమా..?

## మొయినాబాద్‌లో కలకలం..

## దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు

**రంగారెడ్డి, మే 16:** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ పరిధిలోని ఓ ఫామ్‌హౌజ్‌లో ఇద్దరు వృద్ధ మహిళలు హత్యకు గురైన ఘటన తీవ్ర కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తులు అత్యంత దారుణంగా హత్య చేసిన ఈ ఘటన స్థానికంగా భయాందోళనలకు గురిచేస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. హత్యకు గురైన మహిళలను





తాండూరు ప్రాంతానికి చెందిన అదృశ్యమైన ఇద్దరు వృద్ధ మహిళలుగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. వీరి వయసు సుమారు 60 సంవత్సరాల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. పోలీసుల అనుమానం ప్రకారం.. బాధితులను వికారాబాద్ ప్రాంతం నుంచి మొయినాబాద్ ఫామ్‌హౌజ్‌కు తీసుకువచ్చి హత్య చేసినట్లు తెలుస్తోంది. డబ్బుల లావాదేవీలు, ఫైనాన్స్ వ్యవహారాల నేపథ్యంలోనే ఈ హత్య జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. డబ్బులు ఇస్తామని నమ్మబలికి పిలిపించి, అనంతరం పథకం ప్రకారం హత్య చేసిన అవకాశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ఘటన స్థలంలో క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలు సేకరించారు. పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. నిందితులను గుర్తించి అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ ద్విహత్య ఘటనతో మొయినాబాద్ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.



# ఆర్డీఓ ఎదుటే హత్యాయత్నం

**భూవివాద విచారణలో తండ్రీకొడుకులపై దాడి**

**గొంతు నులిమి, పురుషాంగాలపై దాడి చేసిన ప్రత్యర్థులు**

**సిద్దిపేట ఆర్డీఓ కార్యాలయంలో ఉద్రిక్త పరిస్థితులు**

సిద్దిపేట, మే 16: సిద్దిపేట ఆర్డీఓ కార్యాలయంలో భూవివాద విచారణ సందర్భంగా తండ్రీకొడుకులపై జరిగిన దాడి తీవ్ర కలకలం రేపింది. డివిజనల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ హోదాలో ఉన్న అధికారి సమక్షంలోనే ప్రత్యర్థులు విచక్షణారహితంగా దాడికి పాల్పడిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. సిద్దిపేట పట్టణ శివారులోని సర్వే నెంబర్ 1440లో ఉన్న 1-04 ఎకరాల భూమి ఉమ్మడి ఆస్తి పంపకాలలో భాగంగా నాయకం మల్లయ్యకు దక్కినట్లు బాధితులు తెలిపారు. 1993 నుంచి రెవెన్యూ రికార్డుల్లో భూమి తన పేరిటే ఉందని మల్లయ్య పేర్కొన్నారు. అయితే ఇటీవల తన సోదరుడు లక్ష్మణ్ ఈ భూమిపై ఆర్డీఓ వద్ద అప్పీల్ దాఖలు చేయడంతో విచారణకు హాజరైనట్లు తెలిపారు. శనివారం విచారణ సందర్భంగా మల్లయ్య తన కుమారుడు నాయకం ప్రసాద్‌తో కలిసి ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లారు. విచారణ కొనసాగుతున్న సమయంలో ప్రత్యర్థులు శ్రీనివాస్, లక్ష్మణ్, సత్యనారాయణలు ఒక్కసారిగా వారిపై దాడికి దిగినట్లు ఆరోపించారు. ప్రసాద్ గొంతు నులిమి చంపేందుకు ప్రయత్నించారని, కార్యాలయం బయటకు లాక్కెళ్లి మరింత దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడి సమయంలో ప్రసాద్ పురుషాంగాలపై తీవ్రంగా కొట్టడంతో పాటు, వృద్ధుడైన మల్లయ్యను కూడా తోసిపుచ్చి దాడి చేసినట్లు బాధితులు తెలిపారు. ఈ ఘటన మొత్తం ఆర్డీఓ సమక్షంలోనే జరిగినప్పటికీ ఎవరూ అడ్డుకోలేదని ఆరోపించారు. డివిజనల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ హోదాలో ఉన్న అధికారి ముందే ఇలాంటి ఘటన జరగడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఘటనను అడ్డుకునేందుకు కార్యాలయ సిబ్బంది తక్షణ చర్యలు తీసుకోలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనపై బాధితుడు నాయకం ప్రసాద్ సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమకు ప్రాణహాని ఉందని, నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

# భూ వివాదంలో ఘర్షణ

**కర్రలు, కత్తులతో దాడులతో పలువురికి గాయాలు**

**వరంగల్, మే 16:** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం సూర్యతండా పరిధిలోని మర్రి తండాలో ఇరువర్గాల మధ్య ఘర్షణ కలకలం రేపింది. గ్రామానికి చెందిన రమావత్ గ్యాస్య, రమావత్ రేఖ్య మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న భూవివాదం నేపథ్యంలో శుక్రవారం రాత్రి కర్రలు, కత్తులతో దాడులు చేసుకున్నారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ ఘటనలో రమావత్ గ్యాస్య, రమావత్ రేఖ్యతో పాటు కిరణ్, రాజేందర్, నవీన్, జీవన్ సహా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘర్షణ గురించి సమాచారం అందుకున్న రాయపర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఘర్షణకు గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

# బోరుబావిలో పడ్డ మనవడు రక్షించబోయిన తాత మృతి



**నల్లగొండ, మే 16:** మిర్యాలగూడ మండలంలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. మనుమడిని కాపాడబోయి తాత మృతిచెందిన విషాద సంఘటన మిర్యాలగూడ రూరల్ మండలం యాదగిరిపల్లిలో చోటుచేసుకుంది. మిర్యాలగూడ మండలం యాదగిరిపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ బోరు బావి పక్కన సుమారు 12 అడుగుల గోయి ఏర్పడింది. గ్రామానికి చెందిన వెంకన్న శనివారం ఉదయం తన కూతురు పిల్లలు హేమాన్ష, లోహితను పొలం వద్దకు తీసుకుని వెళ్లాడు. పనులు చేస్తుండగా మనుమడు హేమాన్ష ఆడుకుంటూ బోరు పక్కన ఏర్పడిన గుంతలో పడిపోయాడు. అది గమనించిన వెంకన్న బాలుడిని పైకి తీసే క్రమంలో తాను జారీ తలక్రిందులుగా గుంతలో ఇరుక్కుపోయాడు. పైకి లేచేందుకు ప్రయత్నిస్తే లేవలేకపోతుండడంతో గమనించిన మనుమరాలు భయపడి సమీపంలో ఉన్న రైతులకు విషయం చెప్పింది. వారు బోరు గుంత వద్దకు వచ్చి వెంకన్నను, పిల్లవాడిని రక్షించే ప్రయత్నం చేశారు. రూరల్ ఎస్ఐకి సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ఓ యువకుడి సాయంతో ఇద్దరిని గుంత నుండి వెలికితీశారు. వైద్య పరీక్షల కోసం మిర్యాలగూడ ఆస్పత్రికి తరలిస్తుండగా వెంకన్న మృతి చెందాడు. బాలుడు సురక్షితంగా ఉన్నాడు.నాలుగేళ్ల బాలుడు ప్రమాదవశాత్తు బోరుబావిలో పడ్డాడు. విషయం తెలిసిన వెంటనే బాలుడి తాత వెంకన్న అక్కడకు చేరుకుని చిన్నారిని రక్షించేందుకు బోరుబావిలోకి దిగాడు. ఈ క్రమంలో బోరుబావిలో వెంకన్న తలకిందులుగా ఇరుక్కుపోయాడు. దీంతో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. పోలీసు బృందం ఎంతో శ్రమించి తాత, మనవడిని బయటకు తీశారు. వెంటనే ఇద్దరినీ స్థానిక ఆస్పత్రికి తరలించారు. అయితే బోరుబావిలో తలకిందులుగా ఇరుక్కోవడంతో ఊపిరాడక వెంకన్న తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.మనవడిని రక్షించబోయి తాత ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటు

- నమ్మకమైన బ్యాంక్‌గా స్త్రీనిధి ఎదగాలి
- మంత్రి సీతక్క సూచన



**హైదరాబాద్, మే 16:** ఉద్యోగులు హక్కులతో పాటు విధులు కూడా గుర్తుంచుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. స్త్రీనిధి సంస్థను అందరం కాపాడుకోవాలన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు స్త్రీనిధి తోడ్పాటు అందిస్తోందని వెల్లడించారు. మైక్రో ఫైనాన్స్ బాధల నుంచి మహిళలకు విముక్తి కోసం స్త్రీనిధి ఏర్పాటయిందని తెలిపారు. ఇప్పటివరకు రూ.24 వేల కోట్ల రుణాలు పంపిణీ చేసిన స్త్రీనిధి అని చెప్పారు. 32 లక్షల మహిళలకు రుణాలు అందించిందని స్పష్టం చేశారు. తెలంగాణ మహిళలకు నమ్మకమైన బ్యాంక్‌గా స్త్రీనిధి ఎదగాలన్నారు. ఇతర రాష్ట్రాలు కూడా తెలంగాణ స్త్రీనిధి మోడల్‌ను అనుసరిస్తున్నాయని.. మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతున్న స్త్రీ నిధి బ్యాంక్‌పై కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. తప్పుడు ఆరోపణలు వస్తే వెంటనే వెరిఫై చేసి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అప్పుడు ఆరోపణలతో సంస్థ ప్రతిష్ట దెబ్బతినకూడదని మంత్రి వివరించారు. మహిళల అభివృద్ధే సమాజ అభివృద్ధికి పునాది అని చెప్పారు. చిన్న వ్యాపారాలు, గృహాధారిత ఉపాధికి ప్రభుత్వం ప్రోత్సాహం అందింది. ఆదివాసీ మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తున్నాం. స్త్రీనిధి మహిళల కోసం మహిళల ఆధ్వర్యంలో నడిచే సంస్థ. స్త్రీనిధిని కాపాడుకోవాలి. ఉద్యోగ అనుకూల ప్రభుత్వం మా ప్రభుత్వం. స్త్రీ నిధి ఏర్పాటులో, దాన్ని విజయవంతం చేయడంలో కృషిచేసిన విద్యాసాగర్ రెడ్డికి అభినందనలు. నూతన నాయకత్వంలో ఈ సంస్థ మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నానని మంత్రి సీతక్క వెల్లడించారు.

# జూన్ 25 నుంచి సర్ ప్రక్రియ

- ఇంటింటికి వెళ్లి బిఎల్‌వోల పరిశీలన
- సీఈవో సుదర్శన్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, మే 16:** దేశ వ్యాప్తంగా సర్ పక్రియ ప్రారంభమైందని.. తెలంగాణలో జూన్ 25 నుంచి ఈ పక్రియ మొదలవుతుందని సీఈవో సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఇంటింటికీ వెళ్లి బీఎల్‌వో లు ప్రత్యేక సర్వే చేస్తారని అన్నారు. ప్రతి ఓటరుకూ ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తారని.. ప్రతి ఇంటినీ కనీసం మూడు సార్లు బీఎల్‌వో సందర్శిస్తారని చెప్పారు. కొత్త ఓటర్ల వివరాలను ఫారం-6లో ప్రత్యేకంగా నమోదు చేస్తారన్నారు. వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ ఎన్యుమరేషన్ అవకాశం ఉందని తెలిపారు. హెల్ప్‌లైన్ 1950తో పాటు కాల్ యువర్ బిఎల్‌వో సదుపాయం కల్పించినట్లు చెప్పారు. ఎన్యుమరేషన్ దశలో ఫారం తప్ప అదనపు పత్రాలు అవసరం లేదని సీఈవో తెలిపారు. ఫారం ఇచ్చిన వారందరి పేర్లు డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో చేర్చుతారని, ఫారం ఇవ్వని ఓటర్ల జాబితా బూత్ వారీగా ప్రదర్శిస్తారని తెలిపారు. డ్రాఫ్ట్ రోల్స్ తర్వాత అభ్యంతరాలను స్వీకరిస్తామని చెప్పారు. పుట్టిన తేదీ ఆధారంగా పత్రాల సమర్పణకు నిబంధనలు వర్తిస్తాయన్నారు. 1987 జూలై 1కు ముందు పుట్టిన వారికి ఒకే పత్రం సరిపోతుందని.. 1987 - 2004 మధ్య పుట్టిన వారికి తల్లిదండ్రుల వివరాలు కూడా తప్పనిసరి అని చెప్పారు. 2004 తర్వాత జన్మించిన వారికి తల్లిదండ్రుల పత్రాలు తప్పనిసరన్నారు. 2002లో రాష్ట్రంలో సర్ చేశారని సీఈవో తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలన్నదే ఎస్ఐఆర్ ఉద్దేశమన్నారు. రాష్ట్రంలో 3.45 కోట్ల ఓటర్లు, 35 వేల పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. పొలిటికల్ పార్టీలకు కూడా దీనిపై సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎన్యుమరేషన్ తర్వాత డ్రాఫ్ట్ విడుదల చేస్తామని.. అందులో చూసుకొని ఓటర్లు మార్పు, చేర్పులు చేసుకోవచ్చని సీఈవో సుందర్శన్ రెడ్డి వెల్లడించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి సర్వే, జూలై 31న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల ఉంటుందని అన్నారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుంది. అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా విడుదల విడుదల చేస్తారు.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక

**18నుండి 23వరకు క్రీడా పర్యాటక వారోత్సవాలు**

**జిల్లా కలెక్టర్లతో సిఎస్ టెలీకాన్ఫరెన్స్**

**హైదరాబాద్, మే 16:** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 18 తేదీ నుండి 23వ తేదీ వరకు నిర్వహించే యువజన, క్రీడా, పర్యాటక వారోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మే 18 నుండి 23 వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాల నిర్వహణపై స్పెషల్ సిఎస్ లు జయేష్ రంజన్, వాణి ప్రసాద్ లతో కలసి శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతలో క్రీడా స్ఫూర్తి, దేహదారుఢ్యం, సామాజిక చైతన్యం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకై ఈ కార్యక్రమాలను చేపట్టినట్టు తెలిపారు. అదేవిధంగా పర్యాటక ప్రాంతాలపై ప్రజల్లో పెద్ద ఎత్తున చైతన్యం కల్పించాలని, పర్యాటక ప్రాంతాలను ప్రజలు సందర్శించేలా తగు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రధానంగా స్పోర్ట్స్ కార్యక్రమాలను రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో నిర్వహించాలన్నారు. ప్రతీ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, యువజన సంఘాలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఈనెల 18న నిర్వహించే 'ఫిట్- తెలంగాణా థీమ్ తో రాష్ట్ర , జిల్లా కేంద్రాలలో 5ఐ రన్, అదేవిధంగా అన్ని మండల కేంద్రాలలో వ్యాకథాన్, యోగ తదితర కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. తెలంగాణలో పర్యాటక రంగానికి ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఈ వారోత్సవాలు దోహదపడతాయని, దీనిలో భాగంగా ఈ వారం రోజులు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని అన్ని మ్యూజియంలలో ఉచిత ప్రవేశం కల్పించనున్నట్టు వెల్లడించారు. అదేవిధంగా జిల్లాల్లో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లపై కూడా జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గౌరవ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోళ్లలో ఎక్కడ జాప్యం



# సీబీఎస్ఈ లాంగ్వేజీ విధానంలో మార్పులు

- త్రిభాషా సూత్రం తప్పనిసరి చేస్తూ ఆదేశాలు
- ఎన్‌సీఈఆర్‌టీ విడుదల చేసిన సిలబస్‌కు లోబడి మార్పు




**న్యూఢిల్లీ, మే 16:** దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ స్కూళ్లలో లాంగ్వేజ్ విధానంలో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయి. రాబోయే 2026 జులై 1 నుంచి 9, 10 తరగతుల విద్యార్థులకు 'మూడు భాషల విధానాన్ని తప్పనిసరి చేస్తూ సీబీఎస్ఈ అధికారికంగా సర్క్యులర్ జారీ చేసింది. జాతీయ విద్యా విధానం, నేషనల్ కరిక్యులం ఫ్రేమ్‌వర్క్ ఫర్ స్కూల్ ఎడ్యుకేషన్ సూచనలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు వెల్లడించింది. 2026-27 విద్యా సంవత్సరానికి గానూ ఎన్‌సీఈఆర్‌టీ విడుదల చేసిన నూతన సిలబస్‌ను సమీక్షించిన తర్వాతే ఈ మార్పులు చేసినట్లు బోర్డు స్పష్టం చేసింది. ఏప్రిల్‌లోనే విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ.. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా జులై నుంచి ఒక పరివర్తన పక్రియ ద్వారా దీనిని అమలు చేయనున్నారు. కొత్త నిబంధన ప్రకారం విద్యార్థులు అభ్యసించే మూడు భాషల్లో కనీసం రెండు భాషలు కచ్చితంగా స్థానిక భారతీయ భాషలై ఉండాలి. ఒకవేళ విద్యార్థులు ఫ్రెంచ్, జర్మన్ వంటి విదేశీ భాషలను చదవాలనుకుంటే.. మిగిలిన రెండు భాషలు భారతీయ భాషలైనప్పుడు మాత్రమే దానికి అనుమతి ఉంటుంది. లేదా విదేశీ భాషను 4వ అదనపు భాషగానూ ఎంచుకోవచ్చు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు గానూ ఈ నూతన విధానంలోని మూడో భాషకు 10వ తరగతిలో బోర్డు పరీక్ష ఉండదు. స్కూల్ స్థాయిలోనే ఇంటర్నల్ అసెస్‌మెంట్ ద్వారా దీనికి మార్కులు లేదా గ్రేడులు ఇస్తారు. అయితే ఇందులో పాస్ కావడం మాత్రం తప్పనిసరి. మిడిల్ స్టేజ్(మిడిల్ స్కూల్), సెకండరీ స్టేజ్ చదువుల మధ్య లాంగ్వేజ్ స్కిల్స్, గ్రామర్, రీడింగ్ కాంప్రహెన్షన్ వంటి అంశాలలో 75 నుంచి 80 శాతం వరకు పోలికలు ఉంటాయని బోర్డు పేర్కొంది. అందువల్ల ప్రస్తుతానికి 9వ తరగతి విద్యార్థుల కోసం ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించిన 6వ తరగతి స్థాయి పాఠ్య పుస్తకాలనే ఉపయోగించనున్నారు. ఈ పుస్తకాలతో పాటు స్థానిక, రాష్ట్ర స్థాయి సాహిత్యానికి సంబంధించిన కథలు, కవితలను కూడా సిలబస్‌కు అదనంగా చేర్చాలని స్కూళ్లను ఆదేశించింది. దీనికి సంబంధించిన పూర్తి గైడ్‌లైన్స్‌ను 2026 జూన్ 15 నాటికి సీబీఎస్ఈ విడుదల చేయనుంది. జులై 1లోపు 19 అధికారిక భారతీయ భాషలకు సంబంధించిన 6వ తరగతి ఖీ3 పాఠ్య పుస్తకాలను బోర్డు అందుబాటులోకి తీసుకురానుంది. తాజా నిర్ణయంతో భారతీయ భాషలను ప్రవేశపెట్టడం వల్ల స్కూళ్లలో అర్హులైన ఉపాధ్యాయుల కొరత ఏర్పడే అవకాశం ఉందని బోర్డు గుర్తించింది. దీని కోసం పాఠశాలలకు కొన్ని కీలకమైన మినహాయింపులు, ప్రత్యామ్నాయ మార్గాలను సూచించింది.



సంపాదకీయం

# ఆర్థిక కార్యాచరణ అత్యవసరం!

నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక బిజెపిలో కనిపించినంత ఆనందం మిగతా పార్టీల్లో కనిపించలేదు. కేరళలో అధికారం దక్కించుకున్నా కూడా కాంగ్రెస్ లో అంతటి ఆనందం కనిపించలేదు. బెంగాల్ దక్కడంతో బిజెపిలో ఎక్కడలేని ఆనందం, ఉత్సాహం కనిపించింది. ఆ ఆనందాన్ని ప్రజలతో పంచుకునేందుకు బిజెపి సిద్ధంగా లేదు. ఎందుకంటే పెట్రో,డీజిల్ ధరలు పెంచడం, ఆర్థిక వ్యవస్థ రోజురోజుకూ కుదేలవ్వడంతో ప్రజల్లో ఒకింత నిరాసక్తి కనిపిస్తోంది. కొత్తగా రెండు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఆనందంలో ఉండగానే దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర కష్టనష్టాల నెదుర్కొంటున్న వాస్తవాన్ని గుర్తించారు. హైదరాబాద్ పర్యటనలో ఆయన చేసిన వ్యాఖ్యలు రానున్న ముప్పును ముందే గమనించి చేసిన హెచ్చరికగా గుర్తించాలి. ఈ క్రమంలో ఒక్క బంగారం దిగుమతులే కాకుండా దేశీయ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తున్న ఆహార దిగుమతులను కూడా నిలిపి వేయడం మంచిదని ప్రధాని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది. ఆర్థిక వ్యవస్థ రానున్న రోజుల్లో మరింత బలహీనం కానుందన్న కఠోర సత్యాన్ని మోడీ ఒప్పుకున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చేసిన తప్పులకు ప్రజలు త్యాగాలు చేయాలని ప్రధానమంత్రి పిలుసపునిస్తున్నట్లుగా ఉంది. అందువల్ల రాజకీయ నాయకులకు సంబంధించి విప్లవాత్మక మార్పులు తీసుకుని వస్తే తప్ప సంక్షోభాన్ని గట్టెక్కలేమని ప్రధాని మోడీ గుర్తించడం లేదు. ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయెల్ సంయుక్త దాడులతో మొదలు పెట్టిన యుద్ధం ప్రారంభమై ఈ నెలాఖరుకు మూడు నెలలు పూర్తవుతాయి. ఫిబ్రవరి 28న మొదలైన ఈ యుద్ధం ఇప్పట్లో ముగుస్తుందనడానికి లేదు. ట్రంప్ రోజుకో మాట మాట్లాడుతున్నారు. ఆయన తీరు చూస్తుంటే యుద్ధం ఆగిపోయే సూచనలు కానరావడం లేదు. పశ్చిమాసియాలోని దేశాలన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆ యుద్ధంలో పాల్గొంటూనే ఉన్నాయి. ఈ క్రమంలో చమురు సరఫరా నిలిచి పోయింది. హోర్మూజ్ జలసంధి వద్ద అమెరికా ,ఇరాన్‌లు పట్టుబిగించాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 107 డాలర్లుగా ఉన్నది; రూపాయి మారకం విలువ డాలర్‌కు రూ.96కు చేరువలో ఉన్నది. రూపాయి విలువ ఎన్నడూ ఇంతగా పతనం కాలేదు. నిత్యం దాని ధర పతనం అవుతూనే ఉంది. దీనికి కారణం ఇబబడిముబ్బడిగా దిగుమతులే కారణమని చెప్పనక్కరలేదు. విదేశీ మారక నిల్వలు తగ్గిపోతున్నాయి. అధికారికంగా వినియోగ ధరల సూచీ ద్రవ్యోల్బణం 3.5శాతం కాగా ఆహార ద్రవ్యోల్బణం 4.33శాతంగా ఉంది. గృహావసరాల ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.913 కాగా కమర్షియల్ సిలిండర్ ధర రూ.3077 నుంచి రూ.3237 దాకా ఉంటోంది; డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం 8.3శాతంగా ఉంది. ఇవన్నీ కూడా మన ఆర్థిక దౌర్బల్యాన్ని సూచిస్తున్నాయి. నేరుగా ఇవన్నీ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నవని గుర్తించాలి. దీనిని తట్టుకుని నిలబడేందుకు ధరలు పెంచడం మార్గం కాదు. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరగడానికి చర్యలు తీసుకోవడం లేదు. దేశీయంగా ఆహార వస్తువులను ప్రజలకు నేరుగా, చౌకగా అందించే ప్రణాళికలు చేయడం లేదు. తెలుగు రాష్ట్రాలను తీసుకుంటే ఇక్కడ వరి, మిర్చి, శనగ,మక్కజొన్న తదితర పంటలు విపరీతంగా పండుతున్నాయి. ఇవి పండిస్తున్న రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. అలాగే కొనుగోలుదారులకు సరసమైన ధరలకు వస్తువులు దక్కడం లేదు. ఈ వ్యత్యాసాన్ని ప్రభుత్వాలు గుర్తించడం లేదు. బంగారం దిగుమతులను నిలిపివేయడంతో పాటే ఇతర నిత్యవాసరాల దిగుమతులను కూడా నిలిపివేయాలి. దేశీయంగా పండుతునున్న పంటలకు పోటీగా వస్తున్న ఆహారా ధాన్యాల దగుమతులపై ఆంక్షలు విధించాలి. అలాగే మనవద్ద గోదాముల్లో మూలుగుతున్న ఆహార ధాన్యాలను ఉచితంగా కాకుండా ప్రజలకు సరసమైన ధరలకు అందించాలి. అలాగే అన్ని విషయాలలోను పొదుపు పాటించి తీరాలి. ఇంధన వినియోగం, వంటనూనెలు, ఎరువులు మొదలైన వాటి వినియోగంలో పొదుపు అవసరమే. అందుకోసం అనవసర దిగుమతులను పూర్తిగా నిరోధించాలి. అననింటికి మించి ప్రజాప్రతినిధుల దుబారాలపై ఆంక్షలు విధించాలి. జీతభత్యాలు, ఉచిత పథకాలపైనా కొంతకాలం ఆంక్షలు విధించాలి. ఈ విషయంలో పాలకులు ముఖ్యంగా ప్రధాని మోడీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. అడ్డూ అదుపూ లేకుండా ఇంధన వినియోగానికి కారణ మవుతున్న కాన్వాయ్‌లను రద్దు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు విదేశీ మారకద్రవ్యం నిల్వలను మళ్లీ సమృద్ధం చేయడానికి కఠిన చర్యలు అవలంబిం చాల్సిందే. ఇవన్నీకూడా ఎమర్జెన్సీ కింద అమలు కావాలి. రూపాయి మారకం రేటును స్థిరీకరించకుంటే మన విదేశీమారక నిల్వలు హరించకు పోతాయి. అందుకోసం రూపాయి మారకం రేటు స్థిరపరచేందుకు అసవరమైన చర్యలను తక్షణం అమలు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమిష్టి నిర్ణయాలు అవసరం. ఆర్థిక నిపుణులతో చర్చించాలి. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి సూచనలు సలహాలు తీసుకోవాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కఠిన చర్యలకు ఉపక్రమించాలి. తక్షణ ప్రాతిపదికన చేపట్టవలసిన చర్యలపై సలహాలు ఇచ్చేందుకు తలపండిన ఆర్థికవేత్త నేతృత్వంలో ఒక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలి. ఇలా గ్రామాల నుంచి పట్టణాల వరకు నిరంతరంగా అభిప్రాయాలను సేకరించి, క్రోడీకరించాలి. మన దేశ వనరులు, వినియోగం, దిగుమతులను విశ్లేషించాలి. ఎక్కడ ఖర్చులు తగ్గించవచ్చో అన్నది ప్రజలతో పాటు, మేధావుల నుంచి సూచనలు స్వీకరించాలి. అప్పుడే మనకు ఒక పరిష్కారం దొరుకుతుంది. అంతే తప్ప కాన్వాయ్‌లలో ఒకటి రెండు కార్లను తగ్గించడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ చక్కబడదని ప్రధాని మోడీ త్వరగా గుర్తిస్తే మంచిది.

# సెమీకండక్టర్లు, డిజిటల్ రంగంలో భారత్ దూకుడు

- 4 యూనికార్న్ సంస్థల నుంచి 100 సంస్థలు
- భారతీయ సంస్కృతి చిరస్మరణీయం
- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ
- నెదర్లాండ్స్‌లో మోదీకి బ్రహ్మరథం
- 'ది హేగ్' నగరంలో ప్రవాసీయుల స్వాగతం



**న్యూఢిల్లీ, మే 16:** భారతదేశం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తూ ప్రపంచంలోనే అత్యంత వేగంగా దూసుకుపోతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో భాగంగా 'ది హేగ్' నగరంలో ఏర్పాటు చేసిన ఘన సాంస్కృతిక ప్రదర్శనల మధ్య ఆయన ప్రవాస భారతీయులతో ముఖాముఖి (మాటామంతీ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న ఎన్ఆర్ఐలపై ప్రధాని ప్రశంసల జల్లు కురిపించారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న డిజిటల్ చెల్లింపుల్లో భారతదేశమే అగ్రస్థానంలో నిలిచిందని ప్రధాని గర్వంగా ప్రకటించారు. ప్రస్తుతం దేశంలో నెలకు 20 బిలియన్ డాలర్ల విలువైన డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఒకప్పుడు దేశంలో కేవలం 4 యూనికార్న్ సంస్థలు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం ఆ సంఖ్య 100కు పైగా చేరిందని వివరించారు. టెక్నాలజీ పరంగా దేశం సాధిస్తున్న ప్రగతికి ఇది నిదర్శనమన్నారు. సెమీకండక్టర్ల తయారీ రంగంలోనూ భారత్ శరవేగంగా ముందడుగు వేస్తోందని ప్రధాని స్పష్టం చేశారు. దేశంలో ఇప్పటికే సెమీకండక్టర్ ప్లాంట్ల పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, 'మేడిన్ ఇండియా' చిప్‌లు కూడా తయారవుతున్నాయని చెప్పారు. భారతదేశం విజయవంతంగా నిర్వహించిన ఏఐ సమ్మిట్, జీ20 సమావేశాలు దేశ సమర్థతను ప్రపంచానికి చాటిచెప్పాయన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రధాని మాట్లాడుతూ.. భారతదేశంలో ప్రస్తుతం 90 కోట్ల మంది ఓటర్లుగా నమోదయ్యారని, 2024 లోక్‌సభ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 64 కోట్ల మంది ఓటు వేశారని గుర్తు చేశారు. ఈయూ దేశాల మొత్తం జనాభాను కలిపినా కూడా 64 కోట్ల మంది ఉండరని, భారత ప్రజాస్వామ్య గొప్పతనం అటువంటిదని మోదీ అభివర్ణించారు. ప్రవాస భారతీయుల ఉత్సాహాన్ని చూసి తాను విదేశంలో ఉన్నాననే సంగతి మరిచిపోయి, స్వదేశంలో ఏదో ఉత్సవానికి హాజరైనట్లు అనిపించిందని ప్రధాని భావోద్వేగానికి గురయ్యారు. "కాలక్రమేణా ఎన్నో సంస్కృతులు కనుమరుగయ్యాయి, కానీ భారతదేశ విభిన్న సంస్కృతి ఇప్పటికీ మన హృదయాల్లో బలంగా ఉంది. తరాలు మారినా, దేశాలు మారినా మన మట్టి పరిమళం, కుటుంబ విలువలు ఎన్నడూ మారలేదు" అని కొనియాడారు. నెదర్లాండ్స్ సమాజానికి మరియు అక్కడి ఆర్థిక వ్యవస్థకు ప్రవాస భారతీయులు అందిస్తున్న సేవలను ఆ దేశ పాలకులే స్వయంగా ప్రశంసిస్తుంటారని, ఇది ప్రతి భారతీయుడికి గర్వకారణమని మోదీ పేర్కొన్నారు.

### మలుపు తిప్పిన మే 16:

సరిగ్గా 12 ఏళ్ల క్రితం.. 2014 మే 16 ఇదే రోజున లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడి దశాబ్దాల తర్వాత దేశంలో సంపూర్ణ మెజారిటీతో ఒక స్థిరమైన ప్రభుత్వం ఏర్పడిందని ప్రధాని గుర్తు చేసుకున్నారు. నాటి నుండి కోట్లాది మంది భారతీయులు తనపై ఉంచిన నమ్మకమే తనను అలసిపోకుండా, ఆగకుండా ముందుకు నడిపిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు.

# ఉగ్రవాదులను ఉసికొల్పితే అంతే సంగతులు

### ప్రపంచ పటంలో పాక్ ఉండదు

### పాక్‌కు ఆర్మీ చీఫ్ ద్వివేదీ హెచ్చరిక



**న్యూఢిల్లీ, మే 16:** ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ భారత్‌పై దాడులు కొనసాగిస్తే ప్రపంచపటంలో పాకిస్థాన్ అస్తిత్వమే ప్రమాదంలో పడుతుందని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరించారు. భౌగోళికంగా ఉండాలా లేక చరిత్రలో కలిసిపోవాలా అనేది పాకిస్థాన్ తేల్చుకోవాలని వార్నింగ్ ఇచ్చారు. భారత్‌పై దాడులు చేసే ఉగ్రవాద సంస్థలకు మద్దతు ఇవ్వడం ఆపాలని ఆయన పాక్‌ను హెచ్చరించారు. దేశ భద్రత విషయంలో భారత్ ఎలాంటి రాజీకీ వెళ్లదని, అవసరమైతే కఠిన చర్యలు తీసుకునేందుకు భారత సైన్యం సిద్ధంగా ఉందని ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు. ఉగ్రవాదులను, వారి మద్దతుదారులను భారత్ ఒకే విధంగా పరిగణిస్తుందని, అందరిపై కఠిన చర్యలు తీసుకుంటుందని పునరుద్ఘాటించారు. అలాగే గతేడాది పహల్గాం దాడికి ప్రతిస్పందనగా నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' గురించి కూడా ద్వివేది మాట్లాడారు. పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాల ఉనికిని 'ఆపరేషన్ సిందూర్' ద్వారా ప్రపంచానికి తెలియజేశాం. ఉగ్ర స్థావరాలకు సంబంధించిన ఆధారాలు అందజేశాం. పాకిస్థాన్ ఇప్పటికైనా తన తీరు మార్చుకోవాలి. ఆపరేషన్ సిందూర్ రెండో వెర్షన్ మరింత తీవ్ర స్థాయిలో ఉంటుంది. భారత ప్రభుత్వం ఎప్పుడూ దేశ పౌరుల రక్షణ, శ్రేయస్సు విషయంలో రాజీ పడదు. తన మార్గంలో ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే దీటుగా స్పందిస్తుంది' అని ద్వివేది తేల్చి చెప్పారు. ఒవకేళ పాకిస్థాన్ ఉగ్రవాదులను పోషించి, వాళ్లను ఇండియా మీదకు ఉసి గొల్పుతే, అప్పుడు ఆ దేశం ఈ భూమ్మీద ఉండాలా లేదా అన్న అంశాన్ని వాళ్లే నిర్ణయించు కోవాల్సి ఉంటుందన్నారు. చరిత్రలో ఆ దేశానికి స్థానం ఉండాలంటే ఉగ్రవాదులను పెంచి పోషించరాదన్నారు. మానేక్‌షా సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒకవేళ ఆపరేషన్ సింధూర్ చేపట్టడానికి దారి తీసిన పరిస్థితులు మళ్లీ వస్తే ఏం చేస్తారని ఆయన్ను ప్రశ్నించారు. జనరల్ ద్వివేది తన వ్యాఖ్యల్లో పాకిస్తాన్‌కు నేరుగా వార్నింగ్ ఇచ్చారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఇండియా నిలుస్తుందన్నారు. గత ఏడాది మే 7వ తేదీన పాక్‌పై ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్న ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశారు. ఆ తర్వాత పాక్ దాడులు చేసినా.. ఇండియా వాటిని తిప్పికొట్టింది. సుమారు 88 గంటల పాటు రెండు దేశాలు యుద్ధం కొనసాగించాయి. మే 10వ తేదీ రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ జరిగింది.



# ఐసిస్ అగ్ర ఉగ్రవాది హతం

### నైజీరియాతో కలిసి మట్టుబెట్టిన అమెరికా దళాలు..

### 'ఐసిస్ గ్లోబల్ నెట్‌వర్క్‌కు భారీ దెబ్బ' : ట్రంప్

**వాషింగ్టన్, మే 16:** అంతర్జాతీయ ఉగ్రసంస్థ ఐసిస్‌కు చెందిన మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది అబూ బిలాల్ అల్ మినూకీని అమెరికా, నైజీరియా సంయుక్త బలగాలు హతమార్చాయి. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారికంగా ప్రకటించారు. ఐసిస్ సంస్థలో రెండో అత్యున్నత స్థాయిలో ఉన్న మినూకీ ప్రపంచవ్యాప్తంగా ఉగ్ర కార్యకలాపాలను సమన్వయం చేస్తున్నాడని ట్రంప్ వెల్లడించారు. ఆఫ్రికాలో దాక్కుంటే ఎవరూ గుర్తించలేరని అతడు భావించినా, అమెరికా గూఢచార సంస్థలు అతడి కదలికలను నిరంతరం గమనించాయని తెలిపారు. "అబూ బిలాల్ ఇకపై ఆఫ్రికా ప్రజలను భయభ్రాంతులకు గురిచేయలేడు. అమెరికా లక్ష్యాలపై దాడుల ప్రణాళికలకు సహకరించలేడు" అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ విజయవంతం కావడంలో సహకరించిన నైజీరియా ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నైజీరియాలో జన్మించిన మినూకీ 'ఇస్లామిక్ స్టేట్ వెస్ట్ ఆఫ్రికా ప్రావిన్స్'లో కీలక కమాండర్‌గా పనిచేశాడు. ఉగ్రవాద సెల్స్‌కు మార్గనిర్దేశం చేయడం, అంతర్జాతీయ నిధులను మళ్లించడం వంటి కార్యకలాపాల్లో అతడు కీలక పాత్ర పోషించినట్లు అమెరికా ఆరోపించింది. ఇప్పటికే 2023లో అమెరికా అతడిని అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. తాజా ఆపరేషన్‌తో ఐసిస్ గ్లోబల్ నెట్‌వర్క్‌కు భారీ దెబ్బ తగిలిందని అమెరికా వర్గాలు భావిస్తున్నాయి.


# నీట్ పేపర్ లీక్ కేసు

### పుణెకు చెందిన బాటనీ టీచర్ మనీషా అరెస్ట్

**పుణె, మే 16:** నీట్ పేపర్ లీక్ కేసులో మరో కీలక సూత్రధారి, పుణెకు చెందిన బోటనీ టీచర్ మనీషా మందారేను సీబీఐ అరెస్ట్ చేసింది. బోటనీ విభాగంలో సీనియర్ అధ్యాపకురాలు మనీషాను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నీట్ పక్రియలో స్జబెక్ట్ ఎక్స్‌పర్ట్‌గా నియమించింది. ఏప్రిల్ నుంచి ఆమె కొందరు నీట్ అభ్యర్థులకు తన ఇంటి వద్దే శిక్షణా తరగతులను నిర్వహించారు. ఆ సమయంలోనే ఆమె వారికి నీట్ పరీక్షకు సంబంధించిన బోటనీ, జువాలజీ పేపర్లలోని ప్రశ్నలను లీక్ చేశారు. ఆమె లీక్ చేసిన ప్రశ్నలు మే 3వ తేదీన జరిగిన నీట్ పరీక్షలోని ప్రశ్నలతో సరిపోలినట్టు సీబీఐ అధికారులు వెల్లడించారు . ఇప్పటికే ఈ కేసులో పుణెకు చెందిన కెమిస్ట్రీ లెక్చరర్ పీవీ కులకర్ణిని కూడా సీబీఐ అరెస్ట్ చేసింది. కులకర్ణి గత కొన్నేళ్లుగా నీట్ ప్రశ్నాపత్రం రూపొందించే అధికారిక నిపుణుల కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. కాగా, నీట్ ప్రశ్నాప్రతం లీకేజీ వ్యవహారంలో ఇప్పటివరకు ఢిల్లీ, జైపూర్, నాసిక్, పుణె, గురుగ్రామ్, అహిల్యానగర్ నుంచి తొమ్మిది మందిని సీబీఐ అరెస్ట్ చేసింది.

# విదేశీ పర్యటనలపై పన్నుపై మోడీ స్పందన

### అలాంటిదేమీ లేదంటూ ఎక్స్‌లో పోస్ట్



**న్యూఢిల్లీ, మే 16:** విదేశీ పర్యటనలపై కూడా కేంద్ర ప్రభుత్వం పన్ను లేదా సర్‌చార్జ్ విధించేందుకు యోచిస్తోందంటూ వచ్చిన వార్తలపై ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. ఆ కథనంలో నిజమనేదే లేదని తేల్చి చెప్పారు. పశ్చిమాసియా ఘర్షణలతో ముడిచమురు ధరలు పెరగడం, రూపాయి మారకం విలువ అంతకంతకూ పతనం అవుతున్న నేపథ్యంలో ఆర్థిక రంగంపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వం విదేశీ పర్యటనలపై తాత్కాలికంగా పన్ను విధించేందుకు యోచిస్తోందని సీఎన్‌బీసీఒక కథనాన్ని ప్రసారం చేసింది. ఈ కథనంపై ప్రధాని ఘాటుగా స్పందించారు. 'ఇది పూర్తిగా అసత్యం. ఈ కథనంలో వాస్తవమనేదే లేదు. విదేశీ పర్యటనలపై ఆంక్షలు విధించే ప్రశ్నే లేదు. వ్యాపార నిర్వహణ, ప్రజల జీవనాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చేందుకు మేము కట్టుబడి ఉన్నాము' అని ప్రధాని ఎక్స్ వేదికగా స్పష్టతనిచ్చారు. ప్రధాని పోస్టు తరువాత ఆ వార్తా ఛానల్ కూడా తన కథనాన్ని ఉపసంహరించుకుంది.

# బొద్దింక వ్యాఖ్యలపై సీజేఐ వివరణ

### తన అభిప్రాయాలను వక్రీకరించిందంటూ మీడియాపై ఆగ్రహం

**న్యూఢిల్లీ, మే 16:** యువతపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వివరణ ఇచ్చారు. తన వ్యాఖ్యలను ఓ వర్గం మీడియా వక్రీకరించి ప్రచారం చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశ యువతను విమర్శించినట్టు ప్రచారం చేయడం పూర్తిగా నిరాధారమని స్పష్టం చేశారు. శుక్రవారం విచారణకు వచ్చిన ఓ కేసు సందర్భంగా తాను చేసిన వ్యాఖ్యలు తప్పుగా అర్థం చేసుకున్నారని సీజేఐ తెలిపారు. బోగస్ డిగ్రీలతో లీగల్ వృత్తిలోకి ప్రవేశించి వ్యవస్థను దెబ్బతీసే వ్యక్తుల గురించే తాను వ్యాఖ్యానించానని చెప్పారు. అలాంటి వారు మీడియా, సోషల్ మీడియా, ఇతర వృత్తుల్లోకి చొరబడుతున్నారని, వారినే 'పరాన్నజీవులు'గా అభివర్ణించానని వివరించారు. కానీ దాన్ని దేశ యువతపై విమర్శలుగా చిత్రీకరించడం బాధ కలిగించిందన్నారు. దేశ యువతపై తనకు ఎంతో గౌరవముందని, అభివృద్ధి చెందిన భారత నిర్మాణంలో యువత కీలక శక్తిగా నిలుస్తోందని సూర్యకాంత్ పేర్కొన్నారు. యువత ప్రతిభ, కృషి పట్ల తాను ఎప్పుడూ గర్వపడుతుంటానన్నారు. ఇక సీనియర్ అడ్వకేట్ హోదా కోరుతూ ఒక న్యాయవాది వేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి ధర్మాసనం ముందు కేసు విచారణకు రాగా, పిటిషనర్ ప్రవర్తనపై సీజేఐ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫేస్‌బుక్ పోస్టుల్లో వాడిన భాషను ప్రస్తావిస్తూ, వృత్తిపరమైన ప్రమాణాలు పాటించని వారికి సీనియర్ హోదా ఇవ్వలేమని వ్యాఖ్యానించారు. కొంతమంది న్యాయవాదుల డిగ్రీల ప్రామాణికతపై కూడా అనుమానాలు ఉన్నాయని, అవసరమైతే సీబీఐ విచారణ కోరే పరిస్థితి వస్తుందని సీజేఐ హెచ్చరించారు. అనంతరం పిటిషనర్ కోర్టుకు క్షమాపణ చెప్పి కేసును ఉపసంహరించుకునేందుకు అనుమతి కోరగా, ధర్మాసనం ఆమోదించింది.

# పేదరికం లేని సమాజమే లక్ష్యం

- స్వచ్ఛత మన జీవితాల్లో భాగం కావాలి
- ఎక్కువమంది పిల్లలే మనకు సంపద
- స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు



**శ్రీకాకుళం, మే 16 :** పేదరికం లేని సమాజం చూడాలనేదే తన కోరిక అని సీఎం చంద్రబాబు అన్నారు. సమాజం మారితే స్వచ్ఛాంధ్ర సాకారమవుతుం దని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు.. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్ర మంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. తలసరి ఆదాయం పెంచాలనేది తన ప్రధాన లక్ష్యమన్నారు. సంపద సృష్టించి పేదవాళ్లకు పంచాలి. ఆర్థిక అసమానతలు తగ్గించాలి. ప్రభుత్వానికి మంచిపేరు వచ్చిందంటే అది అధికారుల వల్లే వస్తుంది. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రతో స్వచ్ఛత వైపు అడుగులు వేస్తున్నాం. స్వచ్ఛమైన ఆలోచనలు చేయాలి. అదే మనకు మంచి చేస్తుంది. అల వాట్లు మారాలి.. తద్వారా సమాజం మారుతుంది. గత 16 నెలలుగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర నిర్వహిస్తున్నాం. వ్య ర్థాల నుంచి కరెంట్ ఉత్పత్తి చేస్తున్నాం. ఒకప్పుడు నా పాదయాత్రల సమయంలో చెత్తే ఎక్కువ కనిపించేది. చెత్త నుంచి సంపద సృష్టించడానికి పార్కులు ఏర్పాటు చేశాం. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలి. గత 23 నెలల్లో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలతో మన పిల్లలకు 24 లక్షల ఉద్యోగాలు వస్తాయి. విశాఖకు గూగుల్ తీసుకొచ్చాం. పరిశ్రమలతో ఉత్తరాంధ్రకే వలసలు రావాలని చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు కుటుంబ నియంత్రణ పాటించాలని చెప్పాం. పిల్లలే సంపద అని ఇవాళ చెబుతున్నా. మూడో బిడ్డ పుట్టిన వెంటనే రూ.30 వేలు ఇస్తాం. నాలుగో బిడ్డ పుడితే.. రూ.40 వేలు ఇస్తాం. పిల్లలు భారమనుకోకూడదు.. వాళ్లే సంపద అని గుర్తించాలి. తల్లికి వందనం కింద రూ.15 వేలు అందిస్తున్నాం. భగవంతుడు కరుణిస్తే.. ఈ మొత్తాన్ని పెంచుతాం అని అన్నారు. గత ఐదేళ్లు గొడ్డలి పార్టీ చేసిన అరాచకం చూశాం. ప్రజల ఆస్తులన్నీ మార్చేసి గందరగోళం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల భూముల జోలికి ఎవరూ రాకుండా చర్యలు చేపట్టాం. భూ తగాదాలు లేకుండా చేసే బాధ్యత కూటమి ప్రభుత్వానిది.



## బుల్లెట్ బండి ఎక్కిన చంద్రబాబు

**శ్రీకాకుళం, మే 16 :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకాకుళం జిల్లా నర్సన్నపేటలో పర్యటించారు. 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజావేదిక సమీపంలోని స్టాళ్లను సీఎం చంద్రబాబు పరిశీలించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో 'స్వర ఆర్ట్ గ్యాలరీ'లో గిరిజనులు ప్రత్యేకంగా రూపొందించిన ఓవర్‌కోట్‌ను ఆయన కొనుగోలు చేసి ధరించారు. అనంతరం శ్రీకాకుళం జిల్లాలో పోలీసులు ఏర్పాటు చేసిన 'హెల్మెట్ బ్యాంక్'ను సందర్శించారు. పోలీసులను అభినందించిన సీఎం హెల్మెట్ ధరించి బుల్లెట్ వాహనం ఎక్కారు. ఆయన వెంట కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు ఉన్నారు.

## ఏపీ ఐసెట్ ఫలితాలు విడుదల

**మంత్రి లోకేశ్ ఫలితాల వెల్లడి.. తొంభై ఒకటి శాతం ఉత్తీర్ణత**



**అమరావతి, మే 16:** ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ సమగ్ర ప్రవేశ పరీక్ష ఫలితాలను రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. పరీక్ష రాసిన విద్యార్థులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫలితాలు అధికారికంగా అందుబాటులోకి వచ్చాయి. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ పరీక్షకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈసారి ఏపీ ఐసెట్ పరీక్షకు మొత్తం ఇరవై మూడు వేల నూట తొంభై ఎనిమిది మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. వారిలో ఇరవై ఒక వేల రెండు వందల ఐదుగురు విద్యార్థులు అర్హత సాధించినట్లు వెల్లడించారు. మొత్తం ఉత్తీర్ణత శాతం తొంభై ఒకటి దశాంశం నలభై ఒకటిగా నమోదైనట్లు తెలిపారు. ఈ ఫలితాలు విద్యార్థుల ప్రతిభను ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. పరీక్ష రాసిన విద్యార్థులు తమ ర్యాంకు కార్డులను అధికారిక వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని అధికారులు తెలిపారు. అదేవిధంగా ప్రత్యేక వాట్సాప్ సేవ ద్వారా కూడా ఫలితాలను తెలుసుకునే అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆధునిక సాంకేతిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ఇంటి నుంచే సులభంగా ఫలితాలు తెలుసుకునేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు ఏపీ ఐసెట్ రెండు వేల ఇరవై ఆరు పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు. ఉన్నత విద్యలో మరింత ముందుకు సాగి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## గన్నవరం ఎయిర్‌పోర్టు మూసివేతపై దుష్ప్రచారం

**ప్రజలు అపోహలు నమ్మొద్దు : ప్రభుత్వం**

**విజయవాడ, మే 16:** విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం ఎయిర్‌పోర్టు) మూసివేస్తారంటూ సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ విభాగం 'ఎక్స్' వేదికగా వివరణ విడుదల చేసింది. ప్రస్తుతం గన్నవరం ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రూ.611.80 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవనం పనులు చివరి దశకు చేరుకున్నాయని ప్రభుత్వం వెల్లడించింది. త్వరలోనే ఈ టెర్మినల్‌ను ప్రారంభించేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ), రాష్ట్ర ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపింది. ఇక అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు పూర్తిగా దీర్ఘకాలిక వ్యూహాత్మక ప్రణాళికలో భాగమని పేర్కొంది. రాజధాని అమరావతి పరిధిలోని గుంటూరు జిల్లా తాడికొండ మండలం రావెల గ్రామ సమీపంలో సుమారు 4,618 ఎకరాల్లో కొత్త అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించింది. భవిష్యత్తులో అమరావతిని గ్లోబల్ ఏవియేషన్ హబ్‌గా, విమానాల మరమ్మతుల కేంద్రంగా అభివృద్ధి చేయడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది. అయితే కొత్త విమానాశ్రయం వచ్చినా గన్నవరం ఎయిర్‌పోర్టు సేవలు యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేసింది. మెట్రో నగరాలు, అభివృద్ధి చెందుతున్న రాజధాని ప్రాంతాల్లో ఒకటి కంటే ఎక్కువ విమానాశ్రయాలు ఉండటం సాధారణమని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో గన్నవరం ఎయిర్‌పోర్టు మూసివేతపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.



# పొదుపు చర్యల్లో భాగమే మహానాడు మార్పు

- ప్రధాని పిలుపుతో చంద్రబాబు నిర్ణయం
- మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి



**మచిలీపట్నం, మే 16 :** పొదుపు చర్యలు పాటించాలంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపుతో టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా నిర్వహించాలని పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. నెల్లూరులో జరగాల్సిన మహానాడు కార్యక్రమాన్ని మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పొలిట్‌బ్యూరో సభ్యులు, తదితర ముఖ్య నాయకుల సమక్షంలో ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాలలో క్లస్టర్స్ వారీగా స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మహానాడు ఉద్దేశాలు, నిర్ణయాలను పార్టీ నాయకులు, కార్యకర్తలకు తెలియచేస్తామన్నారు. యుద్ధ ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా నెలకొన్న విపత్కర పరిస్థితుల నేపథ్యంలో పార్టీ ఈ నిర్ణయం తీసుకుందన్నారు. నిత్యావసర సరకులు అధిక రేట్లకు విక్రయిస్తే చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి అభద్రతా భావానికి గురికావాల్సిన అవసరం లేదన్నారు. దీన్ని కట్టడి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. ఇందుకోసం సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ఓ కమిటీని నియమించి నట్లు చెప్పారు. ఈ కమిటీకి రాష్ట్ర పౌరసఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నేతృత్వం వహిస్తున్నారని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించి నిత్యావసర సరకులను అధిక ధరలకు విక్రయిస్తే సహించమన్నారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేకమైన మానిటరింగ్ జరుగుతోందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# ఇదెక్కడి విడ్డూరం.. ఇదేమి నిర్వాకం!

- పరిహారం ఇవ్వకుండా భూముల స్వాధీనానికి యత్నం
- రైతు దంపతులను ప్రొక్లెయినర్ బకెట్‌లో పైకి లేపి అధికారుల వికృత చర్య
- విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో కలకలం



**విజయనగరం, మే 16:** ఇదా ప్రభుత్వ అధికారులు ప్రవర్తించాల్సిన విధానం? ఇది ప్రజాస్వామ్య రాజ్యంలో సాగుతున్న పాలనా లేక ఆటవిక సమాజమా? ప్రజా రక్షణలో ఉండాల్సిన అధికారులు సామాన్య పౌరుల పట్ల ప్రదర్శిస్తున్న తీరు సభ్య సమాజాన్ని నివ్వెరపరుస్తోంది. విజయనగరం జిల్లా భోగాపురం మండలం బైరెడ్డిపాలెం వద్ద భూసేకరణ ఉదంతంలో శనివారం చోటు చేసుకున్న ఘోరమైన ఘటన అధికారుల అమానుషత్వానికి అద్దం పడుతోంది. ఎయిర్‌పోర్ట్ అప్రోచ్ రోడ్డు కోసం సేకరించిన భూముల స్వాధీన ప్రక్రియలో భాగంగా, వృద్ధ దంపతులను ప్రొక్లెయినర్ బకెట్‌లో కూర్చోబెట్టి పైకి లేపి భయపెట్టాలని అధికారులు ప్రయత్నించిన తీరు స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ అప్రోచ్ రోడ్డు కోసం సేకరించిన భూములను స్వాధీనం చేసుకునేందుకు రెవెన్యూ అధికారులు శనివారం భారీ యంత్రాలతో బైరెడ్డిపాలెం చేరుకున్నారు. అయితే, తమకు తగిన పరిహారం చెల్లించకుండా భూములను ఎలా స్వాధీనం చేసుకుంటారంటూ స్థానిక రైతులు అధికారులను అడ్డుకున్నారు. తమ జీవనాధారమైన భూమి పోతుందనే భయంతో, ఆవేదనతో కొంతమంది రైతులు అధికారుల విధి నిర్వహణకు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే ఒక వృద్ధ రైతు దంపతులు తమ నిరసనను తెలియజేస్తూ, భూమిని తవ్వకుండా ఉండేందుకు అక్కడ ఉన్న జేసీబీ (ప్రొక్లెయినర్) బకెట్ లోపల కూర్చున్నారు. ఆ వృద్ధ దంపతులు తెలియనితనంతో లేదా తమ భూమి ఎక్కడ హస్తగతమవుతుందోనన్న ఆందోళనతో కొంత దురుసుగా ప్రవర్తించి ఉండొచ్చు గాక, కానీ చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యతాయుతమైన అధికారులు మాత్రం ఒక వికృత రాక్షస చర్యకు పాల్పడ్డారు. సమస్య ఏదైనప్పటికీ, దానిని సామరస్యంగా పరిష్కరించాల్సింది పోయి, ఆ వృద్ధ దంపతులను అదే ప్రొక్లెయినర్ బకెట్‌లో కూర్చోబెట్టి, యంత్రాన్ని ఆన్ చేసి ఒక్కసారిగా గాల్లోకి పైకి లేపారు. గాల్లో ఆ బకెట్ లోపల ఉన్న వృద్ధులు ప్రాణభయంతో విలవిలలాడుతున్నా అధికారులు కనికరం చూపకుండా వారిని భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేశారు. న్యాయం కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వృద్ధుల పట్ల అధికారులు అవలంబించిన ఈ అమానవీయ ప్రవర్తనపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. బాధితులకు న్యాయం చేయాల్సిన స్థానంలో ఉన్న రెవెన్యూ యంత్రాంగం, ఇలా ప్రొక్లెయినర్లతో ప్రాణాలతో చెలగాటం ఆడటం ఎంతవరకు సమంజసమని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఈ దారుణమైన సంఘటనను సభ్య సమాజం ఖచ్చితంగా ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వృద్ధుల ప్రాణాలకు ముప్పు తెచ్చేలా వ్యవహరించి, మానవ హక్కులను కాలరాసిన బాధ్యులైన ప్రభుత్వ ఉద్యోగులపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు మరియు రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## 20న రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ షాపులు బంద్

**ఆన్‌లైన్ మెడికల్ దందాకు వ్యతిరేకంగా నిర్ణయం**

**విజయవాడ, మే 16:** మే 20న రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ షాపులు బంద్ కానున్నాయి. కేంద్ర ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా బందుకు డ్రగ్స్ కంట్రోల్ ఆఫీసర్స్ ఇండియా వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపునిచ్చింది.. కోవిడ్ సమయంలో వచ్చిన ఆదేశాలను అడ్డంగా పెట్టుకుని అక్రమ దందా జరుగుతుందని ఆరోపించింది. ఆన్‌లైన్ బిజినెస్ లో నకిలీ మందులతో పాటు ప్రమాదకరమైన మందులు సరఫరా అవుతున్నాయని అసోసియేషన్ పేర్కొన్నది.. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఆన్‌లైన్ సేవలకు ఫుల్ స్టాప్ పెట్టాలని అసోసియేషన్ డిమాండ్ చేస్తోంది. దీనివల్ల సామాన్య ప్రజలు మందులు కొనుగోలు చేయడంలో ఇబ్బందులు ఎదుర్కోవచ్చు. ఆన్‌లైన్‌లో మందులు విక్రయించే ఈ-ఫార్మసీ కంపెనీలకు వ్యతిరేకంగా ఈ సమ్మె జరుగుతోంది. సరైన పరీక్షలు చేయకుండానే ఆన్‌లైన్ ఎ÷-లాట్‌ఫామ్‌లలో మందులు అమ్ముతున్నారని, ఇది రోగుల భద్రతకు పెద్ద ముప్పుగా పరిణమించవచ్చని ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ చెబుతోంది. అనేక ఈ-ఫార్మసీ వెబ్‌సైట్లు సరైన వైద్య ధృవీకరణ లేకుండా మందులను పంపిణీ చేస్తున్నాయని ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ ఆరోపిస్తున్నాయి. పాత ప్రిస్క్రిప్షన్‌లను తరచుగా తిరిగి వాడుతున్నారు, ఇప్పుడు, ఏఐ సాంకేతికతతో, మందులను కొనుగోలు చేయడానికి నకిలీ ప్రిస్క్రిప్షన్‌లను సృష్టించవచ్చు. ఇది యాంటీబయాటిక్‌ల దుర్వినియోగం, వ్యసనపరులైన మందుల దుర్వినియోగంలో వేగవంతమైన పెరుగుదలకు దారితీయవచ్చు, ఇది భవిష్యత్తులో తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు కారణం కావచ్చు. అంతేకాకుండా, ఆన్‌లైన్ ఎ÷-లాట్‌ఫారమ్‌లలో మందులను భారీ తగ్గింపులకు అమ్మడం చిన్న దుకాణదారుల వ్యాపారాలను తీవ్రంగా దెబ్బతీస్తోంది. స్థానిక వైద్య దుకాణాలపై ప్రజలు ఆధారపడే గ్రామాలు, చిన్న పట్టణాలలో ఈ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, అనేక చిన్న మందుల దుకాణాలు మూతపడవచ్చని, దీనివల్ల మందుల లభ్యతపై ప్రభావం పడుతుందని ఏఐఓసీడీ పేర్కొంది.

# చిన్నారులలో సృజనాత్మకతను ఆవిష్కరిస్తున్న బాల భవన్

● కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నిజామాబాద్, మే 16( సమయం న్యూస్)** చిన్నారులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తూ, వారిలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు బాల భవన్ ఆధ్వర్యంలో వేసవిలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో ఉపయుక్తంగా నిలుస్తున్నాయని జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి ప్రశంసించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యా వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని బాల భవన్ లో శనివారం "కళా వైభవం - కలర్స్ ఆఫ్ చైల్డ్ హుడ్" కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర మేయర్ ఉమారాణి, కలెక్టర్ ఇలా త్రిపాఠి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. బాల భవన్ లో శిక్షణ పొందుతున్న బాలబాలికలు తమ సృజనను చాటుతూ అందంగా ఆకట్టుకునే రీతిలో తయారు చేసిన కళాకృతులు, ఎంతో హృద్యంగా గీసిన కళాకృతులను ఆసక్తితో తిలకించారు. చక్కటి పెయింటింగ్స్ గీసిన 7వ తరగతి విద్యార్థి సాయి రుధిర్ కళా నైపుణ్యాన్ని కలెక్టర్ మెచ్చుకుంటూ, చిన్నారికి బహుమతిని అందించి ప్రోత్సహించారు. పేరిణి, కోలాటం నృత్యాలతో అలరింపజేసిన చిన్నారులను, వెంట్రిలాక్విజంతో ఆకట్టుకున్న జాదూ యుగంధర్ రంగనాథ్ ను సైతం కలెక్టర్ ప్రశంసించారు. ప్రస్తుత వేసవి శిక్షణ తరగతులలో బాల భవన్ లో 720 మంది చిన్నారులకు ప్రవేశాలు కల్పించగా, వారికి శాస్త్రీయ సంగీతం, నృత్యం, మిమిక్రీ, కర్రసాము, డ్రాయింగ్, యోగా, మ్యాజిక్ తదితర 30 అంశాలలో అందిస్తున్న అందిస్తున్న శిక్షణ కార్యక్రమాల గురించి నిర్వాహకులను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సభా వేదిక దిగి కలెక్టర్ చిన్నారుల మధ్యకు వెళ్లి వారికి ఆయా అంశాలపై ప్రశ్నలు వేస్తూ సమాధానాలు రాబట్టారు. చిన్నారులు అందరికీ చాక్లెట్లు పంచుతూ, ప్రతిభ చాటిన బాలబాలికలకు బహుమతులు అందించారు. బాలభవన్ ద్వారా చక్కటి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని సంబంధిత అధికారులను అభినందించారు. చిన్నారులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు తమ పిల్లలను బాల భవన్ లో చేర్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ శిక్షణ ద్వారా పిల్లల్లోని సృజనాత్మకత వెలుగులోకి వస్తుందని, వారికి ఇష్టమైన అంశాలలో తర్ఫీదు ఇవ్వడం వల్ల నైపుణ్యాలు మరింతగా మెరుగవుతాయని అన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని అన్ని సదు- పాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని, ఆహ్లాదకర వాతావరణంలో చిన్నారులు ఉల్లాసంగా ఉత్సాహంగా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరాలని, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు ప్రతిష్టలు తేవాలని చిన్నారులకు ఉద్బోధించారు. నగర మేయర్ ఉమారాణి మాట్లాడుతూ, నేటి చదువులు ఎంతో ఒత్తిడితో కూడుకుని ఉంటున్నాయని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బాల భవన్ ద్వారా అందిస్తున్న వేసవి శిక్షణ కార్యక్రమాలు చిన్నారులకు ఎంతో ఆహ్లాదాన్ని అందిస్తూ, వారిలో సృజనాత్మకతను, నైపుణ్యాల అభివృద్ధికి దోహదపడుతున్నాయని అన్నారు. ఈ తరహా అవకాశాలను పిల్లలు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి పి. అశోక్, బాల భవన్ సూపరింటెండెంట్ ఉమాబాల, మాజీ పర్యవేక్షకుడు ప్రభాకర్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



# నేడు బీపీ చెక్... రేపటి ఆరోగ్యానికి బలమైన అడుగు

- చిన్న జాగ్రత్తలు... పెద్ద ప్రమాదాలకు అడ్డుకట్ట.
- ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా వైద్యుల హెచ్చరిక
- "నిశ్శబ్ద హంతకుడు"గా మారుతున్న హైపర్‌టెన్షన్.. ముందస్తు జాగ్రత్తలే రక్షణ



**హైదరాబాద్, మే 17:** ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా వైద్య నిపుణులు ప్రజలకు కీలక సూచనలు చేశారు. ప్రస్తుతం జీవనశైలి మార్పులు, ఒత్తిడి, అనారోగ్యకర ఆహారపు అలవాట్ల కారణంగా అధిక రక్తపోటు (ఎఙజూవతీవఅంఱశీఅ) కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. "సైలెంట్ కిల్లర్"గా పేరుగాంచిన ఈ వ్యాధి ప్రారంభ దశలో ఎలాంటి లక్షణాలు చూపించకపోవడం వల్ల ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని హెచ్చరించారు.

వైద్యుల ప్రకారం ధూమపానం, మద్యం అధికంగా సేవించడం, ఊబకాయం, వ్యాయామం లేకపోవడం, ఆహారంలో ఉప్పు ఎక్కువగా తీసుకోవడం, మానసిక ఒత్తిడి, కుటుంబ చరిత్ర, మూత్రపిండాల సమస్యలు మరియు థైరాయిడ్ సమస్యలు అధిక రక్తపోటుకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.

**గుండె, మెదడు, కిడ్నీలపై తీవ్ర ప్రభావం...** అధిక రక్తపోటు గుండె సంబంధిత వ్యాధులకు ప్రధాన ప్రమాద కారకంగా మారుతోందని వైద్యులు తెలిపారు. రక్తపోటు అదుపులో లేకపోతే మెదడులోని రక్తనాళాలు చిట్లిపోయి స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. అలాగే కిడ్నీలు దెబ్బతినే అవకాశముండటంతో పాటు నేత్ర సంబంధ సమస్యలు కూడా తలెత్తవచ్చని పేర్కొన్నారు.

**కనిపించే హెచ్చరిక సంకేతాలు ఇవే...** సాధారణంగా చాలామందికి బీపీ ఉన్నా ఎలాంటి లక్షణాలు కనిపించవు. అయితే రక్తపోటు ఎక్కువగా పెరిగినప్పుడు కొన్ని హెచ్చరికలు కనిపించే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. ఉదయాన్నే తలనొప్పి రావడం

తల తిరగడం లేదా చూపు మసకబారడంఛాతీలో అసౌకర్యంశ్వాస తీసుకోవడంలో ఇబ్బందిఅలసట

ముక్కు నుంచి రక్తస్రావంగుండె తడబాటుచెవుల్లో మోగుతున్న శబ్దంచిన్న మార్పులతోనే నియంత్రణ సాధ్యంప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు నడవడం, ఉప్పు తగ్గించడం, శరీర బరువును నియంత్రించడం, పొగ తాగడం మానేయడం, మద్యం పరిమితం చేయడం, మానసిక ఒత్తిడిని తగ్గించడం మరియు సరైన నిద్రపోవడం ద్వారా రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవచ్చని వైద్యులు సూచించారు. డయాబెటిస్, అధిక బరువు, కుటుంబంలో బీపీ చరిత్ర ఉన్నవారు తప్పనిసరిగా రెగ్యులర్‌గా బీపీ పరీక్షలు చేయించుకోవాలని నిపుణులు సూచించారు. జీవనశైలి మార్పుల తర్వాత కూడా రక్తపోటు 130/80 కంటే ఎక్కువగా కొనసాగితే వైద్యుల సలహాతో చికిత్స తీసుకోవాలని తెలిపారు.

**ప్రజల్లో అవగాహన పెంపే ప్రధాన లక్ష్యం...** ప్రపంచ రక్తపోటు దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం ప్రజల్లో అవగాహన పెంచడం, వ్యాధిని ముందుగానే గుర్తించడం మరియు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకునేలా ప్రోత్సహించడం అని వైద్య నిపుణులు పేర్కొన్నారు. "సమయానికి పరీక్షలు -- ఆరోగ్యానికి రక్షణ" అనే సందేశాన్ని ప్రజలకు చేరవేయాలని పిలుపునిచ్చారు.

# మావోయిస్టు పార్టీలో పనిచేసి ఇటీవల లొంగిపోయి జనజీవన స్రవంతిలో

కలిసిన సభ్యులకు రివార్డులను అందజేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్



**కొత్తగూడెం మే16( సమయం న్యూస్) :** ఇటీవల పోలీసులు ఎదుట లొంగిపోయిన మావోయిస్టు పార్టీకి చెందిన వివిధ క్యాడర్లకు చెందిన 10 మంది సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంజూరైన రివార్డులను శనివారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తన చేతుల మీదుగా అందజేశారు. మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్న సమయంలో వారి క్యాడర్ ను బట్టి తెలంగాణ ప్రభుత్వం రివార్డులను ప్రకటించింది. 10 మంది సభ్యులకు గాను 55,60,000/-(యాభై ఐదు లక్షలు) రూపాయలను ఎస్పీ చెక్కుల రూపంలో అందజేశారు. ప్రత్యేక చొరవ తీసుకొని లొంగిపోయిన వారందరికి ప్రభుత్వం తరఫున రావాల్సిన రివార్డు నగదును ఎస్పీ రోహిత్ రాజు అందజేశారు. రివార్డులను అందుకున్న వారిలో స్టేట్ కమిటీ మెంబెర్ - 01,డివిజనల్ కమిటీ మెంబర్స్ - 01, ఏరియా కమిటీ మెంబెర్స్ - 06, దళ సభ్యులు - 02 లు ఉన్నారు. ప్రస్తుతం వారి స్థితిగతుల గురించి ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. రివార్డులను అందుకున్న సభ్యులకు ఎస్పీ కొన్ని సూచనలను చేశారు. రివార్డుల ద్వారా అందుకున్న నగదును విలాసాలకు ఉపయోగించకుండా, సక్రమ పద్ధతిలో జీవనోపాదికి ఉపయోగపడేలా వాటిని ఖర్చు చేసుకోవాలని సూచించారు. జిల్లా పోలీసులు చేపట్టిన "ఆపరేషన్ చేయూత" కార్యక్రమానికి ఆకర్షితులై లొంగిపోయిన మావోయిస్టులకు జిల్లా పోలీస్ శాఖ అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఎస్పీ తెలియజేసారు. లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసంతో పాటు ప్రభుత్వం తరఫున అందవలసిన అన్ని రకాల ప్రతిఫలాలను అందిస్తున్నామని తెలియజేశారు.

# మద్దూర్ వరి కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

●సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్



**మద్దూర్ మున్సిపల్,(మం)మే,16(సమయం న్యూస్) :** నారాయణ పేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలోని మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని శనివారం జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలను చూసి మిల్లులకు తరలించాలని ఆదేశించగా, దొడ్డు రకం వడ్లు ఎక్కువగా ఉన్నాయని, కోస్గి ధనలక్ష్మి రైస్ మిల్లు యజమాని బస్తాలను పంపించ వద్దు అని చెప్పి కేవలం కోస్గి మండలానికి చెందిన కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే బస్తాలను మాత్రమే మిల్లుకు తెప్పించుకుంటున్నారని కేంద్రం నిర్వాహకులు కలెక్టర్ కు తెలిపారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారికి ఫోన్ చేసి మాట్లాడి మద్దూరు కేంద్రానికి చెందిన ధ్యానం బస్తాలను మిల్లు లో దించుకునేలా చూడాలని ఆదేశించారు. కేంద్రానికి ఇంతవరకు 16 వేల బస్తాలు విక్రయానికి వచ్చాయని, ఇంకా 5 నుంచి 7 వేల బస్తాలు వచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు కలెక్టర్ కు తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దూరు తహసిల్దార్ మహేశ్, పుర కమిషనర్ శ్రీకాంత్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహణ




**హైదరాబాద్, మే 16 (సమయం న్యూస్):** జాతీయ వెక్టర్ బోర్న్ డిసీజెస్ కంట్రోల్ కేంద్రం (చీజఎదీణజ) ఆధ్వర్యంలో మే 16ను "జాతీయ డెంగ్యూ దినోత్సవం"గా నిర్వహించారు. ఈ ఏడాది "ఖఅఖవ. ాూఫ్. జుశ్రీఱఎఱఅఫ్వ." అనే థీమ్‌తో డెంగ్యూ నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. మసాబ్‌ట్యాంక్‌లోని అఫ్జల్ సాగర్ యూపీహెచ్‌సీ పరిధిలో సీనియర్ ఎంటమాలజిస్ట్, వైద్యాధికారులు, జీహెచ్‌ఎంసీ ఆరోగ్య సిబ్బంది కలిసి అవగాహన ర్యాలీ, కరపత్రాల పంపిణీ, ప్రజలకు సూచనలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. డెంగ్యూ వ్యాధి ముఖ్యంగా వర్షాకాలం, అనంతర కాలంలో అధికంగా వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవడం, నీటి పాత్రలను మూతపెట్టడం, దోమల నివారణ చర్యలు తీసుకోవడం ద్వారా డెంగ్యూ వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. పట్టణీకరణ, వ్యర్థాల నిర్వహణలో లోపాలు, నీటి నిల్వలు, వాతావరణ మార్పులు వంటి కారణాలతో డెంగ్యూ వ్యాప్తి పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రతి ఏడాది జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన పెంపొందిస్తోంది. ఈ కార్యక్రమంలో ఏఎంఓహెచ్ మసాబ్‌ట్యాంక్ సర్కిల్-34, ఇన్‌చార్జ్ ఏఎంఓహెచ్ గోషామహల్ సర్కిల్-30, గోల్కొండ జోన్ అధికారులు పాల్గొన్నారు.

# పీఎం రాహత్ స్కీంపై ఆసుపత్రుల యాజమాన్యాలకు అవగాహన



**నిజామాబాద్, మే 16,( సమయం న్యూస్) :** కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభమవుతున్న పీఎం రాహత్ పథకంపై నిజామాబాద్ ఐఎంఏ సమావేశ మందిరంలో శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ అనుమతి కలిగిన 38 ఆసుపత్రుల యాజమాన్యాలు, వైద్యులకు పథకం అమలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మస్తాన్ అలీ, డీఎంహెచ్‌వో రాజశ్రీ మాట్లాడుతూ ప్రమాద బాధితులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ. 1.50 లక్షల వరకు లేదా ఏడు రోజుల వరకు ఉచిత చికిత్స అందుతుందని తెలిపారు. పథకం అమలులో ఆసుపత్రులు ఎలాంటి పొరపాట్లు చేయకుండా బాధితులకు తక్షణ సహకారం అందించాలని సూచించారు. పోలీసు, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని శిక్షణ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్ఫర్మేటిక్స్ అధికారి మధు, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డా. విశాల్, కార్యదర్శి డా. సృజన్, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ శశాంక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను పొదుపు చేయాలంటూ ధరల మంట పెడుతున్న మోడీ

● పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలి

● సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య





**సమయం న్యూస్ గజ్వేల్ మే 16 :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలను పొదుపు చేయాలంటూనే బంగారం, గ్యాస్ పెట్రోల్ డీజిల్ వాడకం తగ్గించాలంటూ ధరలు పెంచుతూ సామాన్య ప్రజల నడ్డి విరుస్తుందని అన్నారు. పెట్రోల్ పై మూడు రూపాయలు సిఎన్జి గ్యాస్ పై రెండు రూపాయలు, ఇటీవల కాలంలో వ్యాపార సిలిండర్ పై 1000 రూపాయలు పైగా పెంచి ప్రజల జేబుకు చిల్లు పెట్టడం జరిగిందని అన్నారు కార్పొరేట్ కంపెనీలకు వేల కోట్ల రైతులు, విదేశాల్లో పరిశ్రమ పెట్టిన దేశ డాలర్లను బయటకు పంపి ధనవంతులకు ఒక విధంగా పేద, మధ్య తరగతి ప్రజలకు ఒక విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నారు గత పది సంవత్సరాలుగా జీతాలు పెంచకుండా, నిత్యవసర సరుకుల ధరలు అనేక రెట్లు పెంచి పేదలను మోసం చేస్తుందని అన్నారు. ప్రత్యామ్నాయంగా కార్పొరేట్ పన్నులు, సూపర్ ప్రాఫిట్ పన్నులు వేయకుండా ప్రత్యక్ష పన్నుల ద్వారా ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారని అన్నారు పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని, నిత్యవసర సరుకులు ధరలు నియంత్రించాలని డిమాండ్ చేశారు భవిష్యత్తులో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి, నాయకులు బండ్ల స్వామి, పట్టణ నాయకులు ఎమ్ రాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

## ముషీరాబాద్ యూపీహెచ్‌సీ ఆసుపత్రిలో దోమల నివారణ అవగాహన కార్యక్రమం



**ముషీరాబాద్, మే 16:**జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ముషీరాబాద్ యూపీహెచ్‌సీ (ఖూఎజ) ఆసుపత్రిలో దోమల నివారణ మరియు పారిశుధ్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, పారిశుధ్య కార్మికులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులు సూచించారు. ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకూడదని ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పాల్గొన్న వారు చేతులు పైకెత్తి దోమల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. "ప్రతి శుక్రవారం డ్రై డే పాటిద్దాం", "దోమల నివారణకు అందరం కలిసి పనిచేద్దాం" వంటి నినాదాలతో కార్యక్రమం కొనసాగింది.అధికారులు మాట్లాడుతూ ప్రజల సహకారంతోనే దోమల వ్యాధులను పూర్తిగా నియంత్రించగలమని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి పారిశుధ్య నియమాలను పాటించాలని కోరారు.

## జన గణన సర్వే పనులను ఆకస్మికంగా పరిశీలించిన మద్దూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్



**మద్దూర్ మున్సిపల్, మే,16(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా మద్దూర్ మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న జన గణన (జవఅంబం) సర్వే పనులను మున్సిపల్ కమిషనర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే సిబ్బంది నిర్వహిస్తున్న ఇంటింటి వివరాల సేకరణ విధానాన్ని పరిశీలించి, ప్రతి కుటుంబానికి సంబంధించిన సమాచారం ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు.అదేవిధంగా సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా,సమయపాలనతో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలు కూడా జనగణన సర్వేకు పూర్తి సహకారం అందించాలని మద్దూర్ కమిషనర్ శ్రీకాంత్ కోరారు.ఈ తనిఖీ కార్యక్రమంలో సంబంధిత మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభం

● ఇంటింటి సర్వే ద్వారా ఓటరు వివరాల సేకరణ



**హైదరాబాద్, మే 16 (సమయం న్యూస్):**ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (SIR) ప్రక్రియ రాష్ట్రంలో ప్రారంభమైనట్లు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సి. సుధర్శన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన సవరణ షెడ్యూల్, విధివిధానాలను వివరించారు.జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి, ముందే ముద్రించిన ఎన్యూమరేషన్ ఫారమ్‌లను ఓటర్లకు అందజేయనున్నారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా విడుదల కాగా, ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించనున్నారు. తుది ఓటరు జాబితా అక్టోబర్ 1న ప్రచురించనున్నారు. ఓటర్లు ఆన్‌లైన్‌లో కూడా వివరాలు సమర్పించుకునే సౌకర్యం కల్పించినట్లు అధికారులు తెలిపారు. 1950 టోల్ ఫ్రీ నంబర్‌తో పాటు జుజ×చీజు యాప్ ద్వారా కూడా సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

## డిపార్ట్మెంట్ పరీక్షలు మే 23 నుంచి టీజీపీఎస్సీ.

**హైదరాబాద్, మే 16 (సమయం న్యూస్):** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించే శాఖాపరమైన పరీక్షలు (కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ మినహా) మే 23 నుంచి జూన్ 1 వరకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలో నిర్వహించనున్నట్లు కమిషన్ వెల్లడించింది.

దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మే 18 సాయంత్రం 5 గంటల నుంచి టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. హాల్ టికెట్లను భద్రంగా ఉంచుకోవాలని, డూప్లికేట్ హాల్ టికెట్లు జారీ చేయబోమని స్పష్టం చేసింది.

హాల్ టికెట్లు డౌన్‌లోడ్‌లో ఇబ్బందులు ఎదురైతే 040-22445566 హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని సూచించింది.

# ఎస్ఎస్‌సి తర్వాత విద్యార్థులు ఉన్నత విద్యపై దృష్టి పెట్టి భవిష్యత్తును నిర్ధారణ చేసుకోవాలి

● జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్ నగర్ మే16( సమయం న్యూస్) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా, మే 11 నుండి 17 వరకు విద్యా శాఖ ద్వారా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, మేయర్ గుమ్మాల మమతతో కలిసి ఎస్.ఎస్.సి లో ముగ్గురు ఇంటర్ లో ముగ్గురు, క్రీడలలో ముగ్గురు ఉత్తమ ఫలితాలు సాధించిన 9 మంది జిల్లా టాపర్లకు 10 వేల రూపాయల నగదు, మెడల్, సర్టిఫికెట్ ప్రధానం చేసి సన్మానించారు. అలాగే జిల్లా లో ఎస్.ఎస్.సి ఫలితాల్లో 100 శాతం పాస్ సాధించిన 57 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శాలువాతో సన్మానించి, ఆయా పాఠశాలలో యస్.యస్.సి లో టాప్ మార్కులు సాధించిన విద్యార్థులకు మెడల్, సర్టిఫికెట్ ప్రధానం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాలోనే టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల సమష్టి కృషితో జిల్లాలో ఎస్ఎస్‌సీ ఫలితాల్లో 92.70 శాతం ఉత్తీర్ణత సాధించ గలిగామని అన్నారు. జిల్లాలో ఉన్న 180 ప్రభుత్వ విద్యాలయాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, నూటికి నూరు శాతం ఫలితాలు నమోదు చేసిన 57 ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, సబ్జెక్టు ఉపాధ్యాయులను ప్రోత్సహించేందుకే ఈ సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎస్ఎస్‌సీ తర్వాత విద్యార్థులు ఉన్నత చదువులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా బాలికలు చదువు మధ్యలో ఆపకుండా ముందుకు సాగాలని సూచించారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, ట్రిపుల్ ఐటీ వంటి విద్యా అవకాశాలపై విద్యాశాఖ ద్వారా మండలాల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులు ఉన్నత చదువుల్లోనూ రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.మేయర్ గుమ్మాల మమత మాట్లాడుతూ, విద్యార్థులు ఎస్. ఎస్.సి ఫలితాల్లో మంచి ఉత్తీర్ణత సాధించడం ఎంతో సంతోషమని అన్నారు. విద్యార్థి జీవితంలో ఎస్.ఎస్.సి పరీక్షలు ముఖ్యమైన తొలిమెట్టని అన్నారు. ప్రతి విద్యార్థి ఎస్. ఎస్.సి తరువాత తప్పకుండా ఉన్నత చదువులు చదవాలని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కూడా విద్యార్థుల చదువును ప్రోత్సహించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో కంటే ప్రభుత్వ పాఠశాలలో మంచి విద్యాబోధన ఉన్నదని, విద్యార్థులు దానిని సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని అన్నారు.జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యాశాఖ విద్య విజయోత్సవాలను నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం జిల్లాలో ఉన్న 180 పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాల టాపర్లకు సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రధానం చేసి సన్మానించుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ ద్వారా జిల్లాలో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు చేపడుతున్న అనేక కార్యక్రమాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి రాజశేఖర్ రెడ్డి, సి.యం.ఓ సుధాకర్ రెడ్డి, ఎ.ఎం.ఓ డి . శ్రీనివాస్, జి.సి.డి.ఓ అశ్ర ఖాద్రి,ఏడీ అనురాధ , వెంకట్రాములు, అన్ని మండలాల ఎంఈఓ లు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

# బాలల రక్షణలో పోక్సో చట్టం కీలకం

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఖ్రూా
- పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి.
- తల్లిదండ్రులు తమ పిల్లల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.



**నారాయణపేట, మే,16(సమయం న్యూస్) :** పిల్లలపై లైంగిక నేరాలను అరికట్టేందుకు అమలులో ఉన్న పోక్సో చట్టం (ూూజుూ ూాచ్) గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఖ్రూా తెలిపారు.పిల్లల రక్షణ, వారి హక్కుల పరిరక్షణ కోసం ఈ చట్టం ఎంతో కీలకమని పేర్కొన్నారు.పిల్లలపై లైంగిక దాడులు, వేధింపులు, దుర్వినియోగం వంటి నేరాలకు పాల్పడిన వారిపై పోక్సో చట్టం కింద కఠిన శిక్షలు విధించబడతాయని తెలిపారు. ఈ చట్టం ప్రకారం 18 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి ఒక్కరినీ "పిల్లలు"గా పరిగణిస్తారని, వారిపై జరిగే ఏ విధమైన లైంగిక నేరమైనా తీవ్రంగా పరిగణించబడుతుందని స్పష్టం చేశారు.పిల్లలపై జరిగే నేరాలను దాచిపెట్టడం లేదా రాజీ ప్రయత్నాలు చేయడం చట్టవిరుద్ధమని, ఇలాంటి కేసుల్లో తప్పనిసరిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ హెచ్చరించారు. బాధితులకు న్యాయం చేయడంలో పోలీసులు అత్యంత సున్నితంగా, వేగంగా స్పందిస్తారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో స్నేహపూర్వకంగా మాట్లాడి, మంచి-చెడు స్పర్శల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలు ఇంటి దగ్గర ఉన్న, పక్క ఇంట్లో వదిలి వెళ్లిన, పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీలు మరియు ఇతర విద్యాసంస్థలు తల్లిదండ్రులు తమ పిల్లల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ తెలిపారు.సమాజంలో ఎక్కడైనా పిల్లలపై అనుమానాస్పద ఘటనలు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు డయల్ 100 కు లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.పోక్సో చట్టం అమలులో పోలీస్ శాఖ కట్టుదిట్టంగా వ్యవహరిస్తుందని, పిల్లల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ పిల్లల రక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.పిల్లల భద్రత -- మనందరి బాధ్యత అనే సందేశంతో సమాజం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కోరారు.

## మిషన్ మోడ్ లో ధాన్యం సేకరణ

● దొడ్డు రకం ధాన్యం బాయిల్డ్ మిల్లర్ లు దిగుమతి చేసుకోవాలి

● రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ



**మహబూబ్ నగర్ మే16( సమయం న్యూస్) :** జిల్లా లో బాయిల్డ్ రైస్ మిల్లర్ లు వారికి కేటాయించిన దొడ్డు రకం ధాన్యం సేకరణకు సహకరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ కోరారు..శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని ఎన్.ఐ.సి.కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలోని బాయిల్డ్ రైస్ మిల్లర్ లు,పౌర సరఫరాల శాఖ డి.టి.లు,లారీ కాంట్రాక్టర్ లతో ధాన్యం సేకరణ పై సమావేశం నిర్వహించి సమీక్షించారు.ప్రస్తుతం ధాన్యం సేకరణ పీక్ లో ఉందని,రాష్ట్ర ముఖ్యమంత్రి మిషన్ మోడ్ లో ధాన్యం సేకరణ చేయాలని ఆదేశాలు జారీ చేశారని,అందుకనుగుణంగా మే నెలాఖరు లోగా ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలో 75 రైస్ మిల్లర్ లు ధాన్యం సేకరణలో పాల్గొంటున్నారని,ఇందులో 60 రా రైస్ మిల్లర్ లు,15 బాయిల్డ్ రైస్ మిల్లర్ లు ఉన్నారని తెలిపారు.ముఖ్యంగా దొడ్డు రకం ధాన్యం సేకరణ బాయిల్డ్ మిల్లర్ లు మిల్లింగ్ సామర్థ్యం మేరకు కేటాయించిన ధాన్యం జాప్యం లేకుండా దిగుమతి చేసుకోవాలని సూచించారు మిల్లు వద్ద హమాలీ లు సంఖ్య పెంచుకోవాలని ఆన్ లోడింగ్ త్వరగా వీలు అవుతుందని తెలిపారు.లారీ ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ లు పెద్ద ఎత్తున ధాన్యం వచ్చిన కొనుగోలు కేంద్రాల కు లారీలు ఏర్పాటు చేయాలని అన్నారు.ధాన్యం సేకరణ వేగవంతం చేయుటకు,రవాణా సమస్య లేకుండాట్రాన్స్పోర్ట్,పోలీస్ శాఖ సహకారం తో రోడ్డు పై లారీ లు,ట్రాక్టర్ లు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.ధాన్యం సేకరణ కొనుగోలు కేంద్రాల్లో ట్రాన్స్పోర్ట్ శాఖ ఏర్పాటు చేసిన లారీ లు ప్రత్యేక వరసలో ఏర్పాటు చేసి ధాన్యం ఆన్ లోడింగ్ చేసుకోవాలని సూచించారు.పౌర సరఫరాల డి.టి.లు మిల్లు లలో ఆన్ లోడింగ్ మానిటర్ చేయాలని సూచించారు. డి.సి.ఆర్.బి.డి.ఎస్.పి రమణా రెడ్డి,సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్,జిల్లా పౌర సరఫరాల సంస్థ డి.ఏం.రవి నాయక్ ,మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు అశోక్ తదితరులు పాల్గొన్నారు

## కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యం బస్తాలను వెంటనే..

● లారీల్లో లోడ్ చేయించి కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలి.

● ఆదేశించిన జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్





**దామరిగిద్ద మండలం, మే,16(సమయం న్యూస్) :** దామరిగిద్ద మండలం కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యం బస్తాలను వెంటనే లారీల్లో లోడ్ చేయించి కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. శనివారం దామర గిద్ద మండలంలోని బాపన్ పల్లి ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో ఇంతవరకు ఎన్ని బస్తాల ధాన్యం కొనుగోలు చేశారని ఎంత మంది రైతులకు ధ్యానం డబ్బులు ఖాతాల్లో జమ అయ్యాయని అడిగి తెలుసుకున్నారు.

# కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కృత్రిమ మేధపై అవగాహన సదస్సు

- డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. బి.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన..
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న కంప్యూటర్ నిపుణులు పద్మనాభ రెడ్డి



**కొడంగల్ మున్సిపల్, మే,16(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో విద్యా వారోత్స వాల్లో భాగంగా శనివారం ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన కృత్రిమ మేధపై (ఎ. ఐ ) అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కంప్యూటర్ నిపుణులు పద్మనాభ రెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. గతంలో సెర్చ్ ఇంజిన్స్ మాత్రమే ప్రాముఖ్యత కలిగి ఉండేవని, కాని నేడు ఎ. ఐ బాగా ప్రాచుర్యం లోకి వచ్చిందన్నారు. కృత్రిమ మేధ వల్ల పనుల్లో నాణ్యత పెరుగడమే గాక, మన విలువైన సమయం అదా అవుతుందన్నారు. కృత్రిమ మేధ వినియోగానికి తార్కిక ఆలోచన ఎంతో ముఖ్యమన్నారు .విద్యార్థులకు ముఖ్యంగా నోటుబుక్ కె. ఎల్. ఎమ్, కన్సెన్సస్, జెన్ని, జెమిని, గ్రామర్లీ, డ్యూయోలింగో, చాట్ జీపీటీ వంటి ఎ. ఐ ఉపకారణాలు ఎంతగానో ఉపయోగ పడుతాయన్నారు. సరైన ఆదేశాలు ఇచ్చినప్పుడే ఎ. ఐ. ని సమర్థవంతంగా వినియోగించగలమన్నారు. ఎ. ఐ వినియోగం రోజు రోజుకూ పెరుగుతోందని, ప్రతి ఒక్కరూ ఎ. ఐ పై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రఫియా ఖానం, టి. రాంబాబు, డా. ఆర్. శ్రీనివాస్, డా. సోమ్లా, డా. వి. శ్రీధర్ కుమార్,యం హరిప్రియ, కె. అన్నపూర్ణ, బి. యాదగిరి, జి. యం. రవి ఇతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మక్కల లోడింగ్, రవాణాలో జాప్యం వద్దు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



**జూలపల్లి/ధర్మారంమే 16( సమయం న్యూస్) :** జిల్లాలో ధాన్యం, మక్కల కొనుగోళ్లు వేగవంతంగా నిర్వహించి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.శనివారం జూలపల్లి మండలంలోని వడ్కాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రం, మక్కల కొనుగోలు కేంద్రాలు, ధర్మారం మార్కెట్ యార్డును ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్ కొనుగోలు పరిస్థితులు, నిల్వలను తనిఖీ చేశారు.మక్కల లోడింగ్ వెంటనే చేపట్టి రవాణాలో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. లారీల కొరత ఉంటే స్థానికంగా అందుబాటులో ఉన్న ట్రాక్టర్లను వినియోగించి మక్కల రవాణా వేగవంతం చేయాలని అధికారులకు తెలిపారు.ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించి నిబంధనల ప్రకారం కొనుగోళ్లు నిర్వహించాలని, కేంద్రాల్లో పెండింగ్ నిల్వలు లేకుండా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

# ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధం

--జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్.



**నారాయణపేట, మే,16(సమయం న్యూస్) :** భవిష్యత్తు లో వచ్చే ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాం గం కార్యాచరణ ను సిద్ధం చేసుకున్నట్లు జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక తెలిపారు. పర్యావరణ విపత్తులను ఎలా ఎదుర్కోవాలి? ఎలా సన్నద్ధం కావాలని శనివారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని మక్తల్ నియోజక వర్గం కృష్ణానది లో ప్రవాహం పెరిగి వరదలు, వరద ఉధృతి వచ్చే ప్రమాదం ఉంటుందని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, భవిష్యత్తు లో ప్రమాదాలు సంభవిస్తే ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఆయా ప్రభుత్వ శాఖలు ఏ విధంగా స్పందించాలి?. తీసుకోవాల్సిన ముందస్తు కార్యాచరణ ఏమిటి అన్నదానిపై చర్చించారు. సమావేశంలో రూపొందించుకున్న కార్య చరణతో ఈ నెల 18 న ఉదయం 8 గంటల నుంచి జిల్లాలోని ఎంపిక చేసిన 7 ప్రాంతాల్లో మాక్ డ్రిల్ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మాక్ డ్రిల్ కు ఎలా సిద్ధం కావాలి, డ్రిల్ లో ఏం చేయాలి అనే విషయాలపై కలెక్టర్ అధికారులకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. సోమవారం ఉదయం మాక్ డ్రిల్ చేసేందుకు జిల్లాలోని నదీ పరివాహక ప్రాంతమైన హిందూపూర్, వాసు నగర్ లో 5 ప్రాంతాలతో పాటు మక్తల్ నియోజక వర్గ కేంద్రంలోని ఎల్లమ్మ కుంట కాలనీ, మక్తల్ ఏరియా ఆసుపత్రి ని ఎంపిక చేసినట్లు ఆమె వెల్లడించారు. అంతేకాకుండా జిల్లా కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్, మక్తల్ రిలీఫ్ క్యాంప్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.అంతకు ముందు కలెక్టర్ కృష్ణా నదిలో ఎన్ని క్యూసెక్కుల నీళ్ళు వస్తే వరద ఉధృతి పెరుగుతుందని? వరద సమాచారం వచ్చిన వెంటనే తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. 7లక్షల క్యూసెక్కుల నీళ్ళు ఎగువన ఉన్న నారాయణ పూర్ నుంచి వస్తే మూడు గంటలలోపు కృష్ణా నదికి వరద ఉధృతి పెరుగుతుందని, నదీ పరివాహక ప్రాంతాలు జల మయం అయ్యే ప్రమాదం ఉందని కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఎస్. డీ. సీ రాజేందర్ గౌడ్, ఎఫ్ ఆర్ వో సురేష్ రెడ్డి, ఏవో శ్రీధర్, ఆర్డీవో మేఘా గాంధీ, సీపీఓ ఖాఫా వాహన్, పశు సంవర్ధక శాఖ అధికారి ఈశ్వర్ రెడ్డి, సీఐ శివ శంకర్, కలెక్టరేట్ అధికారిని కల్యాణి, సంబంధిత అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా డెయిరీ అమలుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలి

- కలెక్టర్ దివాకర టిఎస్



**ఖమ్మం, మే 16 ( సమయం న్యూస్,) :** జిల్లాలో ఇందిరా మహిళా డెయిరీ కార్యక్రమాన్ని సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో అమలు చేసి, నిధులు వృథా కాకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను సమాంతరంగా చేపట్టాలని సూచించారు.ఉపాధి హామీ పథకం ద్వారా అవసరమైన పనులకు వెంటనే పరిపాలనా అనుమతులు పొందాలని, లబ్ధిదారుల పశువుల షెడ్ల నిర్మాణాలను నిర్ణీత గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు సోలార్ వ్యవస్థ ఏర్పాటుపై కూడా అధికారులు దృష్టి సారించాలని సూచించారు.ఇందిరా మహిళా డెయిరీ కార్యక్రమం వచ్చే రెండేళ్లలో స్వయం సమృద్ధి సాధించేలా పాల సేకరణ, మార్కెటింగ్, ఆర్థిక నిర్వహణపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి వచ్చే మంగళవారం లోగా సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

# మానవ అక్రమ రవాణాను అడ్డుకోవడం మనందరి బాధ్యత

- దోపిడీ రహిత సమాజాన్ని నిర్మించుకోవాలి
- మానవ అక్రమ రవాణా బాధితుల పట్ల సమాజం చూపే వివక్ష మారాలి
- సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్



**నారాయణపేట, మే,16(సమయం న్యూస్) :** నారాయణపేటలోని రెవిన్యూ డివిషనల్ ఆఫీస్ ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ప్రధాన గౌరవ తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ అధ్యక్షతన మానవ అక్రమ రవాణా'మరియు 'వాణిజ్య లైంగిక దోపిడీ' న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. దానిలో భాగంగా సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ మాట్లాడుతూ అమాయక మహిళలు మరియు పిల్లలు ఈ రక్కసి బారిన పడుతున్నారు. మెరుగైన భవిష్యత్తు, ఉద్యోగం లేదా మంచి జీవితాన్ని ఇస్తామంటూ మాయమాటలు చెప్పి, వారిని బలవంతంగా చీకటి ప్రపంచంలోకి లాగుతున్నారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో దీనిపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కలిగి ఉండాలి. రక్షించబడిన బాధితులకు వైద్య, మానసిక సాయం, మరియు ఉపాధి అవకాశాలు కల్పించి వారిని సమాజంలో భాగస్వామ్యం చేయాలి. మానవ అక్రమ రవాణా ఇది ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేరపూరిత వ్యాపారం, ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందిని, ప్రధానంగా మహిళలు మరియు పిల్లలను ప్రభావితం చేస్తుంది. అక్రమ రవాణాదారులు బాధితులను నియంత్రించడానికి తరచుగా హింస, బెదిరింపులు, రుణ బానిసత్వం మరియు గుర్తింపు పత్రాలను స్వాధీనం చేసుకోవడం వంటి పద్ధతులను ఉపయోగిస్తారు. ప్రాణాలతో బయటపడిన వారిని ఒక తీవ్రమైన నేరానికి బాధితులుగా చూడాలి, అంతేగాని నేరస్థులుగా కాదు. చట్ట అమలు మరియు సామాజిక స్పందనలు పునః బాధితులుగా మారడం, కళంకం మరియు శిక్షలను నివారించాలి. నిజమైన న్యాయానికి సమగ్ర పునరావాసం అవసరం. ఇందులో సురక్షితమైన గృహవసతి, వైద్య మరియు మానసిక ఆరోగ్య సంరక్షణ, న్యాయ సహాయం, మరియు పునః అక్రమ రవాణాను నివారించడానికి ఆచరణీయమైన జీవనోపాధి ప్రత్యామ్నాయాలు ఉంటాయి. యుక్తవయస్సు రాకముందే పెళ్లి చేయడం సరైన విద్య, నైపుణ్యాలు లేకపోవడం వల్ల భవిష్యత్తులో ఉద్యోగావకాశాలు కోల్పోయి, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటారు. బాల్య వివాహాల కి పూర్తిగా అడ్డుకట్ట వేయాలి. బాల్యకార్మిక వ్యవస్థ ని రూపుమాపాలి. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సంస్థ ద్వారా పేదవారు 15100 నెంబర్ కి కాల్ చేసి ఉచిత న్యాయాన్ని పొందవచ్చు అని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే.లక్ష్మి గౌడ్ తెలిపారు.ఇట్టి కార్యక్రమానికి ఎల్ రమేష్ (ఆర్.డి.ఓ), శంకర్ నాయక్ (ప్రాజెక్ట్ డైరెక్టర్), తిరుపతయ్య (డి.సి.పీ.యూ), క్రాంతి రేఖ ( సఖి సెంటర్ కో-ఆర్డినేటర్), నర్సిములు (డిస్ట్రిక్ట్ కో - ఆర్డినేటర్) ,డాక్టర్.జాం రాజ్ (ఎం.ఓ) ( యూపీహెచ్), ఏ. వెంకటేశ్వర్లు ( ఎస్.ఐ), అశోక్ కుమార్ (ఐ.వీ.ఎ.ా), విజయ కుమార్, నందు నామాజీ ( సీనియర్ అడ్వకేట్), క్రాంతి (పనెల్ అడ్వకేట్), పీ.ఎల్.విస్, ఆశ కార్యకర్తలు మరియు మహిళా సంఘాలు పాల్గొన్నారు.

# లైసెన్స్డ్ సర్వేయర్లకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి

- కలెక్టర్ దివాకార్ టి ఎస్



**ఖమ్మం, మే 16( సమయం న్యూస్,) :** భూ భారతీ పోర్టల్ మ్యాపింగ్, రీ సర్వే, రిజిస్ట్రేషన్ ప్రక్రియల ద్వారా లైసెన్స్డ్ సర్వేయర్లకు భవిష్యత్తులో విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో లైసెన్స్డ్ సర్వేయర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం తిరుమలాయపాలెం మండలంలో రీ సర్వే కొనసాగుతోందని, అవసరాన్ని బట్టి సర్వేయర్లను వినియోగిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో అన్ని గ్రామాల్లో మ్యాపింగ్ విధానం అమలుతో సర్వేయర్లకు ఆదాయం పెరుగుతుందని తెలిపారు. సర్వే ఫీజుల పెంపు అంశం ప్రభుత్వ పరిధిలోనిదని పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన

**జనగామ మే16( సమయం న్యూస్) :** జనగామ జిల్లా కేంద్రంలోని జనగామ-- హుస్నాబాద్ ప్రధాన రహదారిపై వడ్లకొండ వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. ధాన్యం కొనుగోలు ఆలస్యం కావడం, లోడింగ్‌కు లారీలు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.వర్షాలకు తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని రోడ్డుపై ఉంచి నిరసన తెలిపారు. తమకు న్యాయం చేయాలని సీఐ కాళ్లు మొక్కుతూ రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. ధాన్యం వెంటనే కొనుగోలు చేసి, లారీలను పంపించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని రైతులు

# జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియ 74 శాతం పూర్తయింది.

జిల్లా అదనపు కలెక్టర్ కె. వెంకట చారి

**వికారాబాద్, మే,16(సమయం న్యూస్) :** జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియ 74 శాతం పూర్తయిందని జిల్లా అదనపు కలెక్టర్ కె.వెంకటా చారి తెలిపారు.శనివారం హైదరాబాదు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ షెడ్యూల్, మ్యాపింగ్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులతో సమీక్ష సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ...రాష్టంలో త్వరలో చేపట్టే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జూన్ 15 నుండి నిర్వహించే షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు తీసుకోవాలన్నారు.ఈ





సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ వెంకటాచారి మాట్లాడు

తూ...ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం చర్యలు చేపడుతామని తెలిపారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు.జిల్లాలో ఖాళీగా ఉన్న బూత్ స్థాయి అధికారుల నియామకానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి బూత్ స్థాయి ఏజెంట్ల నియామకానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఆయన వివరించారు. కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్డీఓలు వాసు చంద్ర, అనిత, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నెమత్ హాలీ, తహసిల్దార్ లు లక్ష్మీనారాయణ, వెంకటేశ్వరి, పాల్గొన్నారు.

## డెంగ్యూ దినోత్సవమును పురస్కరించుకుని....

- ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన గ్రామ సర్పంచ్ సౌభాగ్యలక్ష్మి
- జిల్లా కిటక జనిత వ్యాధుల నిర్ములాన అధికారి డాక్టర్. రవీంద్ర యాదవ్...
- డాక్టర్. బుష్రా ఫాతిమా ఆదేశానుసారం



**కొడంగల్ మండలం, మే,16(సమయం న్యూస్) :** కొడంగల్ మండలం లోని అంగడి రాయచూరు గ్రామములో శనివారం జాతీయ డెంగ్యూ దినోత్సవము ను పురాస్కరించుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంగడి రాయచూరు యందు జిల్లా కీటక జనిత వ్యాధుల నిర్మూలన అధికారి డాక్టర్. రవీంద్ర యాదవ్, మరియు మెడికల్ ఆఫీసర్ డాక్టర్. బుష్రా ఫాతిమా ఆదేశానుసారం పకిరప్ప సబ్ యూనిట్ అధికారి అధ్యక్షతన జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా గ్రామ సర్పంచ్ సౌభాగ్యలక్ష్మి ర్యాలీనీ జెండా ఊపి ప్రారంభించడం జరిగింది అనంతరం పకిరప్ప ఎస్.యూ.ఓ. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రామ ప్రజలకు మరియు వైద్య సిబ్బంది తో డెంగ్యూ అవగాహన మీటింగ్ నిర్వహించడం జరిగింది దోమల పుట్టుక స్థావరాలను గుర్తించి ఎప్పటికపుడు దోమలు పుట్టకుండా కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు మరియు ప్రతి ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని పేర్కొన్నారు అలాగే ఫ్రీతీఅఝఎ నతీఎ ఝఎ జరపాలని చెప్పడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో డాక్టర్. మహేందర్ రాజ్,(ఎం.హెచ్.ఎల్.పి) మణిమాల, (పి హెచ్ ఎన్) సుశీల హెల్త్ సూపర్వైజర్ మధుసూదన్ రెడ్డి హెల్త్ అసిస్టెంట్, మహేష్ ఎల్.టి నాగప్ప, గ్రామస్థుడు వైద్య సిబ్బంది మరియు ఆశ కార్యకర్తలు. పాల్గొనడం జరిగింది.


## "ప్రజా పాలన-ప్రగతి -ప్రణాళిక" లో,భాగంగా "కళా వైభవం" కార్యక్రమం



**నారాయణపేట, మే,16(సమయం న్యూస్) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "99 రోజుల కార్యాచరణ ప్రణాళిక -- ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" లో భాగంగా శనివారం నిర్వహించిన 6వ రోజు "కళా వైభవం" కార్యక్రమం బాలకేంద్రం, నారాయణపేటలో ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని విద్యార్థులు చిత్రలేఖనం, హస్తకళలు, సాంస్కృతిక ప్రదర్శనలు మరియు వివిధ కళారూపాలలో అత్యంత ప్రతిభ కనబరిచి అందరినీ ఆకట్టుకున్నారు. పాల్గొన్న ప్రతి విద్యార్థిని జిల్లా విద్యాశాఖ అభినందించింది. వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు మరియు వె-ఎమెంటోలు అందజేసి ఘనంగా సత్కరించారు. విద్యార్థులలో సృజనాత్మకత, కళాపట్ల ఆసక్తి మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే దిశగా నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతం కావడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ గోవిందరాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలోడీఈఓ గోవిందరాజు,ఏఎంఓ విద్యాసాగర్,సీఎంఓ రాజేంద్రకుమార్,ఎస్ఓ నాగార్జున రెడ్డి,బాలకేంద్రం సిబ్బంది మహిపాల్, సంగ నర్సిములు,జ్ఞానామృత జుఎవ శ్రీకాంత్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు."కళ, సంస్కృతి, సృజనాత్మకతకు సంబరం"

## పిల్లల విద్య హక్కు... చట్టబద్ధ హామీ

- రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్--2009 అమలు చేయాలి.




**రాయపోల్, మే 16:** భారతదేశంలో ప్రతి చిన్నారి విద్య హక్కును రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన Right to Education Act (ఆర్‌టీఈ చట్టం--2009) కీలక ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ చట్టాన్ని అమలుచేయాలని పలువురు బలంగా కోరుతున్నారు. చట్టం ప్రకారం 6 నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సు గల ప్రతి బాలబాలికకు ఉచిత, తప్పనిసరి విద్యను అందించడం ప్రభుత్వ బాధ్యతగా నిర్ణయించబడింది. ఈ చట్టం అమలులో భాగంగా ప్రైవేట్ పాఠశాలల్లో బలహీన వర్గాల విద్యార్థులకు 25 శాతం సీట్లను కేటాయించడం తప్పనిసరి చేశారు. అడ్మిషన్‌ల కోసం డొనేషన్‌లు, క్యాపిటేషన్ ఫీజులు వసూలు చేయడం నిషేధించబడింది. చిన్నారుల ప్రవేశానికి ఎలాంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. పిల్లల నివాసానికి సమీపంలోనే పాఠశాలలు ఏర్పాటు చేయాలని, పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, తగిన తరగతి గదులు వంటి కనీస సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలని చట్టం పేర్కొంటోంది. అలాగే అర్హత కలిగిన ఉపాధ్యాయులను నియమించి, విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తిని కచ్చితంగా పాటించాల్సిన బాధ్యతను ప్రభుత్వంపై ఉంచింది. మొత్తంగా, పిల్లలు చదువుకు దూరం కాకుండా చేయడం, బాల కార్మికత్వాన్ని అరికట్టడం, ప్రతి చిన్నారికి సమాన విద్యావకాశాలు కల్పించడం ఈ చట్టం ప్రధాన లక్ష్యంగా నిలుస్తోంది.

## గ్రామ భద్రత అందరి బాధ్యత: కోటగిరి ఎస్సై సునీల్

- 'మన ఊరు - మన భద్రత'పై పోలీసుల అవగాహన సదస్స
- నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు కీలకం



**కోటగిరి,మే 16 (సమయం న్యూస్ ) :-** కోటగిరి మండల కేంద్రంలో లి"మన ఊరు - మన భద్రత - మన బాధ్యత"లి కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ కూలీలు, గ్రామస్తులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై సునీల్ మాట్లాడుతూ, గ్రామంలో నేరాల నియంత్రణకు మరియు ప్రజల రక్షణకు సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో కీలకమని వివరించారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి గ్రామ భద్రతలో భాగస్వాములు కావాలని కోరారు. అదేవిధంగా, రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. సురక్షిత ప్రయాణం కోసం డ్రైవింగ్ నియమాలను అనుసరించాలని, అజాగ్రత్తగా వాహనాలు నడపరాదని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వీటితో పాటు సమాజానికి ముప్పుగా మారిన మాదకద్రవ్యాల (డ్రగ్స్) దుష్పరిణామాల గురించి, మహిళల రక్షణ కోసం పోలీసులు అందిస్తున్న భద్రతా చర్యల గురించి ప్రజలకు ప్రత్యేకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, ఉపాధి హామీ కూలీలు, ,గ్రామ ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అభివృద్ధి నిర్మాణ పనులలో వేగం పెంచాలి

- జూన్ 2 న ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి.
- జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్.




**నారాయణపేట, మే,16(సమయం న్యూస్) :** నారాయణ పేట జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల నిర్మాణాలను వేగంగా చేయించి జూన్ 2 ( రాష్ట్ర అవతరణ దినం) వ రోజున ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాంక ఆదేశించారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల లో వివిధ నిధులతో కొనసాగుతున్న పలు నిర్మాణ ( ఇంజనీరింగ్ వర్క్స్) పనుల పై శనివారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో ఎస్. ఈ లు, ఈ ఈ లు, డీ ఈ లు, ఏ ఈ లతో కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష జరిపారు. ముందుగా జిల్లా కేంద్రానికి సంబంధించి మెడికల్ కళాశాల, ఎంసీహెచ్, నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులు ఎంత వరకు వచ్చాయి అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అయితే మెడికల్ కళాశాల వద్ద ఒక్క బోరు కూడా పడలేదని, మరి నిర్మాణ పనులకు క్యూరింగ్ ఎలా చేస్తున్నారని కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. మెడికల్ కళాశాల సమీపంలో ఒక రైతు పొలానికి చెందిన ప్రైవేటు బోరు నుంచి నీటిని క్యూరింగ్ కు వాడుకుంటున్నామని అధికారులు కలెక్టర్ కు జవాబు ఇచ్చారు. ప్రభుత్వ భవన నిర్మాణాలు ఎక్కడ జరిగినా ముఖ్యంగా మెడికల్ కాలేజీ వద్ద తప్పకుండా వాన నీటి సంరక్షణ ( ఇంకుడు గుంతలు) చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి లో జనరేటర్ ఎంతో అవసరమని కానీ ఎందుకు వినియోగంలో లేదని ప్రశ్నించారు. జనరేటర్ ను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. జిల్లాలో ఏ ఏ మండలాల్లో కస్తూర్బా గాంధీ పాఠశాలలో మర మ్మతు పనులు జరుగుతున్నాయని ఆరా తీశారు. వాటితో పాటు పీఎం శ్రీ స్కూల్స్ లలో సైన్స్ ల్యాబ్స్ నిర్మాణాలను పాఠశాలల పునః ప్రారంభం నాటికి పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. 2023-24, 2024-25 సంవత్సరం నాటి పనులన్నింటినీ పూర్తి చేయాలన్నారు. మక్తల్ లో వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, అకాడమిక్ బ్లాక్ నిర్మాణం పూర్తయిందని అధికారులు తెలపగా, పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. మక్తల్ లో జూనియర్ కళాశాల అదనపు గదుల నిర్మాణం, అలాగే మద్దూరు ఎస్సీ బాలుర వసతి గృహా మరమ్మతు పనుల గురించి కలెక్టర్ ప్రస్తావించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో ఏమైనా మరమ్మతు పనులు ఉంటే వేసవి సెలవులు ముగిసే లోపు పూర్తి చేయాలని ఆమె స్పష్టం చేశారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రం పక్కన సమీకృత చేనేత భవన నిర్మాణం పూ-ర్తయిందని అధికారులు తెలపగా జూన్ 2 న ప్రారంభానికి సిద్ధంగా ఉందా అని అడిగి, అంతలోపు మిగతా పనులేమైనా ఉంటే పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలన్నారు. ఇక జిల్లా కేంద్రంలోని మూడు ఓవర్ హెడ్ 10 లక్షల లీటర్ల ట్యాంకుల నిర్మాణాలు ఆగస్టు వరకు పూర్తి చేయాలని ఆమె సూచించారు. మక్తల్ పట్టణంలో మిషన్ భగీరథ నీటి సరఫరా తో పాటు సంగం బండ రిజర్వాయర్ నుంచి తాగునీటి సరఫరా కు ప్రత్యామ్నయ పథకాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు మిషన్ భగీరథ ఈ ఈ లు శ్రీనివాస్ రావ్, రంగారావు తెలిపారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ.. మన్యం కొండ నుంచి జిల్లాకు మిషన్ భగీరథ పథకం ద్వారా రోజుకు ఎన్ని లీటర్ల నీటి సరఫరా జరుగుతుందో తనకు జాబితా ఇవ్వాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మిషన్ భగీరథ పథకం ద్వారా మండలాల వారీగా ఏ ఏ పనులు జరుగుతున్నాయో ఏ ఈ లను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత సమయంలో ఆయా పనులను పూర్తి చేయాలన్నారు. వేసవి కాలం తర్వాత పనులు చేస్తే లాభం లేదన్నారు. జిల్లాలో ఆర్ అండ్ బీ పరిధిలో జరుగుతున్న రోడ్ల పనులు, కలెక్టరేట్ నూతన భవన నిర్మాణ పనుల గురించి ఆ శాఖ అధికారులతో కలెక్టర్ చర్చించారు. పనులు మరింత వేగవంతం చేయాలన్నారు. జిల్లా మహిళా సమాఖ్య భవనాన్ని కూడా జూన్ 2 లోపు ప్రారంభానికి సిద్ధం చేయాలని తేల్చి చెప్పారు. గుండుమాల్, కొత్తపల్లి మండలాల సమీకృత భవన సముదాయాల నిర్మాణ పనులు, కాడ నిధులతో చేపట్టిన పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంజనీరింగ్ శాఖల అధికారులతో ఇది తనకు తొలి సమావేశం అని, వచ్చే సమావేశానికి ఏ ఈ లు ఎన్ని పనులు పూర్తి చేశారో? ఎన్ని పర్యటనలు చేశారో నివేదికలతో రావాలని, ఇతర జిల్లాలకు ఇన్ ఛార్జ్ గా ఉన్నామని కారణాలు చెప్పవద్దని, ఈ జిల్లాలో ఖచ్చితంగా గురు,శుక్ర, శని వారాల్లో అందుబాటు లో ఉండాలని ఆదేశించారు. అభివృద్ధి నిర్మాణ పనులు, శంకు స్థాపనలు, ప్రారంభోత్సవాలలో విధిగా ప్రోటోకాల్ పాటించాలని కలెక్టర్ సూచించారు. టీజీ ఎం ఐ డీ సి ఈ ఈ వేణు గోపాల్, పీ ఆర్ ఈ ఈ అశోక్, ఆర్ అండ్ బీ ఎస్. ఈ. వెంకట రమణ, ఆయా శాఖల డీ ఈ లు, ఏ ఈ లు పాల్గొన్నారు.

# ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా 6వ రోజు

- వికారాబాద్ డైట్ కళాశాలలోని సమావేశ మందిరంలో జరిగిన"
- కళలు,హస్తకళలుడ సాంస్కృతిక దినోత్సవం
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా అడిషనల్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్



**వికారాబాద్, మే,16(సమయం న్యూస్) :** కళలు, హస్తకళలు ఁ సాంస్కృతిక దినోత్సవం కార్యక్రమం కార్యక్రమానికి వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు తయారు చేసిన హస్తకళా ప్రదర్శనను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. విద్యార్థుల ప్రదర్శనను ఆసక్తిగా తిలకిస్తూ వారు తయారు చేసిన విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి లోను నిగూఢమైన ప్రతిభ దాగి ఉంటుందని,ఆ ప్రతిభ ను వెలికితీయడానికి ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు వికారాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారిణి రేణుకాదేవి అభినందిస్తూ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, వికారాబాద్ మండల విద్యాధికారి ఎన్.బాబుసింగ్ ౄా౽ఖ ౿ా వికారాబాద్ జిల్లా అధ్యక్షులు/ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కడియాల చంద్రశేఖర్ ,గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు.ఎ.యాదయ్య,ఙ.జు.ా కార్యాలయ సిబ్బంది, వికారాబాద్ బాల భవన్ -ఉపాధ్యాయులు,వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు ,విద్యార్థులు పాల్గొన్నారు

## జిల్లా స్థాయి ప్రతిభా పురస్కారం అందుకున్న మద్దూర్ పాఠశాల విద్యార్థులు

### పురస్కారం మరియు ప్రశంసా పత్రం అందజేసిన జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్.



**నారాయణపేట, మే,16(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన "ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక" విద్యా విజయోత్సవాలు కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మద్దూర్‌కు చెందిన విద్యార్థిని కుమారి జాగేరి పూర్విక సాధించిన ప్రతిభకు గాను నగదు పురస్కారం మరియు ప్రశంసా పత్రం అందజేయడం జరిగింది. 2025 —26 కు గాను పదో తరగతి పరీక్షల్లో 887 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందినందుకు తెలంగాణ ప్రభుత్వం తరఫున రూ. 10,000 నగదు పురస్కారం మరియు ప్రశంసా పత్రాన్ని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక జిల్లా విద్యా అధికారి గోవిందరాజులు అందజేశారు. విద్యార్థిని కార్యక్రమానికి హాజరు కాలేకపోవడంతో ఆమె తరఫున పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సవిత పురస్కారాన్ని స్వీకరించారు. అదేవిధంగా జిల్లాస్థాయిలో 571 మార్కులతో ఏడవ స్థానం సాధించిన సందర్భంగా కుమారి జాగేరి శుభప్రియ ప్రశంసా పత్రాన్ని కూడా విద్యార్థిని తరఫున ప్రధానోపాధ్యాయురాలు సవిత మరియు ఉపాధ్యాయుడు యశ్వంత్ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా విద్యాధికారి సమక్షంలో స్వీకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మరియు మద్దూరు పట్టణ ప్రముఖులు విద్యార్థినుల ప్రతిభను అభినందించారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలి

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



**నారాయణపేట, మే,16(సమయం న్యూస్) :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం అమలు చేయుటకు కార్యాచరణ విడుదల చేసిందని, ఇందులో భాగంగా జూన్ 15 వ తేదీ నుంచి 24వ తేదీ వరకు సంబంధిత సిబ్బందికి, అధికారులకు శిక్షణ, ఎన్యూమరేషన్ ఫారం ప్రింటింగ్ తదితర ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, జూన్ 25 వ తేదీ నుంచి జూలై 24వ తేదీ వరకు బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయడం, ఫారం పూర్తి చేసిన తర్వాత తిరిగి తీసుకోవడం జరుగుతుందని, జూలై 24వ తేదీ లోగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేయడం జరుగుతుందని, జూలై 31వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించడం జరుగుతుందని, జూలై 31వ తేదీ నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ, జూలై 31వ తేదీ నుంచి సెప్టెంబర్ 28వ తేదీ వరకు అభ్యంతరాల పరిష్కరణ, అక్టోబర్ 1వ తేదీన తుది ఓటరు జాబితా ప్రచురణ జరుగుతుందని తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం మొదలయ్యే నాటికి ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని, ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న ఆబ్సెంట్, షిఫ్ట్, డెత్ సంబంధిత ఫారం 6, 7, 8 దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో 1 వేయి 200 మించి ఓటర్లు ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల సంబంధించిన బూత్ స్థాయి అధికారుల వివరాలు ప్రజలందరికీ తెలిసేలా ప్రచారం చేయాలని, బూత్ స్థాయి అధికారులకు వృద్ధ, అనారోగ్య, దివ్యాంగ ఓటర్ల నమోదు విషయంపై ప్రత్యేక శిక్షణ అందించాలని తెలిపారు. ఒకే కుటుంబం సంబంధించిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మీడియా, సోషల్ మీడియా ద్వారా వచ్చే ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించాలని, తప్పుడు ప్రచారాన్ని నిరోధించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేకసమగ్ర సవరణ కార్యక్రమం పురస్కరించుకొని జిల్లాలో మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సిబ్బందికి అధికారులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్. డి.ఓ.రమేష్,తహసీల్దారులు, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కోటగిరి గ్రామంలో దివ్యాంగుల ఇళ్లను సందర్శించిన ఎస్సై సునీల్, సర్పంచ్ బర్లా మధుకర్



**కోటగిరి,మే15 (సమయం న్యూస్) :-** కోటగిరి గ్రామంలో ఎస్సై సునీల్, స్థానిక సర్పంచ్ బర్లా మధుకర్ ప్రత్యేక అవసరాలు గల వ్యక్తుల (దివ్యాంగుల) గృహాలను స్వయంగా సందర్శించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారి యోగక్షేమాలను మరియు ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగుల కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆలకించిన అనంతరం, వారికి చట్ట పరంగా, ప్రభుత్వ పరంగా అందాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. సమాజంలో దివ్యాంగులకు అండగా నిలవడం అందరి బాధ్యత అని, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఎస్సై సునీల్ మరియు సర్పంచ్ బర్లా మధుకర్ ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

## తాండూర్ మాత, శిశు ఆసుపత్రి ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్.



**తాండూర్ మున్సిపల్, మే,16(సమయం న్యూస్) :** అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఉమా శంకర్ ప్రసాద్ తాండూర్ మాతా శిశు ఆసుపత్రి (ఎంసీహెచ్)ను సందర్శించి ఇటీవల జరిగిన ఘటనపై ఆరా తీశారు. అలాగే ఆసుపత్రి భవన పరిస్థితి, మరుగుదొడ్లు మరియు పారిశుధ్య సౌకర్యాలను పరిశీలించారు. నియమాలు మరియు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం జిల్లా అదనపు కలెక్టర్ మాతా శిశు ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, పారిశుధ్యం, సిబ్బంది హాజరు రిజిస్టర్ లు,మందుల నిల్వలు మరియు రోగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. రోగులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అలాగే ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా డాక్టర్ లు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలనతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ తనిఖీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శరత్ ,ఆర్ ఎం ఓ అనిల్, సునీత,మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి,వైద్యులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలి

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



**సంగారెడ్డి సమయం న్యూస్ మే 16:-** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం అమలుకు కార్యాచరణ ప్రణాళిక విడుదల చేసిందన్నారు. ఇందులో భాగంగా జూన్ 15 నుంచి 24వ తేదీ వరకు సంబంధిత సిబ్బంది, అధికారులకు శిక్షణ ఇవ్వడంతో పాటు ఎన్యూమరేషన్ ఫారాల ముద్రణ తదితర ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి, పూర్తి చేసిన ఫారాలను తిరిగి స్వీకరిస్తారని చెప్పారు. జూలై 24 నాటికి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. అనంతరం జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు స్వీకరించి, సెప్టెంబర్ 28 లోగా వాటిని పరిష్కరించి, అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు వివరించారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రారంభమయ్యేలోపు ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో 1200 మందికి మించి ఓటర్లు లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బూత్ స్థాయి అధికారుల వివరాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు, దివ్యాంగ ఓటర్ల నమోదుపై బూత్ స్థాయి అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మీడియా, సోషల్ మీడియాలో వచ్చే ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించి తప్పుడు ప్రచారాన్ని నిరోధించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి హాజరైన అడిషనల్ కలెక్టర్ సంగీత మాట్లాడుతూ, జిల్లాలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేస్తున్నామని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించనున్నట్లు, ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సిబ్బంది, అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అడిషనల్ కలెక్టర్ పాండు, ఆర్డీఓ రాజేందర్, తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పెరిగిన ధరలపై సిపిఐ ఆగ్రహం.. బస్టాండ్ వద్ద ఆటోను తాడుతో లాగి నిరసన!



**కోటగిరి, మే 16 (సమయం న్యూస్) :** కోటగిరి మండల కేంద్రంలో ఇంధన, గ్యాస్ ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా సిపిఐ శ్రేణులు వినూత్న రీతిలో ధర్నా నిర్వహించాయి. స్థానిక బస్టాండ్ ఆవరణలో ఆటోను తాడుతో లాగుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై నాయకులు, కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిరసనలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, మండల కార్యదర్శి .విటల్ గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ధరలు పెంచబోమని చెప్పిన ప్రధాని మోడీ, ఆ తర్వాత క్రూడ్ ఆయిల్ ధరల సాకుతో లీటరుకు రూ.3 వరకు పెంచడం సామాన్యులను వంచించడమేనన్నారు. నాడు రూ.300 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర నేడు బిజెపి హయాంలో వెయ్యి రూపాయలు దాటిందని, పైగా మార్కెట్లో తీవ్ర కొరత కూడా ఏర్పడిందని విమర్శించారు. కమర్షియల్ గ్యాస్ దొరకని కారణంగా చిన్న హోటళ్ళు, చిరు వ్యాపారాలు మూతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద కార్పొరేట్ సంస్థలకు సబ్సిడీలు ఇస్తూ, పేద ప్రజలపై పన్నుల భారం మోపడం దుర్మార్గమన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన జీఎస్టీ వల్లే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఆకాశాన్నంటాయని.. తక్షణమే వీటిపై జీఎస్టీని తొలగిస్తేనే ధరలు అదుపులోకి వస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు నల్ల.గంగాధర్, నీలి.శంకర్, కే రాజు, రాములు, హనుమాన్లు, అన్సార్ మరియు స్థానిక ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసింది

## తలసాని శ్రీనివాస యాదవ్



**హైదరాబాద్, మే 16 (సమయం న్యూస్):** తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సనత్‌నగర్ నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టి రామారావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని, మహిళలకు రూ.2500, రైతు భరోసా సహా అనేక హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పాలనలో అద్భుతాలు జరుగుతాయని ప్రజలు భావించారని, కానీ ఇప్పుడు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. కేటీఆర్ తెలంగాణకు ప్రపంచ స్థాయిలో పెట్టుబడులు తీసుకొచ్చారని, ఆయనపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదన్నారు. కేసీఆర్‌పై విమర్శలు చేస్తే తన కుమారుడిగా కేటీఆర్‌కు బాధ కలగడం సహజమని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో డిజిటల్ మెంబర్‌షిప్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని, కుటుంబ సభ్యుల వివరాలు కూడా నమోదు చేసుకునే విధంగా వ్యవస్థ ఉంటుందని తెలిపారు. సభ్యత్వ నమోదు పూర్తయ్యాక పార్టీ కమిటీలు ఏర్పాటు చేస్తామని, నాయకులకు ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. ఇంకా రెండేళ్లలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని తలసాని శ్రీనివాస్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు.

## జయశంకర్ వర్సిటీలో మే 23 నుంచి విత్తన వారోత్సవాలు

**హైదరాబాద్, మే 16( సమయం న్యూస్). :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మే 23 నుంచి 30 వరకు విత్తన వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఉపకులపతి ప్రొ. అల్దాస్ జానయ్య తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 27 అమ్మక కేంద్రాల్లో 1,231 టన్నుల నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు.

మే 18 నుంచి 22 వరకు రైతులు అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. ప్రతి రైతుకు రెండు విత్తన కిట్లు మాత్రమే విక్రయిస్తామని తెలిపారు. నకిలీ విత్తనాల నివారణకు నాణ్యమైన మూల విత్తనాలను అందిస్తున్నామని పేర్కొన్నారు.



# ఆర్సీబీ మ్యాచ్‌లలో షెహనాజ్ గిల్ సందడి

## దేవదత్ పడిక్కల్‌తో డేటింగ్ రూమర్లు?

**బెంగళూరు, మే 16 :** బాలీవుడ్ నటి షెహనాజ్ గిల్ ప్రస్తుతం ఐపీఎల్ మ్యాచ్‌లలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మ్యాచ్‌లకు హాజరవుతూ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. ఆర్సీబీ ఆడే ప్రతి చోట ఆమె కనిపించడం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఇటీవల ఆమె ఆర్సీబీ ఆటగాడు దేవదత్ పడిక్కల్‌తో డేటింగ్ చేస్తున్నారనే రూమర్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు ఇద్దరూ ఎటువంటి అధికారిక స్పందన ఇవ్వలేదు. గతంలో ఒక సందర్భంలో షెహనాజ్ మాట్లాడుతూ "ఐ లవ్ విరాట్, ఐ లవ్ దేవదత్" అని చెప్పడంతో ఈ చర్చ మరింత పెరిగింది. ఆర్సీబీ మ్యాచ్‌ల సమయంలో స్టాండ్స్‌లో కనిపిస్తూ అభిమానులను ఉత్సాహపరుస్తూ, జట్టు జెర్సీ ధరించి తన మద్దతును తెలియజేస్తూ షెహనాజ్ గిల్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. ఆమె ఇటీవల సోషల్ మీడియాలో "దిల్ ఆర్సీబీ మే హై" అంటూ చేసిన పోస్ట్ కూడా వైరల్ అయింది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె పంచుకున్న వీడియోలో "మజా ఆ గయా" అంటూ బెంగళూరుకు చీర్స్ చెప్పడం అభిమానుల దృష్టిని ఆకర్షించింది. దీంతో ఆమె ఆర్సీబీ జట్టుకు ఎంతగా మద్దతు ఇస్తున్నారో మరోసారి స్పష్టమైంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుపై ఆమె చూపుతున్న ఆసక్తి, నిరంతర హాజరు నేపథ్యంలో రూమర్లు చక్కర్లు కొడుతున్నప్పటికీ, అధికారికంగా ఎటువంటి నిర్ధారణ మాత్రం రాలేదు.

# హార్దిక్ రెండో పెళ్లి ప్రచారం




**ముంబై, మే 16:** హార్దిక్ పాండ్యా రెండో పెళ్లి చేసుకోబోతున్నాడంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. ఆయన తన స్నేహితురాలు మహీకా శర్మను వివాహం చేసుకోబోతున్నారనే వార్తలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అయితే ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ముంబై ఇండియన్స్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న హార్దిక్ పాండ్యా వెన్నునొప్పి కారణంగా గత మూడు మ్యాచ్‌లకు దూరమయ్యారు. ఆయన గైర్హాజరీలో సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా జట్టు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇదే సమయంలో ఆయన వ్యక్తిగత జీవితంపై వస్తున్న వార్తలు మరింత చర్చకు దారితీశాయి. మహీకా శర్మ గతంలో ముంబై ఇండియన్స్ జట్టు బస్సులో కనిపించడం, అలాగే అంతర్జాతీయ టీ20 వేడుకల్లో పాల్గొనడం వంటి అంశాలు ఈ వదంతులకు కారణమయ్యాయి. దీంతో ఇద్దరి మధ్య సంబంధంపై సోషల్ మీడియాలో రకరకాల ప్రచారం సాగుతోంది. అయితే ప్రస్తుతం ఐపీఎల్ కీలక దశలో ఉండగా, జట్టు క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో హార్దిక్ పెళ్లి గురించి ఆలోచించే అవకాశం లేదని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు. సీజన్ ముగిసిన తర్వాత మాత్రమే ఆయన వ్యక్తిగత నిర్ణయాలపై స్పష్టత వచ్చే అవకాశముందని చెబుతున్నారు. ఇప్పటికే గాయం కారణంగా విమర్శలు ఎదుర్కొంటున్న హార్దిక్ పాండ్యా, ఇప్పుడు ఈ పెళ్లి ప్రచారంతో మరోసారి సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారారు.

# కేకేఆర్ గర్జన!

## గుజరాత్ టైటాన్స్‌పై 29 పరుగుల తేడాతో ఘన విజయం

## చెలరేగిన ఫిన్ అలెన్.. వృథా అయిన శుభ్ మన్ గిల్ పోరాటం



ఐపీఎల్ టోర్నీలో కోల్ కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) అద్భుత విజయం సాధించింది. సొంత గడ్డపై శనివారం జరిగిన ఉత్కంఠ పోరులో పటిష్టమైన గుజరాత్ టైటాన్స్‌పై 29 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 247 పరుగుల భారీ స్కోరు సాధించగా.. లక్ష్య ఛేదనలో గుజరాత్ 218 పరుగులకే పరిమితమైంది.



**కోల్‌కతా :** ఈడెన్ గార్డెన్స్ వేదికగా శనివారం జరిగిన మ్యాచ్ లో కోల్ కతా నైట్ రైడర్స్ సత్తా చాటింది. పటిష్టమైన గుజరాత్ టైటాన్స్ కు చుక్కలు చూపించి 29 పరుగుల తేడాతో అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన గుజరాత్ టైటాన్స్ ఫీల్డింగ్ ఎంచుకోగా.. తొలుత బ్యాటింగ్ కు దిగిన కోల్ కతా బ్యాటర్లు బౌండరీల మోత మోగించారు. నిర్ణీత 20 ఓవర్లలో కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయి ఏకంగా 247 పరుగుల భారీ స్కోరును బోర్డుపై ఉంచారు. భారీ లక్ష్య ఛేదనలో గుజరాత్ బ్యాటర్లు గట్టిపోటీ ఇచ్చినా చివరకు నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 218 పరుగులకే పరిమితం అయ్యారు.

### ఆకాశమే హద్దుగా అలెన్..

తొలుత బ్యాటింగ్ చేసిన కోల్ కతాకు ఓపెనర్ ఫిన్ అలెన్ అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చాడు. టైటాన్స్ బౌలర్లను ఉతికి ఆరేసిన అలెన్ కేవలం 35 బంతుల్లోనే 93 పరుగులు చేసి తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. అతడికి తోడుగా అంగ్ క్రిష్ రఘువంశీ కూడా అద్భుత ప్రదర్శన చేశాడు. 44 బంతుల్లో అజేయంగా 82 పరుగులు సాధించి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. చివర్లో కామెరాన్ గ్రీన్ కేవలం 28 బంతుల్లో అజేయంగా 52 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. గుజరాత్ బౌలర్లలో సాయి కిషోర్ 3 ఓవర్లలో 38 పరుగులిచ్చి ఒక వికెట్ తీయగా, మహ్మద్ సిరాజ్ 4 ఓవర్లలో 50 పరుగులిచ్చి ఒక వికెట్ పడగొట్టాడు. అర్షద్ ఖాన్ ఒక ఓవర్లో 22 పరుగులిచ్చి వికెట్ లేకుండానే నిరాశపరిచాడు.

### పోరాడి ఓడిన గిల్, బట్లర్..

248 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్ ఏ దశలోనూ తగ్గలేదు. కెప్టెన్ శుభ్ మన్ గిల్ 49 బంతుల్లో 85 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేశాడు. అతడికి తోడుగా జోస్ బట్లర్ 35 బంతుల్లో 57 పరుగులు, సాయి సుదర్శన్ 28 బంతుల్లో అజేయంగా 53 పరుగులు చేసి లక్ష్యం దిశగా జట్టును నడిపించే ప్రయత్నం చేశారు. భారీ స్కోరు కావడంతో రన్ రేట్ పెరిగిపోయి గుజరాత్ బ్యాటర్లపై ఒత్తిడి పెరిగింది. కోల్ కతా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో టైటాన్స్ కు ఓటమి తప్పలేదు.

### కట్టడి చేసిన నరైన్..

భారీ లక్ష్య ఛేదనలో ఉన్న గుజరాత్ ను కట్టడి చేయడంలో కోల్ కతా బౌలర్లు సఫలమయ్యారు. ముఖ్యంగా వెటరన్ స్పిన్నర్ సునీల్ నరైన్ అద్భుతంగా బౌలింగ్ చేసి 4 ఓవర్లలో కేవలం 29 పరుగులిచ్చి 2 కీలక వికెట్లు పడగొట్టాడు. సౌరభ్ దూబే 2.4 ఓవర్లలో 23 పరుగులిచ్చి ఒక వికెట్ తీయగా.. బ్యాటింగ్ లో మెరిసిన కామెరాన్ గ్రీన్ బౌలింగ్ లోనూ సత్తా చాటి 3 ఓవర్లలో 25 పరుగులిచ్చి ఒక వికెట్ తన ఖాతాలో వేసుకున్నాడు. సమష్టి కృషితో కోల్ కతా ఈ అద్భుత విజయాన్ని నమోదు చేసింది.

# ఐపీఎల్ టికెట్ల పేరిట సైబర్ మోసాలు

## అభిమానులకు సీపీ సజ్జనార్ హెచ్చరిక




**హైదరాబాద్, మే 16:** క్రికెట్ అభిమానుల ఉత్సాహాన్ని అవకాశంగా మార్చుకుంటూ సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ హెచ్చరించారు. మే 22న హైదరాబాద్ ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరగనున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మ్యాచ్ టికెట్ల పేరుతో భారీగా మోసాలు జరుగుతున్నాయని ఆయన వెల్లడించారు. ఈ మ్యాచ్‌కు ఉన్న భారీ డిమాండ్‌ను ఉపయోగించుకుని నకిలీ వెబ్‌సైట్లు, యాప్‌లు, సోషల్ మీడియా లింకులు సృష్టించి తక్కువ ధరలకే టికెట్లు ఇస్తామంటూ ప్రజలను ఆకర్షిస్తున్నారని పోలీసులు తెలిపారు. ముఖ్యంగా అధికారిక టికెటింగ్ భాగస్వామి యాప్‌ను పోలిన నకిలీ యాప్‌లను తయారు చేసి డబ్బులు వసూలు చేస్తున్నారని హెచ్చరించారు. వాట్సాప్, టెలిగ్రామ్, ఇతర సోషల్ మీడియా ద్వారా వచ్చే అపరిచిత లింకులను క్లిక్ చేసి డబ్బులు చెల్లించవద్దని పోలీసులు స్పష్టం చేశారు. కేవలం అధికారిక యాప్‌లు లేదా గుర్తింపు పొందిన వెబ్‌సైట్ల ద్వారానే టికెట్లు కొనుగోలు చేయాలని సూచించారు. ఎవరైనా ఈ తరహా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ సూచించారు. ఈ జాగ్రత్తలతో అభిమానులు మోసాల బారిన పడకుండా ఉండొచ్చని ఆయన తెలిపారు.

# పాక్ జట్టుకు ఫాతిమా సనా నాయకత్వం

**ఇస్లామాబాద్, మే 16 :** మహిళల టీ20 ప్రపంచకప్ 2026 కోసం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు 15 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. జట్టుకు కెప్టెన్‌గా ఫాతిమా సనాను నియమించింది. వరుసగా రెండోసారి మహిళల టీ20 ప్రపంచకప్‌లో పాక్ జట్టును ఆమెనే ముందుండి నడిపించనున్నారు. ఇంగ్లండ్, వేల్స్ వేదికగా జూన్ 12 నుంచి జూలై 5 వరకు ఈ మెగా టోర్నీ జరగనుంది. తాజాగా జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న ఫాతిమా సనా ప్రపంచ రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. కేవలం 15 బంతుల్లోనే అర్ధశతకం సాధించి మహిళల టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో వేగవంతమైన ఫిఫ్టీ నమోదు చేశారు. పాక్ జట్టులో పలువురు యువ ఆటగాళ్లు తొలిసారి ప్రపంచకప్ ఆడనున్నారు. ఈమాన్ ఫాతిమా, నటాలియా పర్వేజ్, రమీన్ షమీమ్, సైరా జబీన్, తస్మియా రుబాబ్‌లకు ఇదే తొలి ప్రపంచకప్ కావడం విశేషం. బ్యాటింగ్ విభాగంలో గుల్ ఫిరోజా, మునీబా అలీ, ఫాతిమా సనాలపై పాక్ జట్టు ఆశలు పెట్టుకుంది. స్పిన్ విభాగంలో సాదియా ఇక్బాల్, నష్రా సంధు, తుబా హసన్ కీలకంగా మారనుండగా, పేస్ దాడిని ఫాతిమా సనా, డయానా బేగ్ ముందుండి నడిపించనున్నారు. గ్రూప్-1లో ఉన్న పాకిస్థాన్ జట్టు భారత్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్ జట్లతో పోటీపడనుంది. జూన్ 14న బర్మింగ్‌హామ్ వేదికగా భారత మహిళల క్రికెట్ జట్టుతో జరిగే మ్యాచ్‌తో పాక్ ప్రపంచకప్ ప్రయాణాన్ని ప్రారంభించనుంది. ప్రపంచకప్‌కు ముందు పాకిస్థాన్ జట్టు ఐర్లాండ్‌లో జరిగే ట్రైసిరీస్‌లో వెస్టిండీస్‌తో కలిసి పాల్గొననుంది. అలాగే శ్రీలంక, స్కాట్లాండ్ జట్లతో వార్మప్ మ్యాచ్‌లు కూడా ఆడనుంది.



# నార్త్ అమెరికాలో సరికొత్త రికార్డు దిశగా పెద్ది

రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన 'పెద్ది' చిత్రానికి సంబంధిం చిన నార్త్ అమెరికా ప్రీమియర్ బుకింగ్స్ ఇప్పటికే ఓపెన్ అయ్యాయి. బుకింగ్స్ ప్రారంభమైన నాటి నుంచే ఈ సినిమా కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తుంది. తాజాగా ఈ మూవీ యూనిట్ అధికారికంగా వెల్లడించిన వివరాల ప్రకారం, ఇప్పటివరకు నార్త్ అమెరికా ప్రీమియ ర్స్‌కు సంబంధించిన 10 వేల టికెట్లు అమ్ముడయ్యాయి. ఈ సినిమాను జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయను ండగా, ప్రీమియర్ షోలను జూన్ 3న ప్రదర్శించనున్నారు. విడుదల తేదీకి ఇంకా సమయం ఉండటంతో పాటు, ఈ మూవీ ట్రైలర్ కూడా ఇంకా విడుదల కాలేదు. ట్రైలర్ ప్రేక్షకులను ఆక ట్టుకునేలా ఉంటే టికెట్ సేల్స్ మరింత పెరిగే అవకాశము ందని ట్రేడ్ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ముఖ్యం గా ట్రైలర్ అంచనాలకు మించి ఆకట్టుకుంటే నార్త్ అమెరికాలో 'పెద్ది' ప్రీమియర్ బుకింగ్స్ సరికొత్త రికార్డు లను సృష్టించే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



# 'వృషకర్మ' నుంచి షూటింగ్ అప్డేట్..



అక్కినేని హీరో నాగచైతన్య నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'వృషకర్మ'. 'తండేల్' బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత చైతు నుంచి వస్తున్న ఈ మూవీపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. అంతే కాకుండా 'విరుపాక్ష' చిత్రంతో ఫుల్ ఫేమ్ తెచ్చుకున్న డైరెక్టర్ కార్తీక్ వర్మ దండు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దీంతో సినిమా నుంచి వచ్చే అప్డేట్స్ కోసం ఫ్యాన్స్ ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ఇందులో భాగంగానే తాజాగా వృషకర్మ షూటింగ్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మేరకు.. 'వృషకర్మ టీమ్ రాజస్థాన్‌లో కీలక షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ త్వరలోనే' అంటూ కొన్ని క్యూట్ పిక్స్ షేర్ చేశారు. లషూటింగ్‌కు సంబంధించిన ఫొటోలతో పాటు హీరో నాగచైతన్య, హీరోయిన్ మీనాక్షి చౌదరి లుక్స్ అంద రిని ఆకట్టుకుంటున్నాయి. ఈ భారీ మైథలాజికల్ అడ్వెంచర్ థ్రిల్లర్‌లో మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటిస్తుండగా.. స్పర్శ శ్రీవాత్సవ విలన్‌గా కనిపించ నున్నాడు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బి. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నాడు.

# ఈ నెల 19 అర్ధరాత్రి ఫస్ట్ గ్లింప్స్!



యంగ్ టైగర్ ఎన్టీఆర్, సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రం కోసం అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం 'చీ=చీవవశ్రీ' (వర్కింగ్ టైటిల్)గా పిలుస్తున్న ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ క్రమంలో ఎన్టీఆర్ పుట్టినరోజు (మే 20) సందర్భంగా అభిమానులకు అదిరిపోయే కానుక ఇచ్చేందుకు చిత్రబృందం సిద్ధమైంది. 19వ తేదీ అర్ధరాత్రి ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ మెగా ప్రాజెక్ట్ టీజర్‌ను కేవలం తెలుగులో మాత్రమే కాకుండా, దేశవ్యాప్తంగా ఐదు భాషల్లో విడుదల చేయనున్నారు. తెలుగుతో పాటు హిందీ, కన్నడ, తమిళం, మలయాళ భాషల్లో ఒకేసారి టీజర్‌ను రిలీజ్ చేసి, పాన్-ఇండియా స్థాయిలో ప్రకంపనలు సృష్టించేందుకు మేకర్స్ ప్లాన్ చేశారు. దీంతో ఈ సినిమాపై దేశవ్యాప్తంగా ఉన్న హైప్ మరో స్థాయికి చేరింది. చిత్ర బృందం విడుదల చేసిన ఓ కొత్త స్టిల్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఎడారి మధ్యలో ఓ వ్యక్తి చేతిలో కర్ర పట్టుకుని నిలబడి ఉన్న ఈ పోస్టర్, సినిమా ప్రపంచం ఎలా ఉండబోతోందనే ఉత్కంఠను రేకెత్తించింది. ప్రాజెక్ట్ ప్రకటించినప్పటి నుంచే దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తెలుగు సినిమాలోని టాప్ హీరోల్లో ఒకరైన ఎన్టీఆర్, భారీ యాక్షన్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ప్రశాంత్ నీల్ కలయిక కావడంతో ఈ సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. మే 19 అర్ధరాత్రి విడుదల కాబోయే ఫస్ట్ గ్లింప్స్, ఈ సినిమా స్థాయిని, కథా నేపథ్యాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయనుంది. ఈ టీజర్ కోసం తారక్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఆ పుస్తకంపైనే అందరి ఆసక్తి!



తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. తాజాగా లోకనాయకుడిగా పేరొందిన నటుడు, మక్కల్ నీది మయ్యం (వీచీవీ) పార్టీ అధినేత అయిన కమల్ హాసన్ విజయ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుతం డీఎంకే కూటమిలో ఉన్న కమల్ హాసన్.. విజయ్ తో భేటీ అవ్వడం చర్చనీయాంశమయింది. విజయ్ ను కలిసిన ఫొటోలను కమల్ హాసన్ తన సోషల్ మీడియా అకౌంట్లలో పోస్ట్ చేశారు. తమిళనాడు సీఎం, సోదరుడు విజయ్ ను వ్యక్తిగతంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసినట్లు ఆ పోస్ట్ కింద రాసుకొచ్చారు. తమిళనాడు అభ్యున్నతి కోసం ఆయన కంటున్న ఎన్నో కలలను ఈ సందర్భంగా తనతో పంచుకున్నారని, భేటీ అయిన సమయంలో విజయ్ చూపించిన వినయం, ఆప్యాయత తనను ఎంతో గర్వపడేలా చేశాయని కమల్ హాసన్ పోస్ట్ కింద పేర్కొన్నారు. అలాగే.. వివిధ రకాల అడ్డంకులు, సవాళ్లను ఎదుర్కొంటున్న కోలీవుడ్ కు ప్రభుత్వ మద్దతు, ప్రోత్సాహం ఎంతో అవసరమని కమల్ హాసన్ ఈ సందర్భంగా విజయ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తమిళ సినీ పరిశ్రమ అభివృద్ధిని కాంక్షిస్తూ.. ఆరు ముఖ్యమైన డిమాండ్లతో వినతిపత్రాన్ని సీఎం విజయ్ కు అందించినట్లు కూడా తెలిపారు. తాజా భేటీలో కమల్ హాసన్ సీఎం విజయ్‌కు ప్రముఖ చరిత్రకారుడు రామచంద్ర గుహ రాసిన 'గాంధీ బిఫోర్ ఇండియా' అనే పుస్తకాన్ని బహుమతిగా అందించడం విశేషం. గతంలో విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో కూడా కమల్ హాసన్ సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. అప్పట్లో విలేకరులతో మాట్లాడుతూ.. విజయ్‌ను ఇకపై కేవలం ఒక నటుడిగా మాత్రమే చూడకూడదని హితవు పలికారు. "ఆయనకు ఇప్పుడు రాష్ట్ర బాధ్యతలు ఉన్నాయి. ముఖ్యమంత్రి అనే వ్యక్తి ఏ రంగం నుండైనా రావచ్చు. కానీ విజయ్ మన సినీ పరిశ్రమ నుండి ముఖ్యమంత్రి స్థాయికి ఎదగడం నాకు ఎంతో గర్వకారణంగా ఉంది" అని కమల్ హాసన్ అప్పట్లోనే వ్యాఖ్యానించారు.

# రూ.12 కోట్ల ఆఫర్‌ను తిరస్కరించిన త్రిష..



వరుస సినిమాలతో సందడి చేస్తున్నారు నటి త్రిష. ఇప్పుడు ఆమెకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అగ్ర కథానాయకులు కమల్ హసన్ - రజనీకాంత్ కలిసి నటిస్తోన్న చిత్రంలో ఆమెను ఎంపిక చేసినట్లు గతంలో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రానున్న ఈ చిత్రం కోసం ఆమె భారీగా పారితోషికం తీసుకోనున్నట్లు కూడా ఎన్నో వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే, తమిళనాడు ఎన్నికల ఫలితాల అనంతరం త్రిష సినిమాల ఎంపికల్లోనూ ఎన్నో విషయాలు ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అందులోభాగంగానే ఈ సినిమా కోసం ఏకంగా రూ.12 కోట్లు ఆఫర్ చేసినప్పటికీ ఇందులో నటించేందుకు ఆమె సుముఖత చూపించడం లేదని ఆంగ్ల మీడియాలో కథనాలు వస్తున్నాయి. కమల్ హాసన్ - రజనీకాంత్ 46 ఏళ్ల తర్వాత కలిసి నటిస్తుండడంతో ఈ ప్రాజెక్ట్‌పై అందరిలో ఆసక్తి నెలకొంది. భారీ పారితోషికం ఆఫర్ చేసినప్పటికీ ఆమె దీన్ని రిజెక్ట్ చేయడం వెనక బలమైన కారణం ఉందని టాక్. ఈ సినిమాను ఉదయనిధి స్టాలిన్‌కు చెందిన రెడ్‌జెయింట్ నిర్మాణసంస్థ తెరకెక్కించడంతో ఆమె తిరస్కరించినట్లు ఆంగ్ల మీడియా పేర్కొంది. అసలు త్రిష ఈ ప్రాజెక్ట్‌లో నటిస్తున్నారా లేదా అనే దానిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఇక తాజాగా 'వీరభద్రుడు'లో లాయర్ ప్రీతిగా మెప్పించారు త్రిష. ప్రస్తుతం చిరంజీవికి జోడీగా 'విశ్వంభర'లో నటిస్తున్నారు. వశిష్ఠ దర్శకత్వంలో సోషియో ఫాంటసీ ఫిల్మ్‌గా రూపొందుతోంది. భారీస్థాయిలో రానున్న ఈ సినిమా కోసం ప్రపంచంలోనే టాప్ వీఎఫ్ఎక్స్ కంపెనీలు పనిచేస్తున్నాయి.

# మమ్ముట్టిని కలిసిన రేణుదేశాయ్




నటి రేణు దేశాయ్ ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో మళ్లీ బిజీగా మారుతున్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు విడాకులు ఇచ్చిన తర్వాత కొంతకాలం పాటు ఆమె ఇద్దరు పిల్లల బాధ్యతలను చూసుకుంటూ ఇంటికే పరిమితమయ్యారు. అయితే, కొన్నేళ్ల క్రితం సినిమాల్లోకి రీఎంట్రీ ఇచ్చిన రేణు దేశాయ్, ప్రస్తుతం ఒకవైపు కమర్షియల్ యాడ్స్, సినిమాలు చేస్తూనే.. మరోవైపు మూగజీవాల సంరక్షణ కోసం ఒక ఎన్జీవోను నడుపుతూ వాటి హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నారు. తాజాగా రేణు దేశాయ్ మాలీవుడ్ మెగాస్టార్ మమ్ముట్టిని కలిశారు. ఆ క్షణాలను సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. మమ్ముట్టిని కలవడం తన జీవితంలో ఒక క్రేజీ మూమెంట్ అని, ఆయనను కలవడం తన లైఫ్ టైమ్ డ్రీమ్ అని ఆమె పేర్కొన్నారు. ఒక వీరాభిమానిగా మమ్ముట్టి సార్‌ను కలిసి, ఆయనతో కొంత సమయం గడపడం వల్ల తన హృదయం ఆనందంతో ఉప్పొంగిపోతోందని రేణు దేశాయ్ ఎమోషనల్ అయ్యారు. తాను ఇప్పటివరకు కలిసిన వారిలో మమ్ముట్టి అత్యంత ప్రతిభావంతుడు, వినయశీలి, తెలివైనవాడు, దయగల వ్యక్తి అంటూ ఆమె ప్రశంసలు కురిపించారు. ప్రస్తుతం మమ్ముట్టితో ఆమె దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# నిర్మాతలకు డబ్బు వృథా కాదు..

ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లు అందుకుంటూ స్టార్ హీరోల సరసన నటిస్తూ క్రేజీ బ్యూటీగా దూసుకుపోతున్న మాళవిక మోహనన్.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు సీఎం విజయ్ దళపతిపై ప్రశంసలు కురిపించింది. 'మాస్టర్ సినిమా ఫస్ట్ డే షూటింగ్‌లోనే చాలా కష్టమైన సీన్ చేయాల్సి వచ్చి నా ఫోకస్ మెత్తం డైలాగ్స్ పైనే పెట్టాను. కానీ విజయ్ మాత్రం ఎలాంటి కష్టమైన్ సీన్‌లో నటించాల్సి వచ్చినా చాలా కూల్‌గా ప్రతి విషయంపై ఫోకస్ చేస్తారు. చాలా సరదాగా ఉంటారు. అంతేకాదు.. ఎప్పుడు ఏ అవసరం వచ్చిన ఫోన్ చేయగలిగే స్వేచ్ఛను ఇచ్చారు. అంత పెద్ద స్టార్ అయినప్పటికీ అలా అందుబాటులో ఉండటం గొప్ప విషయం' అని చెప్పుకొచ్చింది. 'మోహన్‌లాల్, రజనీకాంత్, విజయ్ వంటి సీనియర్ స్టార్ నటుల సినిమాల్లో నటించడం వల్ల ఎన్నో విషయాలు నేర్చుకున్నారు. ఉదయం 7 గంటలకు షూటిం గ్ అంటే వాళ్లు 6:55 సెట్స్‌లో ఉంటారు. అలాంటి వారి వల్ల నిర్మాతలకు డబ్బు వృథా కాదు' అని తెలిపింది.

# అది నా అదృష్టం..



'నటుడిగా నేను కెరీర్ ప్రారంభించిన తొలి సినిమాకే మరిడేశ్ బాబు లాంటి అద్భుతమైన పాత్ర రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. అంతకంటే మంచి డెబ్యూని నేను కోరుకోలేను. సినిమా బండి సినిమా నటుడిగా నాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది' అని రాగ్ మయూర్ అన్నారు. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న రాగ్ మయూర్.. ఇండస్ట్రీకి వచ్చి మే15తో ఐదేళ్లు పూర్తవు తుంది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తనకు తొలి అవకాశం ఇచ్చిన దర్శకుడు ప్రవీణ్ కండ్రేగులకు, నిర్మాతలు రాజ్ నిడిమోరు, కృష్ణ డి.కెలకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ప్రముఖ హిందీ వెబ్ సిరీస్ 'పంచాయత్'కు రీమేక్‌గా వచ్చిన 'సివరాపల్లి' నటుడిగా మరింత గుర్తింపు తెచ్చింది. 'సివరాపల్లి' సూపర్‌హిట్ తర్వాత నాకు మరింత ఆత్మ విశ్వాసం వచ్చింది. చాలా మంది దర్శకులు నన్ను దృష్టిలో పెట్టుకుని పాత్రలను రాశామని చెప్పారు. దర్శకులు నాకోసం ప్రత్యేకంగా పాత్రలు రాయటం అనేది నటుడిగా నాకు గొప్ప గుర్తింపు. నేను థియేటర్ ఆర్టిస్ట్ కావటంతో నటనలో విభిన్న కోణాలను అన్వేషించే అవకాశం దక్కింది. అది నా నటనను మరింత మెరుగు పరిచింది. ప్రస్తుతం డైరెక్టర్ గౌరి నాయుడు జమ్ము తెరకెక్కిస్తోన్న 'గరివిడి లక్ష్మి'లో బుర్రకథ కళాకారుడి పాత్ర చేశా. ఇది చాలా ఎక్సైటింగ్‌తో పాటు ఛాలెంజింగ్ పాత్ర కూడా. ఈ పాత్ర కోసం ఎంతో ప్రిపేర్ అయ్యి నటించాను. నా ఫిల్మోగ్రఫీపై గర్వంగా ఉంది. కెరీర్ ప్రారంభ దశలోనే అగ్రశ్రేణి దర్శకులు, టెక్నీషియన్స్‌తో పని చేసే అవకాశం రావడం నా అదృష్టం. ఎమోషన్స్, రియలిస్టిక్ కథనాలకు ప్రాధాన్యం ఉన్న సినిమాల్లో నటించాలని ఎప్పటినుంచో కోరుకున్నాను' అని అన్నారు.

# పవన్ వ్యాఖ్యలపై అంబటి విమర్శలు

- జనసేన లక్ష్యంపై ప్రశ్నలు
- పవన్ వ్యాఖ్యలకు అంబటి కౌంటర్
- ఏపీ రాజకీయాల్లో మళ్లీ మాటల యుద్ధం



**అమరావతి, మే 16:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం వేడెక్కింది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన తాజా వ్యాఖ్యలపై వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబు తీవ్ర స్థాయిలో స్పందించారు. పవన్ కళ్యాణ్ రాజకీయ లక్ష్యం, పార్టీ స్థాపన ఉద్దేశ్యం, ఎన్నికల వ్యూహాలపై పరోక్షంగా విమర్శలు గుప్పిస్తూ పలు వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల తమిళ సినీ నటుడు విజయ్ రాజకీయ రంగప్రవేశం, ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి విజయం సాధించడం నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చ సాగింది. విజయ్ రాజకీయ ప్రయాణాన్ని పవన్ కళ్యాణ్‌తో పోలుస్తూ అనేక పోస్టులు, అభిప్రాయాలు వైరల్ అయ్యాయి. ఈ అంశంపై స్పందించిన పవన్ కళ్యాణ్, విజయ్ రాజకీయ పరిస్థితులు, తన రాజకీయ పరిస్థితులు పూర్తిగా భిన్నమని పేర్కొన్నారు. గతంలో తాను ఒంటరిగా ఎన్నికల్లో పోటీ చేసిన అనుభవాన్ని పవన్ గుర్తుచేశారు. రెండు చోట్ల పోటీ చేసి ప్రజలు తనను ఓడించారని, ఆ అనుభవం తనకు రాజకీయంగా చాలా విషయాలు నేర్పిందని చెప్పారు. రాజకీయాల్లో విజయం సాధించాలంటే పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు మార్చుకోవాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. ఈ కారణంగానే పొత్తులతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఏర్పడిందని పవన్ వివరించారు. ఎన్నికల్లో గెలుపే ప్రధాన లక్ష్యమని, ప్రజా ప్రయోజనాల కోసం వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. అయితే పవన్ చేసిన ఈ వ్యాఖ్యలపై వైసీపీ నేత అంబటి రాంబాబు వెంటనే స్పందించారు. పవన్ పార్టీని ముఖ్యమంత్రి కావడానికి కాదు, మరొకరిని ముఖ్యమంత్రి చేయడానికి స్థాపించారని తాము చాలా కాలం నుంచి చెబుతున్నామని వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు తమ మాటలను ప్రజలు అంతగా పట్టించుకోలేదని, కానీ ఇప్పుడు ప్రజలకు కూడా వాస్తవాలు అర్థమవుతున్నాయని అన్నారు. పవన్ కళ్యాణ్ స్వయంగా తన వ్యాఖ్యల ద్వారా రాజకీయ లక్ష్యాలను అంగీకరించినట్టుగా కనిపిస్తోందని అంబటి వ్యాఖ్యానించారు. గతంలో ఒంటరిగా పోటీ చేసి ఓడిపోయానని చెప్పడం, పొత్తులు అవసరమని అంగీకరించడం ఆయన రాజకీయ వైఖరిని ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. రాజకీయాల్లో వ్యక్తిగత ఆశయాల కంటే ప్రజా నమ్మకం, స్థిరమైన నాయకత్వం ముఖ్యమని అంబటి పరోక్షంగా వ్యాఖ్యానించారు. ప్రజల ముందు ఒక విధంగా, రాజకీయాల్లో మరో విధంగా వ్యవహరించడం సరైంది కాదని విమర్శించారు. పవన్ వ్యాఖ్యలతో పాటు అంబటి చేసిన విమర్శలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. అధికార కూటమి, ప్రతిపక్షాల మధ్య ఇప్పటికే రాజకీయ వేడి కొనసాగుతున్న సమయంలో ఈ వ్యాఖ్యలు మరింత చర్చకు కారణమయ్యాయి. రాష్ట్రంలో రాబోయే రాజకీయ పరిణామాలు, ఎన్నికల వ్యూహాలు, కూటముల రాజకీయాలు ప్రధాన చర్చగా మారుతున్న నేపథ్యంలో నేతల మధ్య విమర్శలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఇరు పార్టీల నాయకులు తమ తమ వైఖరులను బలంగా వినిపిస్తుండగా, రానున్న రోజుల్లో ఈ మాటల యుద్ధం మరింత ఉధృతమయ్యే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



## మంత్రి సవిత పొదుపు మంత్రం

### స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి నడచుకుంటూ రాక

**శ్రీ సత్యసాయి జిల్లా, మే 16:** ఇంధన పొదుపులో భాగంగా మంత్రి సవిత.. తన ఇంటి నుంచి నడుచుకుంటూ వెళ్లి స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. పెనుకొండ పట్టణంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి.. స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ వీధిని పరిశుభ్రంగా ఉంచాలని పిలుపునిచ్చారు. అనంతరం సవిత మాట్లాడుతూ.. పరిశుభ్రమైన పరిసరాలతోనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమని తెలిపారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగం తగ్గించాలని ప్రజలకు మంత్రి సూచించారు. షాపుల్లో ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛమైన పెనుకొండ కోసం ప్రజల సహకారం అవసరమని మంత్రి తెలిపారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయొద్దని సూచించారు. స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్రతో గ్రామాలు, పట్టణాలు మరింత అందంగా మారుతాయని మంత్రి సవిత పేర్కొన్నారు.

## నేడు బీజేపీ డప్పుడు కళాకారుల ప్రదర్శన

**విజయవాడ, మే 16:** దళితుల ఆత్మగౌరవ గుండె చప్పుడు పేరుతో బీజేపీ వినూత్న కార్యక్రమం చేపట్టిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. మే 17 ఆదివారం సాయంత్రం అంబేద్కర్ విగ్రహం సాక్షిగా డప్పు కళాకారులతో భారీ ప్రదర్శన ఉంటుందని తెలిపారు. డప్పు ద్వారా ఆధ్యాత్మిక, సంగీత, ప్రచార కార్యక్రమాలు జరుగుతాయన్నారు. డప్పు వాయిద్యానికే జీవితాలను అంకితం చేసిన వారు ఉన్నారని గుర్తుచేశారు. మేల్కొలిపే ఈ డప్పును ఓ దళితుడు మోగిస్తారని.. ఆ తరువాత ఇతర వాయిద్యాలు ప్రారంభమవుతాయని చెప్పారు. బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షులు పనతాల సురేశ్ ఆధ్వర్యంలో డప్పు కళాకారుల కోసం ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారి బతుకుల్లో వెలుగులు ఇచ్చేలా వారి సంక్షేమం కోసం బీజేపీ కృషి చేస్తోందన్నారు. భారత రాజ్యాంగం ద్వారా అందరకీ సమాన ప్రాధాన్యం ఇచ్చిన అంబేద్కర్ నడయాడిన ప్రాంతాలను ప్రధాని మోదీ అభివృద్ధి చేశారని మాధవ్ చెప్పారు. విజయవాడలో అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని మాజీ సీఎం జగన్ ఏర్పాటు చేశారని అందరూ అనుకుంటారని.. అది నిజం కాదని స్పష్టం చేశారు. మోదీ ప్రభుత్వం రూ.430 కోట్లు కేటాయించి నిర్మాణం చేసిందని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలు ప్రజల్లోకి వెళ్లేలా రేపు(ఆదివారం) డప్పు కళాకారుల ప్రదర్శనలు ఉంటాయన్నారు. 'చదవండి.. సమీకరించండి.. పోరాడండి అని అంబేద్కర్ చెప్పారు. చదువు ద్వారా సమాజంలో గుర్తింపు ఉంటుందని చెప్పారు' అని గుర్తుచేశారు. రేపు పెద్ద ఎత్తున జరిగే ఈ ప్రదర్శనలో మంత్రి సత్యకుమార్, కూటమి నాయకులు పాల్గొంటారని మాధవ్ తెలిపారు. డప్పు కళాకారులకు చేయూతనివ్వాలని.. ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అన్ని కులాల వారికి ఆలయాల్లో సమాన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దేవాలయ వ్యవస్థలో అన్నివర్గాల వారి పాత్ర ఉంటుందని తెలిపారు. డప్పు కళాకారులు ప్రతి ఉత్సవంలో కీలకంగా పని చేస్తారన్నారు. రేపు జరిగే భారీ ప్రదర్శన సరికొత్త చరిత్రకు నాంది పలుకుతుందని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.



## టీజీ వెంకటేశ్ జన్మదిన వేడుకలు

### 60 జంటలకు సామూహిక వివాహాలు



**కర్నూలు, మే 16:** మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తన పుట్టిన రోజు సందర్భంగా కర్నూలులో 60 మంది జంటలకు సామూహిక వివాహాలు జరిపించారు. నూతన వధూవరులను ఆశీర్వదించి నగదు చెక్కులు పంపిణీ చేశారు. సామూహిక వివాహ కార్యక్రమం అనంతరం మాజీ ఎంపీ వెంకటేశ్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వైసీపీ యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్దార్థరెడ్డిపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'సిద్దార్థ్ రెడ్డిని ఒకసారి కలిసి భవిష్యత్తు బాగుంటుందని నేను చెప్పాను. రాయలసీమలో మీసాలు తిప్పిన పెద్దపెద్ద వాళ్లు చివరికి వాటిని దించి మా దగ్గరికి వచ్చారు. మీసాలు తిప్పే వారికి బుద్ధి చెప్పక తప్పదు. మీరు 100 మందిని తెస్తే మేము 1000 మంది తెస్తాం. సేవా కార్యక్రమాలకు కోట్లు ఖర్చు చేస్తున్నాం, మా కోసం ఖర్చు పెట్టలేమా?. మీరు రెచ్చిపోతే మా కార్యకర్తలు సరైన రీతిలో బుద్ధి చెబుతారు. మీరు అదుపులో ఉండాలని హెచ్చరిస్తున్నాం. మాకు నీతులు చెప్పే నాయకులు కర్నూలులో ఎన్నో భూములు కబ్జా చేశారు. ఆ భూములను మేము రక్షించాం. కులమతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు చేస్తున్నాం. అలాంటి మాపై బురద చల్లాలని చూస్తే చూస్తూ ఊరుకోం' అని అన్నారు. కాగా, ఈ కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్ కూడా పాల్గొన్నారు.

## ఇంధన పొదుపుపై ప్రత్యేక దృష్టి

### 20 లక్షల సూర్యఘర్ కనెక్షన్లు లక్ష్యం

### సౌరవిద్యుత్ ఏర్పాటులో ప్రోత్సాహం

### ప్రధాని, ముఖ్యమంత్రి సూచనల అమలుకు కృషి

### విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడి



**అమరావతి, మే 16:** ఇంధన పొదుపు చర్యలను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆఫీసులు, పాఠశాలల్లో సోలార్ విద్యుత్ ఏర్పాటు చేస్తామన్నారు. సోలార్ ద్వారా వంట చేసుకునే విధానాలు ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. విద్యుత్ సంస్కరణలు అందిపుచ్చుకునే తొలి రాష్ట్రం మనదేనని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో ఇంధన పొదుపు అనేది కీలకం కానుందన్నారు. దేశంలో కోటి సూర్యఘర్ కనెక్షన్లు ఉండాలని ప్రధాని చెప్పారని తెలిపారు. ఒక్క ఏపీలోనే 20 లక్షల కనెక్షన్లు లక్ష్యంగా పని చేస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఇంధన పొదుపు మీద ప్రత్యేకమైన దృష్టి సారించినట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఖర్చులు తగ్గించుకోవాలని, పగటిపూట మన ఇంటిపైనే సౌరశక్తి ద్వారా విద్యుత్‌ను తయారుచేసుకుని వినియోగించుకోవాలని సీఎం చెప్పారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 6 లక్షల కనెక్షన్లు, ఒక్కో ఇంటిపైన 2 కిలోవాట్లు ఉచితంగా పేదలకు ఇవ్వాలని చాలా పెద్ద ఎత్తున సూర్యఘర్ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఇంధన పొదుపు అనేది చాలా ముఖ్యమైన అంశంగా ముఖ్యమంత్రి ముందుకువెళ్తున్నారని మంత్రి అన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ లాంటి శిలాజ ఇంధనాలను భారతదేశం నిత్యం బయటి దేశాల నుంచి దిగుమతి చేసుకోవలసిన పరిస్థితి ఉందని మంత్రి తెలిపారు. సౌరశక్తి, గాలి ద్వారా ఇలా ప్రత్యమ్నాయ పద్ధతుల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేయాలని సీఎం చెప్పారన్నారు. ప్రతి ఇంటిపై 2 కిలోవాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్లకు రూ.78 వేలు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందన్నారు. అదనంగా ఇంకో రూ.20 వేలు కలిపి ఇవ్వాలని ముఖ్యమంత్రి తెలిపారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 2 కిలోవాట్లకు మొత్తం రూ.1.25 లక్షల సబ్సిడీని ప్రభుత్వమే ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో ఇంధన పొదుపు చాలా ముఖ్యమన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆస్పత్రులపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి దాని ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసి.. ప్రజలపై భారం పడకుండా ఉండేలా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. గడిచిన రెండు సంవత్సరాల నుంచి విద్యుత్ బిల్లులు పెంచకుండా ఎటువంటి ఖర్చులు ఉన్నా ప్రభుత్వమే భరించిందని చెప్పుకొచ్చారు. గతంలో ఉన్న 5 వేల కోట్ల భారాన్ని ప్రజలపై పడకుండా ప్రభుత్వమే భరించేలా సీఎం చొరవ చూపారన్నారు. విద్యుత్ ఉత్పత్తి పెంచి, ప్రజలపై భారం పడకుండా నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అందులో భాగంగానే తమ ప్రొటోకాల్ వాహనాలను తగ్గిస్తున్నామన్నారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి సూచనలను అందరం ఆచరించాలని మంత్రి సూచించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వం, ప్రజలు కలిసి పనిచేయాలన్నారు. గత ప్రభుత్వంలో ట్రూ అప్ ఛార్జీలు, విద్యుత్ సుంకమంటూ ప్రజలపై విపరీతంగా భారం వేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం మొదటగా 13 పైసలు తగ్గించిందని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో విద్యుత్ చార్జీలు తగ్గించాలని, ప్రజలపై భారం పడకుండా చేయాలని సీఎం లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. గతంలో సీఎం తీసుకువచ్చిన సంస్కరణల వల్ల 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వగలిగిన స్థాయికి వచ్చామన్నారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు సలహాలు, సూచనల మేరకు క్లీన్ ఎనర్జీ ఇచ్చే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

# కూలీలపై దూసుకెళ్లిన టిప్పర్ లారీ

### నలుగురు మహిళా కూలీల మృతి..

### కాకినాడ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

### దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన డిప్యూటీ సీఎం పవన్






**కాకినాడ, మే 16:** జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కోవూరు బ్రిడ్జి వద్ద శనివారం జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు ఉపాధి హామీ కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రోడ్డు దాటుతున్న కూలీలను.. టిప్పర్ లారీ బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉపాధి హామీ పనుల నిమిత్తం కూలీలు రోడ్డు దాటుతున్నారు. అదే సమయంలో వేగంగా దూసుకొచ్చిన ఓ టిప్పర్ లారీ వారిపైకి దూసుకెళ్లింది. లారీ వేగాన్ని నియంత్రించలేకపోవడంతోనే ఈ ఘోర ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. చనిపోయిన కూలీలు.. సత్యవతి, కృష్ణమ్మ, చిట్టెమ్మ, అన్నవరంగా గుర్తించారు. వీరంతా స్థానిక చీడిగ ప్రాంతానికి చెందినవారని పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను అత్యవసర చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (ఉఉఉ)కి తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో మృతుల గ్రామాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి పొంగూరు నారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పొట్టకూటి కోసం పనులకు వెళ్తున్న నలుగురు మహిళా కూలీలు ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందడం అత్యంత బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు మంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాద ఘటనపై సమాచారం అందిన వెంటనే మంత్రి నారాయణ స్థానిక అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి ఎలాంటి లోటు రాకుండా, తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా యంత్రాంగాన్ని, వైద్య అధికారులను ఆయన ఆదేశించారు. ప్రభుత్వం వారికి అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి నారాయణ భరోసా ఇచ్చారు. ఘోర రోడ్డు ప్రమాదంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో నలుగురు మహిళా ఉపాధి హామీ శ్రామికులు మృతి చెందడం బాధాకరమని అన్నారు. చీడిగ గ్రామానికి చెందిన ఆరుగురు మహిళా శ్రామికులు రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్టు అధికారులు చెప్పారని డిప్యూటీ సీఎం తెలిపారు. పని ప్రదేశంలో ఇలాంటి విషాదకర ఘటన జరగడం తీవ్రంగా కలచివేసిందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కాకినాడ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించినట్లు వెల్లడించారు. బాధితులు పూర్తిగా కోలుకునే వరకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని చెప్పారు. మృతి చెందిన శ్రామికుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం పెంచిన పరిహారం రూ.4 లక్షలను త్వరితగతిన అందజేస్తామని తెలిపారు. లాగే రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.2 లక్షల సహాయంతో పాటు పీఎం సురక్ష యోజన, పీఎం జీవన్ జ్యోతి యోజన కింద లభించే బీమా మొత్తాన్ని కూడా అందిస్తామని పేర్కొన్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా రహదారుల పక్కన జరుగుతున్న ఉపాధి పనుల వద్ద భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జాతీయ రహదారులు, బైపాస్ రోడ్లు, ట్రాఫిక్ అధికంగా ఉండే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి వాహనాల వేగ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచించారు.



# బంగారం, వెండి ధరలు భారీగా పతనం

**హైదరాబాద్, మే 16:** దేశంలో బంగారం, వెండి ధరలు మరోసారి భారీగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, అమెరికా రుణ భద్రత పత్రాలపై పెరిగిన రాబడులు, డాలర్ బలపడటం వంటి కారణాలతో పసిడి, వెండి ధరల్లో పతనం కనిపిస్తోంది. దేశీయ బులియన్ మార్కెట్లలో కొనుగోళ్లు మందగించడంతో ధరలు దిగివచ్చినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో నేడు ఉదయం నాటికి 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.980 తగ్గి రూ.1,56,930కు చేరుకుంది. 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర కూడా రూ.900 తగ్గి రూ.1,43,850 వద్ద కొనసాగుతోంది. వెండి ధరల్లో మరింత భారీ పతనం నమోదైంది. కిలో వెండి ధర రూ.15 వేల మేర తగ్గి రూ.2.90 లక్షలకు పడిపోయింది. దేశవ్యాప్తంగా కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,60,910గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం రూ.1,47,500 వద్ద ట్రేడవుతోంది. న్యూఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,57,080కు చేరుకోగా, 22 క్యారెట్ల పసిడి రూ.1,44,000గా నమోదైంది. ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,930 వద్ద కొనసాగుతోంది. వెండి ధరల్లోనూ దేశవ్యాప్తంగా భారీ మార్పులు కనిపిస్తున్నాయి. ప్రధాన నగరాల్లో కిలో వెండి ధర రూ.3 లక్షల మార్క్ కంటే దిగువకు చేరింది. చెన్నైలో అత్యధికంగా కిలో వెండి రూ.2.90 లక్షల వద్ద కొనసాగుతుండగా, ఇతర నగరాల్లో కూడా భారీగా తగ్గుదల నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరల మార్పులు, డాలర్ మారకం విలువ పెరుగుదల, అమెరికా ఆర్థిక పరిస్థితుల ప్రభావం బంగారం ధరలపై పడుతోందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో అంతర్జాతీయ పరిణామాలను బట్టి బంగారం, వెండి ధరల్లో మరిన్ని హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.


# దక్షిణాదిలో టీఈసీ విస్తరణ




**హైదరాబాద్, మే 16 :** వ్యూహాత్మక వ్యాపార విస్తరణలో భాగంగా ది ఎగ్జిక్యూటివ్ సెంటర్ దక్షిణ భారత మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, చెన్నై నగరాల్లో కొత్త కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ ప్రకటించింది. దక్షిణాదిలో మొత్తం 4.65 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆధునిక కార్యాలయ స్థలాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపింది. ఈ విస్తరణతో సుమారు 6 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని సంస్థ వెల్లడించింది. ఇందులో బెంగళూరులో 91 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యాలయ స్థలం ఏర్పాటు చేయనుండగా, అక్కడ సుమారు 1,100 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. అలాగే హైదరాబాద్‌లో 2.04 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక కార్యాలయ ప్రాంగణాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రంలో దాదాపు 2,820 మంది కూర్చొని పనిచేసే సౌకర్యం ఉండనుంది. దక్షిణ భారత నగరాల్లో పెరుగుతున్న ఐటీ, స్టార్టప్, కార్పొరేట్ సంస్థల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ విస్తరణ చేపట్టినట్లు సంస్థ పేర్కొంది. ఆధునిక సదుపాయాలతో కూడిన కార్యాలయ వాతావరణాన్ని అందించడం ద్వారా సంస్థలు, ఉద్యోగులకు మెరుగైన పని అనుభవాన్ని కల్పించడమే లక్ష్యమని తెలిపింది.

# ఎస్‌బీఐ ఎఫ్‌డీలపై కాసుల వర్షం

**ముంబై, మే 16:** సురక్షితమైన పెట్టుబడుల ద్వారా స్థిరమైన ఆదాయం పొందాలనుకునే దేశీయ మార్కెట్ వినియోగదారులకు దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాలు ఉత్తమ ఎంపికగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా దీర్ఘకాలిక డిపాజిట్లపై బ్యాంకు అందిస్తున్న అధిక వడ్డీ రేట్లు ఖాతాదారులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం ఎస్‌బీఐ వివిధ కాలపరిమితుల గల ఎఫ్‌డీలపై కనీసం 3.05 శాతం నుండి గరిష్ఠంగా 7.15 శాతం వరకు వడ్డీని అందిస్తోంది. ఈ విభాగంలో 3.05% నుంచి 3.65% వరకు వడ్డీ లభిస్తోంది. ఈ డిపాజిట్లపై 4.90% నుండి 5.50% వరకు వడ్డీ ఇస్తున్నారు. ఈ కాలపరిమితిపై 5.65% నుండి 6.25% వరకు రాబడి వస్తుంది. సురక్షిత ఆదాయం కోరుకునే వారి కోసం ఈ విభాగంలో అత్యధికంగా 6.05% నుండి 7.15% వరకు వడ్డీ రేట్లను బ్యాంకు ఆఫర్ చేస్తోంది. ఒక సాధారణ పౌరుడు 6 సంవత్సరాల ఎఫ్‌డీ పథకంలో రూ. 3 లక్షలు పెట్టుబడి పెడితే, మెచ్యూరిటీ సమయానికి మొత్తం రూ. 4,30,120 చేతికి వస్తాయి. ఇందులో కేవలం వడ్డీ రూపంలోనే రూ. 1,30,120 లాభం కలుగుతుంది. ఇదే పథకంలో వృద్ధులు రూ. 3 లక్షలు డిపాజిట్ చేస్తే మెచ్యూరిటీ అనంతరం మొత్తం రూ. 4,56,276 పొందుతారు. ఇందులో వడ్డీ లాభమే సుమారు రూ. 1,56,276 గా ఉంటుంది. అత్యంత వయోవృద్ధులకు బ్యాంకు మరిన్ని అదనపు ప్రయోజనాలను కల్పిస్తోంది. వీరు రూ. 3 లక్షల ఎఫ్‌డీపై 6 ఏళ్ల తర్వాత ఏకంగా రూ. 4,58,974 పొందే అవకాశం ఉంది. ఇందులో రూ. 1,58,974 వరకు వడ్డీ రూపంలోనే లభిస్తుంది.




# రూపాయి విలువకు మరో భారీ దెబ్బ

**ముంబై, మే 16 :** అమెరికా డాలర్ బలపడటం, పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదల ప్రభావంతో భారత రూపాయి విలువ మరోసారి భారీగా క్షీణించింది. డాలర్‌తో పోలిస్తే దేశీయ కరెన్సీ తొలిసారిగా 96 మార్కు దిగువకు పడిపోవడం మార్కెట్లలో ఆందోళన కలిగిస్తోంది. శుక్రవారం ఇంటర్‌బ్యాంక్ విదేశీ మారకద్రవ్య మార్కెట్‌లో రూపాయి 95.86 వద్ద ప్రారంభమై, ఒక దశలో 96.14 వరకు పడిపోయి చరిత్రలోనే కనిష్ఠ స్థాయిని తాకింది. అనంతరం కొంత కోలుకుని 95.81 వద్ద ముగిసింది. గురువారంతో పోలిస్తే రూపాయి విలువ 17 పైసలు తగ్గింది. అమెరికా-ఇరాన్ యుద్ధ ఉద్రిక్తతలు, పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు భారీగా పెరుగుతున్నాయి. గల్ఫ్ దేశాల్లో చమురు, వాయువు ఉత్పత్తి తగ్గిపోవడం, హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడం వంటి పరిణామాలు ప్రపంచ సరఫరా వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో భారత్ సహా అనేక దేశాల్లో డాలర్లకు డిమాండ్ పెరిగింది. దేశంలో పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరలు పెరగడం, వంటగ్యాస్ ధరల పెంపు కారణంగా ద్రవ్యోల్బణ భయాలు కూడా రూపాయి పతనానికి కారణమవుతున్నాయి. దిగుమతుల ఖర్చు పెరగడం వల్ల రూపాయిపై ఒత్తిడి మరింత పెరిగిందని నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు రూపాయి విలువ దాదాపు 6 రూపాయలు క్షీణించింది. గత ఏడాది డిసెంబర్ 31న డాలర్ మారకం విలువ 89.88 వద్ద ఉండగా, ప్రస్తుతం 95.81కు చేరుకుంది. అంటే నాలుగున్నర నెలల్లోనే రూపాయి విలువ 6 శాతానికి పైగా క్షీణించినట్లైంది. గత ఆరు ట్రేడింగ్ సెషన్లలోనే రూపాయి దాదాపు 2 శాతం నష్టపోయింది. అమెరికాలో రిటైల్ అమ్మకాలు పెరగడం, ఉద్యోగ మార్కెట్ గణాంకాలు బలంగా ఉండటం వల్ల డాలర్



ఇండెక్స్ మరింత బలపడుతోంది. అలాగే అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితులు, కృత్రిమ మేధస్సు ప్రభావంతో భవిష్యత్ పెట్టుబడులపై నెలకొన్న అయోమయం కూడా డాలర్‌కు మద్దతు ఇస్తోందని కరెన్సీ మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. విదేశీ మదుపర్లు దేశీయ మూలధన మార్కెట్ల నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకోవడం, వాణిజ్య లోటు పెరగడం కూడా రూపాయి పతనాన్ని మరింత వేగవంతం చేస్తున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోక్యం చేసుకుంటున్నప్పటికీ, ముడి చమురు ధరలు తగ్గేదాకా రూపాయి ఒత్తిడిలోనే కొనసాగే అవకాశముందని ఆర్థిక వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# ఈవీ స్కూటర్లకు క్రేజ్

**హైదరాబాద్, మే 16:** దేశంలో నానాటికీ పెరుగుతున్న పెట్రోల్ ధరల భారం, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో వస్తున్న అవగాహన కారణంగా ఎలక్ట్రిక్ స్కూటర్లకు ఆదరణ గణనీయంగా పెరుగుతోంది. ముఖ్యంగా నగర ప్రాంతాల్లో తక్కువ నిర్వహణ ఖర్చుతో కూడిన, కుటుంబ అవసరాలకు సరిపోయే స్కూటర్ల వైపు మధ్యతరగతి వినియోగదారులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. సాధారణ కుటుంబ వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని బజాజ్ ఆటో తీసుకొచ్చిన 'చేతక్ సీ2501' ప్రస్తుతం మార్కెట్లో దూసుకుపోతోంది. బెంగళూరులో దీని ఎక్స్‌షోరూమ్ ధర సుమారు రూ. 91,504గా ఉంది. మితిమీరిన హంగులు లేకుండా, సౌకర్యవంతమైన ప్రయాణానికి ప్రాధాన్యతనిస్తూ, సింపుల్ కంట్రోల్స్‌తో నగర ట్రాఫిక్‌లో సులభంగా నడిపేలా దీన్ని రూపొందించారు. టీవీఎస్ మోటార్ కంపెనీకి చెందిన 'ఐక్యూబ్' మోడల్ నగరాల్లో విస్తృతంగా కనిపిస్తోంది. సుమారు రూ. 1.07 లక్షల ధర కలిగిన ఈ స్కూటర్ అపార్ట్‌మెంట్‌లు, కార్యాలయ ఉద్యోగుల వద్ద ఎక్కువగా చెలామణి అవుతోంది. ఏథర్ ఎనర్జీ సంస్థ కుటుంబ అవసరాల కోసమే ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన 'రిజ్టా' స్కూటర్ కూడా మంచి ఆదరణ పొందుతోంది. రూ. 1.17 లక్షల ధరలో లభిస్తున్న ఈ వాహనం.. స్పోర్టీ లుక్, వేగవంతమైన యాక్సిలరేషన్‌ను ఇష్టపడే యువతను లక్ష్యంగా చేసుకుని ఏథర్ రూపొందించిన '450ఎక్స్' స్కూటర్ ప్రత్యేక గుర్తింపు పొందింది. సుమారు రూ. 1.51 లక్షల ధర కలిగిన ఈ స్కూటర్ శక్తివంతమైన పనితీరుతో నగర ట్రాఫిక్‌లో దూసుకుపోతోంది. ఆటోమొబైల్ దిగ్గజం హోండా మోటార్ కంపెనీ నుంచి రాబోతున్న 'యాక్టివా ఎలక్ట్రిక్'పై మార్కెట్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. సుమారు రూ. 1.20 లక్షల ధరలో లభించనున్న ఈ స్కూటర్‌కు యాక్టివా బ్రాండ్ విశ్వసనీయత ప్రధాన బలం కానుంది.

# వాణిజ్యలోటు మళ్లీ పెరుగుదల

**న్యూఢిల్లీ, మే 16 :** దేశ వాణిజ్యలోటు మరోసారి ఆందోళన కలిగిస్తోంది. ఎగుమతులు రెండంకెల వృద్ధిని నమోదు చేసినప్పటికీ, దిగుమతులు కూడా భారీగా పెరగడంతో వాణిజ్యలోటు మూడు నెలల గరిష్ఠ స్థాయికి చేరుకుంది. తాజాగా కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం, గత నెలలో దేశ ఎగుమతులు 12.78 శాతం పెరిగి 43.56 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇదే సమయంలో దిగుమతులు 10 శాతం పెరిగి ఆరు నెలల గరిష్ఠ స్థాయి అయిన 71.94 బిలియన్ డాలర్లకు చేరాయి. దీంతో ఎగుమతులు, దిగుమతుల మధ్య వ్యత్యాసమైన వాణిజ్యలోటు 28.38 బిలియన్ డాలర్లకు పెరిగింది. గత ఏడాది ఇదే నెలలో ఇది 27.1 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఈ సందర్భంగా వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ దేశ ఎగుమతులు బలంగా




పెరగడం సానుకూల సంకేతమన్నారు. గత ఐదు నెలల్లో ఇదే అత్యధిక వృద్ధి అని తెలిపారు. ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగుమతులు 40.31 శాతం పెరిగి 5.17 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు 34.66 శాతం పెరిగి 9.6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అలాగే లోహాలు, పాల ఉత్పత్తుల ఎగుమతులు 48 శాతం, ఇంజినీరింగ్ ఉత్పత్తులు 8.76 శాతం, ఔషధ ఉత్పత్తులు 7.12 శాతం చొప్పున పెరిగాయి. సింగపూర్, తాంజానియా, శ్రీలంక, బంగ్లాదేశ్, హాంకాంగ్, మలేషియా, ఆస్ట్రేలియా, వియత్నాం దేశాలకు భారత ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. అయితే పశ్చిమాసియా దేశాలకు ఎగుమతులు 28 శాతం తగ్గి 4.16 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఇక బంగారం దిగుమతులు 81.69 శాతం పెరిగి 5.62 బిలియన్ డాలర్లకు చేరుకోగా, వెండి దిగుమతులు 157.16 శాతం పెరిగి 411 మిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. మరోవైపు ముడి చమురు దిగుమతులు 10 శాతం తగ్గి 18.7 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి.

# అమెజాన్‌పై వినియోగదారుల దావా

**వాషింగ్టన్, మే 16 :** అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాల వ్యవహారం ఇప్పుడు మరోసారి సంచలనంగా మారింది. ట్రంప్ చట్టవిరుద్ధంగా విధించిన సుంకాల కారణంగా వస్తువుల ధరలు పెరిగి తమపై అదనపు భారం పడిందని ఆరోపిస్తూ వినియోగదారులు ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ అమెజాన్‌పై సామూహిక దావా వేశారు. సియాటిల్ ఫెడరల్ కోర్టులో దాఖలైన ఈ వ్యాజ్యం అమెరికాలో తీవ్ర చర్చకు దారితీసింది. వినియోగదారుల ఆరోపణల ప్రకారం, ట్రంప్ విధించిన భారీ సుంకాల వల్ల దిగుమతి వస్తువుల ధరలు పెరిగాయి. ఆ అదనపు భారాన్ని అమెజాన్ నేరుగా వినియోగదారులపై మోపిందని వారు పేర్కొన్నారు. అనంతరం అమెరికా సుప్రీంకోర్టు ట్రంప్ సుంకాలను చట్టవిరుద్ధమని ప్రకటించినప్పటికీ, అమెజాన్ మాత్రం ప్రభుత్వానికి చెల్లించిన సుంకాల రీఫండ్‌ను వినియోగదారులకు తిరిగి ఇవ్వలేదని దావాలో ఆరోపించారు. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టాన్ని ఉపయోగించి ట్రంప్




విధించిన సుంకాలు తన అధికార పరిధికి మించినవని అమెరికా సుప్రీంకోర్టు గతంలో 6-3 మెజారిటీతో తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు తర్వాత అనేక కంపెనీలు ప్రభుత్వంనుంచి బిలియన్ల డాలర్ల రీఫండ్‌లు కోరడం ప్రారంభించాయి. అయితే అమెజాన్ మాత్రం ఆ మార్గాన్ని ఎంచుకోలేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. "అధ్యక్షుడి మన్ననలు పొందేందుకు అమెజాన్ వినియోగదారుల డబ్బును ఉపయోగించింది. ఇప్పటికే చెల్లనివిగా ప్రకటించిన సుంకాల భారాన్ని కస్టమర్లపై మోపడం అన్యాయం" అని వ్యాజ్యంలో పేర్కొన్నారు. అమెజాన్ చర్యలు వాషింగ్టన్ రాష్ట్ర వినియోగదారుల రక్షణ చట్టాలను ఉల్లంఘించాయని కూడా దావాలో ఆరోపించారు. ఇదే తరహాలో ఇప్పటికే కాస్ట్‌కో, నైక్, ఫెడెక్స్ వంటి సంస్థలపై కూడా వినియోగదారులు కేసులు దాఖలు చేసిన విషయం తెలిసిందే. అయితే వస్తువులను దిగుమతి చేసుకున్న కంపెనీలకు మాత్రమే ప్రభుత్వ రీఫండ్ వర్తిస్తుందని, వినియోగదారులు నేరుగా సుంకాల వాపసు కోరలేరని తాజా వ్యాజ్యంలో ప్రస్తావించారు. ఇంకా 2025 ఏప్రిల్‌లో ఒక ఉత్పత్తి ధరలో సుంకాల వాటా ఎంత ఉందో వినియోగదారులకు చూపించాలని అమెజాన్ యోచించిందని, ఆ సమయంలో వైట్ హౌస్ నుంచి వ్యతిరేకత ఎదురైందని వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఈ కేసుపై అమెజాన్ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు.

# ఇనార్బిట్ మాల్‌లో వేసవి సందడి

**హైదరాబాద్, మే 16:** నగరంలోని కుటుంబాలకు, చిన్నారులకు ఈ వేసవి సెలవుల్లో వినోదాన్ని అందించేందుకు సైబరాబాద్‌లోని ఇనార్బిట్ మాల్ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. 'ది గ్రేట్ సమ్మర్ ప్లేగ్రౌండ్' పేరుతో క్రీడలు, వినోదం, సృజనాత్మకతను కలగలిపిన ఈ వేడుకలు నెలరోజుల పాటు సందర్శకులను అలరించనున్నాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా మే 9 నుంచి 17 వరకు మాల్ సెంట్రల్ ఏట్రియంలో ఏర్పాటు చేసిన 'నింజా క్యాజిల్' చిన్నారులను విశేషంగా ఆకట్టుకుంటోంది. పిల్లల్లో చురుకుదనం, వేగం, శారీరక సమన్వయాన్ని పెంపొందించేలా రూపొందించిన ఈ ప్రత్యేక ఆటల జోన్‌లో పలు ఆసక్తికర గేమ్స్ అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా 'నింజా స్లాష్ జోన్'లో పిల్లలు మోషన్ ట్రాకింగ్ స్క్రీన్ ముందు నిలబడి గాలిలో వచ్చే పండ్లను నరికే వినూత్న ఆటను ఆస్వాదిస్తున్నారు. అలాగే పెయింటింగ్, పజిల్స్ వర్క్‌షాప్‌లు, నింజా రియాక్షన్ గేమ్స్, ఫోటో జోన్‌లు కూడా చిన్నారులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రతి చిన్నారికి "ఇనార్బిట్ సర్టిఫైడ్ నింజా" సర్టిఫికెట్ అందజేస్తున్నారు. వేసవి వేడుకల్లో భాగంగా మే 22 నుంచి 24 వరకు లెవెల్-1లో 'మ్యాంగో ఫెస్ట్' నిర్వహించనున్నారు. మామిడి పండ్లతో తయారుచేసిన వివిధ రకాల ప్రత్యేక వంటకాలు, స్వీట్లు, డెజర్ట్స్ సందర్శకులను ఆకట్టుకోనున్నాయి. ఇక మే 29 నుంచి జూన్ 7 వరకు సెంట్రల్ ఏట్రియంలో




'లెగో ప్లే జోన్' ఏర్పాటు చేయనున్నారు. ఇందులో పిల్లల ఆలోచనా శక్తి, నిర్మాణ నైపుణ్యాలను పెంపొందించేలా లెగో సవాళ్లు, ఫ్రీ ప్లే యాక్టివిటీలు నిర్వహించనున్నారు. వేసవి సెలవులను కుటుంబ సమేతంగా సరదాగా గడపాలనుకునే వారికి ఈ ప్రత్యేక కార్యక్రమాలు మంచి వినోదాన్ని అందించనున్నాయని మాల్ నిర్వాహకులు తెలిపారు.